www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

సోమవారం | 14-8-2017 | పేజీలు: 16 + 16 | వెల: రూ. 5.00 | సంపుటి: 14 సంచిక: 36 | శ్రీహేవళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం; తిథి: సప్తమి రా. 7.46 తదుపరి అష్టమి; నక్షత్రం: భరణి తె. 3.57 తదుపరి కృత్తిక; వర్జ్యం: మ. 2.13-3.45; దుర్ముహూర్తం: మ. 12.46-1.36, మ. 3.17-4.07; అమృతఘడియలు: రా. 11.22-12.57; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.02; సూర్యాస్తమయం: 6.39 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tanuku | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

ఊరికి ప్రమోషన్

త్వరలో మరిన్ని కొత్త మునిసిపాలిటీలు

పెద్ద సంఖ్యలో పంచాయతీలు కూడా

500 జనాభా ఉంటే పంచాయతీ ఏర్పాటు

గ్రామ పంచాయతీలుగా గిరిజన తండాలు

నగర పంచాయతీ కానున్న ఆసిఫాబాద్

మరికొన్నింటినీ పరిశీలిస్తున్న ప్రభుత్వం

ఈ ఏడాదే కసరత్తు.. త్వరలో ఉత్తర్వులు!



హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మునిసిపాలిటీలు, పంచాయతీల జాబితా పెరగనుంది. కొత్తగా మరిన్ని మునిసిపాలిటీలు, పంచాయతీలను ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సరిగ్గా ఏడాదిలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉండడం, స్థానిక సంస్థల్లో విభజనను పాలక మండళ్ల ఎన్నికలు జరగక ముందే చేపట్టాల్సి ఉండడంతో ఆలోపే వీటిపై నిర్ణయం తీసుకోవడంపై దృష్టి సారించింది. అయితే పట్టణ స్థానిక సంస్థలకు మాత్రం మరో రెండేళ్ల గడువు ఉంది. రాష్ట్రంలో ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ సహా 73 పట్టణ స్థానిక సంస్థలు, 8695 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కాగా నగర పంచాయతీ లేదా మునిసిపాలిటీగా అర్హత ఉండి కూడా.. ఇంకా పంచాయతీలుగా మిగిలిన వాటిని మునిసిపల్ సంస్థలుగా మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో పది నెలల క్రితమే జిల్లాలు, డివిజన్‌లు, మండలాలను పునర్వ్యవస్థీకరించిన విషయం తెలిసిందే. అదే క్రమంలో కొత్త పంచాయతీలు, మునిసిపాలిటీలను కూడా ఏర్పాటు చేయాలని సర్కారు భావిస్తోంది. కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా ఆసిఫాబాద్‌ను కుమరం భీం జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేశారు. కానీ, ఇది ఇంకా గ్రామ పంచాయతీగానే ఉంది. దీనిని నగర పంచాయతీ/మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. త్వరలో దీనిపై అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి. దీంతోపాటు

మిగతా 11వ పేజీలో...

ఒత్తిడి వల్లే డ్రగ్స్‌బాట

టెకీలపై పని భారం తగ్గించండి.. వేతనమిస్తున్నాం పనిచేయాలంటే కుదరదు

వేతనమొక్కటే పరిష్కారం కాదు .. తప్పుదారి పట్టకుండా చూడాల్సింది హెచ్ఆరే

డ్రగ్స్ పునరావృతమైతే కేసులే.. 2 ఐటీ కంపెనీలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్రెయిన్‌వాష్



11



పీసీసీ సమావేశంలో తెలంగాణ ఇన్‌చార్జి కుంతియా, ఉత్తమ్, జానా, భట్టి, యాష్కీ

పని చేస్తేనే పదవులు

ఇక నుంచి మరో లెక్క

గెలవాలంటే దూకుడు పెంచాల్సిందే

విభేదాలొద్దు.. ఐక్యంగా పని చేద్దాం

దళితుల సమస్యలపై పోరాడాలి

మైనారిటీలను అక్కున చేర్చుకోవాలి

ఎవరితోనూ పొత్తు అవసరం లేదు

బీసీల గొడవ ఎందుకొచ్చింది?

సమన్వయం.. కష్టపడితే అందలం

టీపీసీసీ సమావేశాల్లో కుంతియా

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి రామచంద్ర కుంతియా.. ఆ పార్టీ నేతలకు గట్టి వార్నింగే ఇచ్చారు. ఇప్పటి దాకా ఒక లెక్క.. ఇకపై మరో లెక్క అన్న రీతిలో హెచ్చరించారు. పనిచేసే వారికే పదవులు ఉంటాయని, లేదంటే అంతే సంగతులని స్పష్టం చేశారు. వ్యక్తిగత విభేదాలు వీడి పని చేయాలని, పార్టీ గెలుపు కోసం కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేయడాన్ని మానుకోవాలన్నారు. ఎవరైనా

మిగతా 14వ పేజీలో...



సంస్కరణలకు టాటా?

ప్రజాకర్షణ దిశగా మోదీ

ఏడాదిన్నరలోనే సార్వత్రిక ఎన్నికలు

ఇప్పటి నుంచే వ్యూహాత్మక అడుగులు

సాధించింది చెప్పుకోవడంపై దృష్టి

చేపట్టిన ప్రాజెక్టుల పూర్తి లక్ష్యం

అవినీతి, బినామీలపై ఉక్కుపాదం

ఆర్థిక వేత్త సన్యాల్ విశ్లేషణ

16



హిమాచల్‌లో విరిగిన కొండచరియలు

ఇద్దరు తెలంగాణవాసులు సహా 50 మంది మృతి?

రియల్టీకి డబుల్ దెబ్బ

జీఎస్టీ.. ఆపై రెరా..

కొత్త చిక్కులతో రంగం కుదేలు

20 శాతం పెరగనున్న ధరలు

చిన్న బిల్డర్లకు భవిష్యత్తు శూన్యం

పెద్ద బిల్డర్లలోనూ అసంతృప్తి

(ఆంధ్రజ్యోతి బిజినెస్ డెస్క్)

హైదరాబాద్ శివారు బోడుప్పల్‌లో ఇల్లు కొనుక్కోవాలనుకున్న ఏజీ ఆఫీస్ ఉద్యోగి వెంకట్రావ్ (పేరు మార్చాం) గేటెడ్ కమ్యూనిటీ పేరుతో 170 గజాల స్థలంలో ఇళ్లను నిర్మించి విక్రయిస్తున్న ఒక సంస్థను సంప్రదించాడు. 1100 చదరపు అడుగుల వైశాల్యంతో నిర్మిస్తున్న 2 బీహెచ్‌కే ఇంటికి సుమారు రూ.60 లక్షలు అవుతుందని చెప్పారు. అదే ప్రాంతంలో, అంతే విస్తీర్ణంలో ఓ మేస్త్రీ కట్టించి ఇస్తున్న ఇంటి ధర రూ.50 లక్షలు చెప్పాడు. వ్యవస్థీకృత రంగానికి, అవ్యవస్థీకృత రంగానికి మధ్య ధరల్లో ఉన్న తేడా ఇది. ఇది వెంకట్రావ్ ఒక్కడి అనుభవమే కాదు. సొంత ఇంటి వేటలో ఉన్న వేలాది మంది

మిగతా 11వ పేజీలో...



ఖాకీ కూతురు తల్చుకుంటే..

కూతురి భూ వివాదంలో తలదూర్చిన అదనపు డీసీపీ

రూ.60 లక్షలకు 3 చెక్కులపై బలవంతంగా సంతకాలు

సైబరాబాద్ కమిషనర్ ఆదేశంపై తండ్రిపై కేసు నమోదు

14

తుంగలో దొంగ

తుంగభద్ర ఎగువనా కర్ణాటక భారీగా లిఫ్టులు

అదనంగా 90 టీఎంసీల వాడకం

శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టుల వెలవెల

హైదరాబాద్ తాగునీటికి గండం

14



ఫ్యామిలీ.. ఫ్యామిలీ పైలట్లే..

తాత, తల్లిదండ్రులు, ఇద్దరు పిల్లలూ పైలట్లే

న్యూఢిల్లీ, ఆగస్టు 13: కుటుంబంలో ఎవరైనా పైలట్‌గా ఎంపికైతే వారి బంధువర్గంలో అదో న్యూస్! మరి.. ఓ కుటుంబంలో తల్లిదండ్రులు, వారి ఇద్దరి పిల్లలు, తాత ఇలా అంతా పైలట్లుగా ఉంటే అదో అద్భుతమే కదా! దివంగత కెప్టెన్ జైదేవ్ భాసిన్ కుటుంబం విశిష్టత ఇది. జైదేవ్ భాసిన్.. ఆయన కుమారుడు కెప్టెన్ రోహిత్ భాసిన్.. కోడలు నివేదితా జైన్.. మనవడు రోహన్ భాసిన్, మనవరాలు నిహారిక భాసిన్ అందరూ పైలట్లే! జైదేవ్ 1954లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ కమాండర్‌గా ఎంపికయ్యారు. అప్పట్లో దేశంలో ఈ హోదా ఉన్న కేవలం ఏడుగురు పైలట్లలో జైదేవ్ ఒకరు. తర్వాత ఆయన కోడలు నివేదితా జైన్ ఈ హోదాను సాధించి.. అప్పటికి దేశంలోని ముగ్గురు మహిళా కమాండర్లలో ఒకరిగా నిలిచారు. నివేదితా జైన్‌కు ఇప్పుడు 54 ఏళ్లు. తన ఇరవై ఏళ్ల వయసులో 1984 జూన్ 29న ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు ఎంపికయ్యానని ఆమె తన పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. 26 ఏళ్ల వయసులోనే బోయింగ్ 737ను నడిపి... అప్పటికి ప్రపంచంలోనే అతి పిన్న వయసు మహిళా కెప్టెన్‌గా రికార్డు సృష్టించానని చెప్పారు. రోహన్ అయితే చిన్నారిగా ఎల్కేజీ ఇంటర్వ్యూలో తనను తాను కెప్టెన్ రోహిత్ భాసిన్‌గా పరిచయం చేసుకున్నాడట. కూతురు నిహారిక బ్యూటిషియన్‌గా స్థిరపడాలని తల్లిదండ్రులు కోరుకున్నా.. అకాడమీలో టాప్ రావడంతో ఓకే చెప్పక తప్పలేదట. నిహారిక కూడా త్వరలోనే ఓ పైలట్‌నే పెళ్లాడనుందట.

లోకం తీరు



నా కొడుకును ఆదుకోరా సారూ!

- కారు ప్రమాదంలో బాలుడికి విరిగిన వెన్నెముక
- వైద్యానికి ఇప్పటిదాకా రూ. 7 లక్షల ఖర్చు



మంచానికే పరిమితమైన ప్రశాంత్; (ఇన్‌సెట్) తల్లి రాజ్యలక్ష్మి

ముషీరాబాద్/హైదరాబాద్: ఓ పోకిరి ర్యాష్ డ్రైవింగ్.. ఆడుతూ పాడుతూ తిరిగే ఆ బాలుడిని మంచానికే పరిమితం చేసింది. కుమారుడికి నయం చేయించేందుకు ఆ నిరుపేద తల్లిదండ్రులు ఇంట్లో ఉన్న కాస్త బంగారాన్ని అమ్మారు. దొరికిన చోటల్లా అప్పు చేశారు. ఆరు ఆపరేషన్లు చేయించి రూ.7 లక్షలు ఖర్చు చేశారు. అయినా.. బాలుడి ఆరోగ్య పరిస్థితిలో మార్పు రాలేదు. మెరుగైన వైద్యం లభిస్తే బాలుడు కోలుకుంటాడని డాక్టర్లు చెబుతున్నా.. ఏం చేయలేని పరిస్థితి ఆ తల్లిదండ్రులది. హైదరాబాద్‌లోని భోలక్‌పూర్ డివిజన్ మహాత్మానగర్‌లో ఉంటున్న శ్రీనివాస్, రాజ్యలక్ష్మి దంపతుల దీనగాథ ఇది. దిక్కుతోచని స్థితిలో తమను సీఎం కేసీఆర్ ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. శీనివాస్ ఫ్లెక్సీ బోర్డులు కట్టే పనిచేస్తుండగా.. రాజ్యలక్ష్మి ఇళ్లలో పాచిపనులు చేస్తోంది. వీరికి ప్రణయ్(20), ప్రశాంత్(11) కుమారులు. ప్రణయ్ డిగ్రీ, ప్రశాంత్ ఆరు చదువుతున్నారు. నిరుడు జూన్ 26న ఇంటి ముందు ఆడుకుంటుండగా.. ఓ బాలుడు కారు నడుపుతూ వేగంగా వచ్చి ప్రశాంత్‌ను ఢీకొట్టాడు. డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి వెన్నెముక, కుడి కాలు, కుడిచేయి విరిగిపోయాయని.. మూత్రనాళం పగిలిపోయిందని తెలిపారు. మాదాపూర్‌లోని మ్యాక్స్‌కేర్ ఆస్పత్రి వైద్యులు ప్రశాంత్‌కు ఆరు ఆపరేషన్లు చేశారు. ఇందుకు రూ.7 లక్షలు ఖర్చయింది. పగిలిన మూత్రనాళానికి ఆపరేషన్ చేయించాలంటే రూ.3 లక్షల దాకా ఖర్చవుతుందని, ఆరోగ్యశ్రీ చిన్నారులకు వర్తించదని డాక్టర్లు చెప్పారని తల్లిదండ్రులు చెప్పారు. కాలుకు ఆపరేషన్ సమయంలో ఏర్పాటు చేసిన రెండు రాడ్లు తొలగించాలని డాక్టర్లు సూచించినప్పటికీ డబ్బుల్లేకపోవడంతో తీయించలేదని చెప్పారు. సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకుంటే రూ.75వేలు మంజూరు చేశారని, అయితే, ఓ రుణదాత ఆ చెక్కును బలవంతంగా లాక్కున్నారని రాజ్యలక్ష్మి చెప్పారు. తమ కుమారుడి వైద్యం కోసం దాతలు పెద్ద మనసుతో ఆదుకోవాలని ఆమె విజ్ఞప్తిచేశారు. సాయం చేయాలనుకునేవారు 9700775598/ 9032275651 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సాహితీ శిఖరాలకు పట్టం

సుద్దాల, జయరాజ్, భాష్యం విజయసారథికి పురస్కారాలు.. పంద్రాగస్టున సీఎం చేతుల మీదుగా ప్రదానం

హైదరాబాద్, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ముగ్గురు సాహితీ ప్రముఖులకు విశిష్ట పురస్కారాలను అందించనుంది. గీత రచయితలు సుద్దాల అశోక్‌తేజ, జయరాజ్‌తోపాటు సంస్కృత, తెలుగు భాషా విద్వాంసుడు భాష్యం విజయసారథి.. సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఈ నెల 15న ఈ అవార్డులు అందుకోనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది.



పాటల్లో మేటి.. అశోక్‌తేజ

ప్రముఖ కవి, సినీ పాటల రచయితగా గుర్తింపు పొందిన సుద్దాల అశోక్‌తేజ 1954లో నల్లగొండ జిల్లా సుద్దాలలో జన్మించారు. ఈయన తండ్రి సుద్దాల హనుమంతు తెలంగాణ సాయుధ పోరాటయోధుడే కాదు.. మంచి కవి కూడా. అశోక్ తేజ ఇప్పటి వరకు 11 పుస్తకాలు రాశారు. సుమారు 1250 సినిమాల్లో 2,225కు పైగా పాటలు రాశారు. రెండు సార్లు నంది అవార్డు అందుకున్నారు. 2003లో ఠాగూర్ సినిమాలో రాసిన 'నేను సైతం' పాటకు జాతీయ అవార్డు పొందారు. తెలంగాణ నుంచి ఈ అవార్డు అందుకున్న మొదటి వ్యక్తి అశోక్‌తేజ కావడం గమనార్హం. స్వచ్ఛభారత్ కార్యక్రమానికి బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న అశోక్ తేజ.. పాటల రచయితగా తన ప్రస్థానం మొదలు పెట్టక ముందు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించారు.

ఆనందంగా ఉంది

నాకు లభించిన ఈ అవార్డు.. సామాజిక సాహిత్యానికి వచ్చిందని భావిస్తున్నా. సి.నారాయణ రెడ్డి నాకు ఆదర్శం. నా సాహిత్యాన్ని గుర్తించి ప్రభుత్వం అవార్డు ఇచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. తెలుగు రాష్ట్రాల్లో 150 కేంద్రాల్లో శ్రమకావ్యం పుస్తకాన్ని గానం చేయాలనే ఆలోచనలో ఉన్నా. ఇప్పటి వరకు 31 కేంద్రాల్లో గానం చేశా.

– అశోక్ తేజ

ప్రకృతి కవి.. జయరాజ్



ప్రముఖ కవి, పాటల రచయిత జయరాజ్ మహబూబాబాద్ జిల్లా గుమ్మనూరులో 1964లో జన్మించారు. ప్రకృతిపై ఎక్కువగా పాటలు రాయడంతో ఆయన ప్రకృతి కవిగా పేరొందారు. ఇప్పటి వరకు నాలుగు పుస్తకాలు రచించారు. ఈయన రాసిన 'పుస్తకాల్లో జ్ఞాపకాలు' పుస్తకం అత్యంత ప్రజాదరణ పొందింది. తెలంగాణ పోరాటం, దళిత సామాజికం, అక్షర ఉద్యమం, సారా ఉద్యమంతోపాటు 25 సినిమాలకు పాటలు రాశారు. అడవిలోఅన్న సినిమా కోసం రాసిన 'వందనాలమ్మా', దండోరా సినిమాలో రాసిన 'కొండల్లో కోయిల పాటలు పాడాలి' పాటలు అత్యంత ప్రజాధరణ పొందాయి. ప్రస్తుతం జయరాజ్ సింగరేణి కాలనీస్ హైదరాబాద్ హెడ్ ఆఫీసులో సీనియర్ టెక్నీషియన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

ప్రకృతికి వచ్చిన అవార్డు

ప్రకృతిపైనే నేను ఎక్కువగా పాటలు రాశా. ఈ అవార్డు ప్రకృతికి వచ్చిన అవార్డుగా భావిస్తున్నా. జీవితం, పాట వేరు కాదని నమ్మా.. అలాగే జీవించా. పాటకు తలమానికం తెలంగాణ.

– జయరాజ్

సంస్కృత భాషా వారధి.. విజయసారథి

కవిగా సుపరిచితులైన భాష్యం విజయసారథి సంస్కృతంలో వెయ్యికిపైగా గ్రంథాలు రాశారు. తెలుగులో విమర్శనాత్మక రచనలు చేశారు. వరంగల్‌లోని విశ్వేశ్వర సంస్కృత ఆంధ్రా కళాశాలలో అధ్యాపకుడిగా 36 ఏళ్లపాటు విధులు నిర్వర్తించారు. అనంతరం సర్వవైదిక ఆర్గనైజేషన్‌ను స్థాపించి యజ్ఞవరాహ క్షేత్రం ఆలయాన్ని కరీంనగర్‌లో నిర్మించారు. 1936లో కరీంనగర్ జిల్లా చేగుర్తి గ్రామంలో విజయసారథి జన్మించారు.

ఆయన రాసిన మంథాకిని, భారతభారతి, రాసకేళి, ప్రవీన భారతం, రోచిస్మతి, విషాధ లహరి, పరివాదిని వంటి పలు గ్రంథాలు పేరొందాయి. 1996లో కేకే బిర్లా పౌండేషన్ నుంచి వాచస్పతి పురస్కారం, 1994లో తిలక్ మహారాష్ట్ర విద్యాపీఠ్ నుంచి 'ఇందిర బిహారే' గోల్డ్ మెడల్‌ను అందుకున్నారు. ఆంధ్రా సారస్వత పరిషత్ మహాకవి అనే బిరుదును ఇచ్చింది. 1992లో అప్పటి గవర్నర్ కృష్ణకాంత్ చేతుల మీదుగా స్వర్ణకంకణం అందుకున్నారు.

సంస్కృతాన్ని గుర్తించారు

తెలంగాణలో సంస్కృత భాషను గుర్తించి అవార్డు ఇస్తున్నందుకు సంతోషంగా ఉంది. కేసీఆర్ సంస్కృత భాషను గుర్తించారు. అవార్డు ఇచ్చినందుకు ధన్యవాదాలు.

– భాష్యం విజయసారథి

ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	20.4	33.5
హైదరాబాద్	21.9	29.2
నిజామాబాద్	23.9	30.9
సంగారెడ్డి	24.0	29.0
నల్లగొండ	24.0	34.5
ఖమ్మం	25.0	30.0

రేపటి నుంచి పెరగనున్న వానలు

హైదరాబాద్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మంగళవారం నుంచి వర్షాలు పెరగనున్నాయని, చాలాచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. సోమవారం కొన్ని చోట్ల మోస్తరుగా, బుధ, గురు వారాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. కాగా, ఆదివారం పలు చోట్ల మోస్తరువర్షాలు పడ్డాయి. ఆదిలాబాద్‌లో 1.4 సెంటీమీటర్లు, హైదరాబాద్‌లో 3 మిల్లీమీటర్లు, ఖమ్మంలో 2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.



కశ్మీర్ నుంచి పరారవుతున్న ఉగ్రవాదులు

భారత ప్రభుత్వం చేపట్టిన చర్యలతో కశ్మీర్ లోయ నుంచి ఉగ్రవాదులు పరారవుతున్నారు. ఉగ్రవాదాన్ని సమూలంగా తుడిచిపెట్టడమే ప్రభుత్వ లక్ష్యం. కేంద్రం పెద్దనోట్లను రద్దు చేయడం, విదేశీ అక్రమ నిధుల ప్రవాహానికి జాతీయ దర్యాప్తు సంస్థ అడ్డుకట్ట వేయడం తో ఉగ్రవాదులు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నారు.

– రక్షణ శాఖ మంత్రి అరుణ్ జైట్లీ



14 రాష్ట్ర శాఖల మద్దతు శరద్‌కే!

"దేశంలోని 14 రాష్ట్ర శాఖల మద్దతు జేడీయూ సీనియర్ నేత శరద్ యాదవ్‌కే ఉంది. పార్టీ అధ్యక్షుడు నితీశ్ కుమార్‌కు బిహార్ ఒక్కటే మద్దతుగా ఉంది. ఇద్దరు రాజ్యసభ ఎంపీలు, కొంత మంది జాతీయ ఆఫీస్‌బేరర్లు కూడా శరద్‌కే మద్దతిస్తున్నారు. మేము పార్టీని వీడే ప్రసక్తే లేదు."

– అరుణ్ శ్రీవాస్తవ(శరద్ మద్దతుదారు) జేడీయూ గుజరాత్ మాజీ జనరల్ సెక్రటరీ

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.71.74	పాత ధర 61.90
కొత్త ధర రూ.71.95	కొత్త ధర 61.90
పెరుగుదల 21 పైసలు	మార్పు లేదు

అనాథ బాలికను చదివించి.. పెళ్లి చేసి

ఓ ప్రైవేటు స్కూల్ ప్రిన్సిపాల్ ఔదార్యం

షాద్‌నగర్‌టౌన్, ఆగస్టు 13: బోధనతోనే బాధ్యత తీరదని.. విద్యార్థి బాగు గురించి తరగతి గది నాలుగు గోడల పరిధిని దాటి ఆలోచించేవాడే సిసలైన ఉపాధ్యాయుడు అనిపించుకుంటారని ఆయన నిరూపించారు. నా అనేవాళ్లెవరూ లేని బాలికకు చదువు చెప్పించడమే కాదు.. పెళ్లీడుకొచ్చిన ఆమెకు ఓ పెద్దగా వ్యవహరించి రూ.2లక్షల దాకా వెచ్చించి ఘనంగా పెళ్లి జరిపించారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు చెందిన ఠాగూర్ హైస్కూల్ ప్రిన్సిపాల్‌రాజేంద్రప్రసాద్ ఔదార్యమిది. ఆయన ఆశీస్సులతో ఓ ఇల్లాలు కూడా అయిన ఆ అమ్మాయి పేరు విమల. ఆమె తల్లిదండ్రులు మంజుల, వెంకటేశ్ నిరుపేదలు. ఇద్దరూ ఠాగూర్ స్కూల్లోనే అటెండర్లుగా పనిచేసేవారు. వీరికి విమలతో పాటు శివ అనే కుమారుడున్నాడు. ఓ అగ్ని ప్రమాదంలో వారిద్దరూ ప్రాణాలు కోల్పోవడంతో విమల, శివను ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ చేరదీశారు. విమలను చదివించడమే కాదు.. టీచర్‌గానూ ఉద్యోగం ఇచ్చారు. ఇటీవల విమలకు దగ్గరి బంధువు కుమారుడితో పెళ్లి కుదరింది. ఈ మేరకు ఆదివారం శుభ ముహూర్తం ఉండడంతో తన పాఠశాల ఆడిటోరియంలో విమల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు.



నూతన వధూవరులతో స్కూల్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్

పాట తీసిన ప్రాణం!

- ఇయర్ ఫోన్లతో వింటూ వ్యసనం
- చెవుడు వచ్చినా వదలని వైనం
- పట్టాలు దాటుతూ రైలు ఢీకొని మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 13: 'పాటే నా ప్రాణం' అని ఎంతోమంది అంటారు! కానీ... పాటే అతడి ప్రాణం తీసింది. చెవుడొచ్చినా, పెద్ద శబ్దంతో పాటలు వినడమనే వ్యసనమే... బలితీసుకుంది. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరుకు చెందిన సువ్వా శ్యామ్ కుమార్ (25) వడ్రంగిగా పని చేసేవాడు. సెల్‌ఫోన్‌కు ఇయర్ ఫోన్స్ పెట్టుకుని పాటలు వినడం అతడికి మహా సరదా. పెద్ద సౌండుతో పాటలు వినడంతో కొన్నాళ్ల క్రితం వినికిడి శక్తి కోల్పోయాడు. అయినప్పటికీ శ్యామ్ ఆ అలవాటును వదులుకోలేకపోయాడు. సౌండు మరింత పెంచి పాటలు వినేవాడు. శనివారం ఉదయం ఎప్పట్లాగానే చెవిలో ఇయర్ ఫోన్స్ పెట్టుకుని పాటలు వింటూ బయలు దేరాడు. మార్గమధ్యంలో ఏలూరు పవరుపేట వద్ద రైలు పట్టాలు దాటుతున్నాడు. అదే సమయంలో అటువైపు వస్తున్న రైలును గమనించలేదు. దాని శబ్దమూ వినిపించలేదు. రైలు ఢీ కొనడంతో శ్యామ్‌కుమార్ అక్కడే చనిపోయాడు.



ఈ పోలీస్.. హాంకాంగ్ 'పోకిరి'!


- 299 మంది గ్యాంగ్‌స్టర్‌లను పట్టించిన అధికారి




హాంకాంగ్, ఆగస్టు 13: పోకిరి సినిమా చూశారా? అందులో పోలీస్ అధికారి అయిన హీరో అండర్‌కవర్ ఆపరేషన్‌లో భాగంగా మాఫియాలో చేరి వారిని తుదముట్టిస్తాడు. అచ్చం అలాగే హాంకాంగ్‌కు చెందిన ఓ పోలీసాఫీసర్ దాదాపు 11 నెలల పాటు అండర్‌కవర్ ఆపరేషన్‌లో పాల్గొని 299 మంది గ్యాంగ్‌స్టర్‌లను పట్టించాడు. అందుకోసం అతను తన ప్రాణాలను సైతం ప్రమాదంలో పెట్టాడు. ఈ దశాబ్దంలో ఇదే అత్యంత ప్రమాదకర ఆపరేషన్ అని హాంకాంగ్ పోలీస్ శాఖ పేర్కొంది. హాంకాంగ్‌లో పెరిగిపోతున్న మాఫియా ఆగడాలను అరికట్టడానికి ఓ పోలీస్ అధికారి అండర్‌కవర్ ఆపరేషన్‌కు సిద్ధపడ్డాడు. పేరు మార్చుకున్నాడు, కుటుంబ సభ్యులు, స్నేహితులతో పూర్తిగా సంబంధాలు తెంచుకున్నాడు. తనని ఎవరూ గుర్తుపట్టకుండా ఉండేందుకు దాదాపు 13 కిలోల బరువు తగ్గాడు. ఆ తర్వాత ఎలాగోలా కష్టపడి మాఫియాలో చేరిపోయాడు. అయితే గ్యాంగ్‌స్టర్‌ల నమ్మకాన్ని చూరగొనడానికి ఎంతో కష్టపడ్డాడట. మొదట్లో అతణ్ని చాలామంది నమ్మలేదట. అతనికి కఠినమైన పరీక్షలు పెట్టేవారట. అండర్ కవర్ ఆపరేషన్ నేపథ్యంలో తెరకెక్కిన 'ఇన్‌ఫెర్నల్ ఆఫైర్స్' సినిమాలోని పాటలు పాడుతూ ఇతని ముఖకవళికలు గమనించేవారట. అలా అనుక్షణం ప్రాణభయంతో పనిచేస్తూనే గ్యాంగ్‌స్టర్‌ల స్థావరాల గురించి పోలీసులకు సమాచారమిచ్చాడు ఆ పోలీస్ అధికారి. అలా 299 మంది గ్యాంగ్‌స్టర్‌లను పట్టించాడట. నిజానికి ఇలాంటి అండర్‌కవర్ ఆపరేషన్‌లు ఆర్నెల్లకు మించి సాగవని, ఇది అత్యంత ప్రమాదకర సాహసమని పోలీస్ బాస్‌లు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఆ అధికారి సెలవులో ఉన్నాడని, భద్రత కారణాల దృష్ట్యా అతనికి ప్రభుత్వం తపాకీని కూడా అందజేసిందని తెలిపారు. అతను తిరిగి విధుల్లో చేరిన తర్వాత అతనికి పదోన్నతి కల్పిస్తామని చెప్పారు.

బాలిక శీలానికి.. రూ.2వేలు

- తాట్లవాయి పంచాయితీ పెద్దల దారుణం.. మరో ఘటనలో బాలికకు 5నెలల గర్భం



రాయికల్, బీర్కూర్, ఆగస్టు 13: ఆ ఊరి పెద్దలు.. పెద్దరికం మరిచారు. అయ్యా! న్యాయం చేయండి అని మొరపెట్టుకుంటే బాలిక శీలానికి వెలకట్టారు. ఈ దారుణ ఘటన జగిత్యాల జిల్లా రాయికల్ మండలం తాట్లవాయి గ్రామ పంచాయతీ పరిధిలోని మోతీలాల్ తండాలో జరిగింది. తండాకు చెందిన బాలిక ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. ఈ నెల 11న పాఠశాలకు వెళ్లి ఇంటికి వస్తుండగా అదే గ్రామానికి చెందిన గోపాల్ మార్గమధ్యలో అడ్డగించి ఇంటి వద్ద దింపుతానని బైక్‌పై ఎక్కించుకున్నాడు. సమీప అడవిలోకి తీసుకెళ్లి ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టి అక్కడి నుంచి పారిపోయాడు. రాత్రికి ఇంటికి చేరుకున్న బాలిక ఘటనను తల్లిదండ్రులకు వివరించింది. శనివారం బాధిత కుటుంబం గ్రామ సర్పంచ్ మహేశ్‌కు తెలుపగా నిందితుడిని పిలిపించి విచారించారు. నిందితుడికి విధించిన జరిమానా రూ.2వేలు తీసుకుని కూతుర్ని ఆస్పత్రిలో చూపించమని సలహా ఇవ్వడంతో బాలిక తల్లి అక్కడి నుంచి వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో సర్పంచ్ మహేశ్, నిందితుడు గోపాల్‌పై కేసు నమోదు చేశారు. మరో ఘటనలో.. కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన బాలిక(14)పై అదే గ్రామానికి చెందిన వినోద్ పలుమార్లు అత్యాచారానికి పాల్పడి గర్భవతిని చేశాడు. సదరు బాలిక అధికారులకు ఫిర్యాదు చేసింది.



జైపూర్‌లో నిర్వహించిన సైనిక ఆయుధాల ప్రదర్శనలో భాగంగా రాకెట్ లాంచర్‌ను భుజంపై ఉంచుకుని ప్రయోగించే విధానాన్ని పరిశీలిస్తున్న ఓ ఔత్సాహికురాలు

రెడ్‌మీ నోట్–4లో మంటలు!

- ప్యాంటులో పేలిన ఫోన్
- యువకుడి తొడకు తీవ్ర గాయం

రావులపాలెం రూరల్, ఆగస్టు 13: ఆ మధ్య కాలంలో శామ్‌సంగ్ గెలాక్సీ నోట్-7 ఫోన్ ఎడాపెడా పేలిపోతూ వినియోగదారులను భయభ్రాంతులకు గురిచేసింది. ఇప్పుడు చైనాకు చెందిన రెడ్‌మీ నోట్-4 ఫోన్ పేలుడు కలకలం రేపుతోంది. గత నెల చివరలో బెంగళూరులో ఓ యువకుడి కొత్త రెడ్‌మీ నోట్-4 సిమ్ కార్డు మారుస్తుండగా పేలిపోగా... ఇప్పుడు తూర్పు గోదావరి జిల్లాలో ఇలాంటి సంఘటన జరిగింది. రావులపాలెం గ్రామానికి చెందిన భావన సూర్యకుమార్‌కు కిళ్లీ కొట్టు ఉంది. ఆయన 20 రోజుల క్రితమే కొత్త రెడ్‌మీ నోట్-4 ఫోన్ కొన్నాడు. ఆదివారం ఇంటి నుంచి షాపునకు సైకిల్ మీద బయలుదేరాడు. మార్గమధ్యంలో ప్యాంటు జేబులోని సెల్‌ఫోన్ నుంచి తీవ్రంగా వేడి తగలింది. సెల్‌ఫోన్‌ను జేబులో నుంచి బయటకు తీసే ప్రయత్నంలోనే చిన్న శబ్దంతో పేలిపోయింది. సెల్ పౌచ్ పూర్తిగా కాలిపోయి తొడకు అతుక్కుపోయింది. దీంతో సూర్యకుమార్ తొడకు తీవ్ర గాయమైంది. ఈ సంఘటనపై రెడ్‌మీ కంపెనీకి సమాచారం అందిస్తానని... పోలీసులకు కూడా ఫిర్యాదు చేస్తానని సూర్యకుమార్ తెలిపాడు.



ఆవేదనను వ్యక్తపరిస్తేనే ఆరోగ్యం!

లాస్ ఏంజెలిస్, ఆగస్టు 13: ఎవరిపైనైనా కోపం వస్తే ఏం చేస్తాం. కొందరు ఎదుటి వారు బాధపడతారేమోనని ఆ కోపాన్ని తమలోనే అణిచేసుకుంటారు. మరికొందరు బయటికి వ్యక్తపరుస్తారు. అయితే, తనలోనే కోపాన్ని, ఉద్వేగాన్ని, ఆవేదనను దాచుకునే వారు మానసిక ఒత్తిడికి గురవుతారట. అదే బాధను గానీ, కోపాన్ని గానీ బయటికి కక్కేస్తే ఆరోగ్యంగా ఉంటామని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ బెర్కెలే పరిశోధకులు తెలిపారు. దాదాపు 1,300 మందిని పరీక్షించగా భావోద్వేగాలను దాచుకున్నవారు తీవ్ర ఒత్తిడికి గురై మానసికంగా అనారోగ్యం పాలైనట్లు తమ పరిశోధనల్లో వెల్లడైందని వివరించారు.



యాదాద్రి దర్శన క్యూలైన్లలో భక్తులు

కిటకిటలాడిన ఆలయాలు

యాదాద్రిటౌన్/భద్రాచలం/అనంతగిరి:శ్రావణ మాసం.. వరుస సెలవులు రావడంతో ఆదివారం యాదాద్రి, భద్రాద్రి క్షేత్రాల్లో భక్తుల సందడి నెలకొంది. భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి సన్నిధికోలాహలంగా మారింది. స్వామి కి మొక్కులు తీర్చుకునేందుకు జనం క్యూలైన్లలో బారులు తీరా రు. ధర్మదర్శనానికి 4గంటలు, ప్రత్యేక దర్శనాలకు 2గంటల సమయం పట్టింది. స్వామివారి నిత్య కల్యాణోత్సవంలో 100కు పైగా దంపతులు పాల్గొన్నారు. స్వామివారికి ఆదివారం భక్తుల నుంచి రూ.25,58,489 ఆదాయం సమకూరినట్టుఅధికారులు తెలిపారు. భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. రెండు రోజులుగా వేలాది మంది భక్తులు రామయ్య దర్శనం కోసం వస్తున్నారు. ఆదివారం స్వామివారి నిత్య కల్యాణంలో 179 జంటలు పాల్గొన్నాయి. అలాగే సువర్ణ పుష్పపూజలో 141 మంది పాల్గొన్నారు. 50 వేల మందికి పైగా భక్తులు దర్శించుకుని ఉంటారని అంచనా. కాగా ఒక్క రోజులోనే భద్రాద్రి రామయ్యకు రూ.9.92 లక్షల ఆదాయం సమకూరింది. వరుస సెలవులు రావడంతో అనంతగిరికి ఆదివారం భక్తులు, పర్యాటకులు పోటెత్తారు. అనంత పద్మస్వామిని దర్శించుకునేందుకు బారులు తీరారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో దేవాలయంలో అర్చన, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిలిపివేశారు. కేవలం దర్శనానికి మాత్రమే అనుమతించారు. ఆల య పరిసర ప్రాంతాలు భక్తులతో సందడిగా మారాయి. అదే విధంగా అనంతగిరిలోని మహానంది ఘాట్ వద్ద పెద్ద ఎత్తున పర్యాటకులు సందడి చేశారు.

బాసర ఆలయ అభివృద్ధికి కృషి: ఎంపీ కవిత



బాసర ఆలయంలో దర్శనం చేసుకుంటున్న ఎంపీ కవిత దంపతులు

బాసర, ఆగస్టు 13 : బాసర పుణ్యక్షేత్ర అభివృద్ధికి కృషిచేస్తానని నిజామాబాద్ ఎంపీ కవిత తెలిపారు. ఆదివారం ఆమె బాసరలో అమ్మవారిని దర్శించుకున్నారు. కవిత దంపతులు కుటుంబసభ్యులతో తెల్లవారుజామున 4 గంటలకు జరిగే అమ్మవారి అభిషేక పూజకు హాజరయ్యారు. అనంతరం తన మరిది కుమార్తె ఆరాధ్యకు అమ్మవారి సన్నిధిలో అక్షరశ్రీకార పూజలు జరిపించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ భద్రాద్రి, యాదాద్రి తరహాలోనే బాసర పుణ్యక్షేత్రాన్ని కూడా అభివృద్ధి చేయనున్నట్లు ఆమె చెప్పారు. రూ.125 కోట్ల వ్యయంతో బాసర ఆలయ అభివృద్ధి ప్రణాళిక ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందని ఆలయ చైర్మన్ కవితకు గుర్తుచేశారు. దీనిపై సీఎం కేసీఆర్ వద్ద ప్రస్తావించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు బాసర ఆలయంలో జరిగే అవినీతి, అక్రమాలపై ఎంపీకి విన్నవించారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు: చాడ



హుజూరాబాద్, ఆగస్టు 13: ప్రతిపక్షాల నేతలను అరెస్టు చేసి ఉద్యమాలను ఆపలేరని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాసంఘాలు, ప్రతిపక్షాలపై ఆంక్షలు విధిస్తున్న ప్రభుత్వం అక్రమ అరెస్టు లు చేసి ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసిందన్నారు. ఉద్యమ నాయకులను అరెస్టు లు చేసి కేసులు పెట్టేందుకే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామా? అని ప్రశ్నించారు. జేఏసీ స్ఫూర్తి యాత్రలో కోదండరాంను అరెస్టు చేయడం సరికాదన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతిపక్షాలు నిర్మాణాత్మకంగా సహకరిస్తున్నాయన్నారు. ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్న ప్రభుత్వ వైఖరిపై ఆత్మగౌరవ పోరాటం చేస్తామన్నారు.

హామీలు నెరవేర్చేవరకు వేటకుక్కల్లా వెంటబడతాం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



సంగారెడ్డి టౌన్ : గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ముఖ్యమంత్రి కేసీఆర్ వెంట వేటకుక్కల్లా వెం టపడతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హెచ్చరించారు. సంగారెడ్డిలో ఆదివారం నిర్వహించిన టీ- మాస్ ఆవిర్భావ సభలో మాట్లాడుతూ మాయమాటలతో అధికారంలోకి వ చ్చిన కేసీఆర్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నదన్నా రు. ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్నదన్నారు. ఎన్నో ఉద్యమాలు, ఎందరో ప్రాణత్యాగాల వల్ల సాధించుకున్న తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ సామాజిక న్యాయాన్ని పూర్తిగా విస్మరించారని ప్రజాగాయకుడు గద్దర్ విమర్శించారు. తన కేబినెట్‌లో ఒక్క మహిలకు కూడా మంత్రి పదవి ఇవ్వలేని సీఎం సామాజిక తెలంగాణ ఎలా సాధిస్తారని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇంకా రాచరికపు, దొరల పాలనే సాగుతున్నదన్నారు.

కోదండరాం యాత్రపై దాడి అమానుషం: వంటేరు



సిద్దిపేట అర్బన్ : టీఆర్ఎస్ పాలనలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందని, టీడీపీ అధ్వర్యంలో ఆ అవినీతిని ఎండగడతామని తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన సిద్దిపేటలో మాట్లాడుతూ టీడీపీ హయంలోనే రాష్ట్రం అభివృద్ధి సాధించిదని అన్నారు. మహిళలకు రాజకీయ చైతన్యం కల్పించిన పార్టీ టీడీపీయే అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎన్నికల ముందు ఎన్నో కల్లబొల్లి కబుర్లు చెప్పిన సీఎం కేసీఆర్, తాను ఇచ్చిన హమీలను నెరవెర్చటంలో పూర్తిగా విఫలమయ్యారని పేర్కొన్నారు. కోదండరాంను తెలంగాణలో అడుగడుగునా అడ్డుకుంటూ టీఆర్ఎస్ గూండాలు దాడి చేయించటం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.

కర్ణాటక మంత్రికి డీకే అరుణ, పొంగులేటి ఫోన్

హైదరాబాద్: కర్ణాటక నీటిపారుదల శాఖ మంత్రి ఎంబీ పాటిల్‌కు కాంగ్రెస్ నాయకులు డీకే అరుణ, పొంగులేటి సుధాకర్‌రెడ్డిలు ఆదివారం ఫోన్ చేసి కృష్ణా దిగువ ప్రాంతానికి నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. నారాయణపూర్ నుంచి నీటిని విడుదల చేస్తే జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్‌తోపాటు హైదరాబాద్‌కు తాగునీరందుతుందన్నారు. కనీసం 15 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కోరారు. వీరి విజ్ఞప్తికి సానకూలంగా స్పందించిన పాటిల్ విషయాన్ని సీఎం, మంత్రివర్గ సహచరులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారన్నారు.

అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య

చిట్యాల(టేకుమట్ల)/మల్లాపూర్: అప్పుల బాధతో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. జయశంకర్ జిల్లా చిట్యాల మండలం చింతకుంట రామయ్యపల్లికి చెందిన బోగం నర్సయ్య(70) రెండెకరాల్లో పంట పెట్టుబడి కోసం కొంత అప్పు చేశాడు. అప్పుల విషయంలో ఇంట్లో తరచుగా గొడవలు జరుగుతుండేవి. బుధవారం గొడవ జరగడంతో, తీవ్ర మనస్థాపానికి గురైన నర్సయ్య ఇంట్లోంచి వెళ్లిపోయాడు. అతడి కోసం వెతకగా ఆదివారం చేనులో చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన గుజ్జుల కాశీం (48) తన మూడు ఎకరాలతో పాటు మరికొంత భూమి కౌలు తీసుకొని సాగు చేశాడు. వ్యవసాయం, కుటుంబ అవసరాల కోసం సుమారు రూ.10 లక్షల వరకు అప్పు చేశాడు. పంటలు సరిగా పండక తీవ్రంగా నష్టపోయాడు. అప్పులు తీర్చేదారి లేక కాశీం ఆదివారం తన వ్యవసాయ క్షేత్రంలో పురుగు మందు తాగాడు.

అమ్మకానికి 'బాసర' భూములు

అడ్డంగా అమ్మేస్తున్న భూ బకాసురులు.. కరిగిపోతున్న రూ.కోట్ల ఆస్తులు

బాసర, ఆగస్టు 13: కోరిన వారికి జ్ఞానాన్ని ప్రసాదించే బాసర జ్ఞానసరస్వతీ అమ్మవారి భూములకు రెక్కలు వచ్చాయి. దాతలు భక్తితో ఆలయానికి దానంగా ఇచ్చిన భూములు అక్రమార్కుల చరలో బందీ అయ్యాయి. కంచె చేను మేసిన చందంగా ఆలయ భూములను రక్షించాల్సిన దేవస్థానంలోని కీలక వ్యక్తులు వాటిని భక్షిస్తున్నారు. ఒక్కొక్క భూమిని దర్జాగా అమ్మేసుకుంటున్నారు. రూ.కోట్ల విలువైన అమ్మవారి ఆస్తులు ఆవిరవుతున్నాయి. ఆలయంలో కీలక స్థానాల్లో ఉన్న వ్యక్తులే కావడంతో రికార్డుల మాయం నుంచి విక్రయం వరకు దేవాదాయ శాఖ అధికారులు వారికి వంతపాడుతున్నారు. సరస్వతీ అమ్మవారికి మొత్తం 170ఎకరాల భూమి ఉంది. తానూర్, భైంసా మండలాల్లో గల సుమారు 40 ఎకరాల భూమి గత దశాబ్దాల కాలంగా దేవస్థానానికి చెందిన కీలక స్థానంలో గల వ్యక్తే కబ్జాచేసి కౌలుకు ఇస్తూ వస్తున్నారు. అయితే ఇటీవలే ఈ యేడాది ఆ భూములకు దేవస్థాన అధికారులు వేలం వేసి రైతులకు కౌలుకు ఇచ్చారు. బాసరపరిధిలో గల విలువైన 32 ఎకరాల భూమి కబ్జాకు గురయ్యింది. గోదావరి తీరంలో మొదటి స్నాన ఘట్టం వద్ద సర్వే నెంబర్. 438లో విఠలేశ్వర స్వామి ఆలయానికి చెందిన 18.19 ఎకరాల భూమి ఉంది. ప్రస్తుతం ఆ గుడి లేకపోవడంతో దేవాదాయ శాఖ బాసర దేవస్థానానికి అప్పజెప్పింది. ఈ భూమంతా కబ్జాదారుల ఆధీనంలో ఉంది. విఠలేశ్వరస్వామి గుడి లేదన్న కారణంతో కబ్జాదారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. 2011లో హైకోర్టు ఈ భూమిపై కిందిస్థాయిలో తేల్చుకోవాలని సూచించింది. ప్రస్తుతం ఈ కేసు జాయింట్ కలెక్టర్ దగ్గర పెండింగ్‌లో ఉంది. జేసీవద్ద క్లియర్ అయితే సుమారు రూ.20 కోట్ల విలువైన ఈ భూమిని కబ్జాదారులు అమ్మేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల ఈ భూమిని సాగు కోసం కౌలుకు ఇచ్చేందుకు నోటిఫికేషన్‌ను విడుదల చేసి ఆ తరువాత వాయిదా వేశారు. నేతల ఒత్తిడి వల్లనే వాయిదా వేశారనే ఆరోపణలు వినిపించాయి. సర్వే నెం. 447/2లో 8.04 ఎకరాల భూమి కీలకస్థానాల్లో శాశ్వతంగా ఉన్న వ్యక్తి ఆధీనంలో ఉంది. ఈ భూమిని కూడా అధికారులు రైతులకు కౌలుకు ఇచ్చేందుకు బహిరంగ వేలం వేయగా కోర్టు నుండి స్టే తెచ్చి నిలిపివేయించారు.



అమ్మేసిన విలువైన ఆలయ భూమి

అమ్మవారికి మహారాష్ట్రలో సైతం భూములు ఉన్నాయి. ధర్మాబాద్ పరిధిలో సర్వే నెం.171లో 16 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి కూడా ఆలయంలో కీలన స్థానంలో ఉన్న వారి ఆధీనంలోనే ఉంది. ప్రతీయేటా ఈ భూమిని సదరు వ్యక్తి రూ.లక్షలకు ఇతరులకు కౌలుకు ఇస్తున్నట్లు తెలిసింది. సరస్వతీ ఆలయానికి సమీపంలో గోదావరికి వెళ్ళే రహదారి పక్కన సర్వే నెం.432లో సరస్వతీ అమ్మవారికి చెందిన 5.27 ఎకరాల భూమి ఉంది. గతంలో ఆలయ పూజారిగా పనిచేసిన వ్యక్తి ఆధీనంలో ఉంది. రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారుల అండతో పత్రాలు సృష్టించి కొన్నేళ్ల కిందట ఎకరం రూ.40 లక్షల చొప్పున ఆ భూమి అంతటిని అమ్మేశారు. ఆ తరువాత రియల్ వ్యాపారులు అందులో వెంచర్ చేసి రూ.కోట్లకు విక్రయించారు. ప్రస్తుతం అందులో నిర్మాణాలు కూడా జరిగాయి. అమ్మవారికి చెందిన వివాదాస్పద భూముల్లో ఆక్రమణదారులు దర్జాగా పంటలు సాగుచేసుకుంటున్నారు. మరికొంత మంది కౌలుకు ఇచ్చుకుంటూ ప్రతీ యేటా రూ.లక్షలు జేబులో వేసుకుంటున్నారు. గోదావరి తీరంలో గల భూమిలో వ్యాపార సముదాయాలు కొనసాగుతున్నాయి. వ్యాపారుల నుండి యేటా రూ.లక్షలు అద్దె రూపంలో కబ్జాదారులు పొందుతున్నారు. వివాదాస్పదంగా ఉన్న భూముల్లో సాగు, వ్యాపారాలు నియంత్రించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

డిండికి నీటి తరలింపుతో జిల్లాకు ధోకా లేదు

- మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్: నార్లాపూర్, ఏదుల రిజర్వాయర్ల నుంచి డిండికి అర టీఎంసీ కృష్ణా జలాలను తరలించడం వల్ల పూర్వపు మహబూబ్‌నగర్ జిల్లాకు ఎలాంటి ధోకా లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. కాంగ్రెస్, పాలమూరు అధ్యయన వేదికలు ఈ విషయాన్ని కావాలనే రాజకీయం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. నాగర్‌కర్నూల్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో జూపల్లి మాట్లాడారు. డిండికి నీటి తరలింపుపై చాలా రోజులుగా అధికార, ప్రతిపక్షాల మధ్య వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో మంత్రి మొదటిసారి ఈ అంశంపై ప్రస్తావించారు. డిండికి నీటి తరలింపు వల్ల ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు అన్యాయం జరుగుతుందంటూ అసత్య ప్రచారానికి దిగుతున్నారని ఆరోపించారు. నల్లగొండ జిల్లా తెలంగాణలో అంతర్భాగం కాదా అని ఆయన ప్రశ్నించారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా పూర్వపు మహబూబ్‌నగర్ జిల్లాలో ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనేది ప్రభుత్వ ఉద్దేశ్యమని అన్నారు. గోదావరి, కృష్ణా జలాల ద్వారా తెలంగాణ అంతటినీ సస్యశ్యామలం చేయాలనేది సీఎం కేసీఆర్ అభిమతమని, అవకాశాలను బట్టి నీటి తరలింపు పట్ల ఎలాంటి విధానం అవలంభించాలో తమ ప్రభుత్వానికి తెలుసన్నారు.

తరగతి గదుల్లోనే దేశ నిర్మాణం

- లక్ష్మీనారాయణ

వడ్డేపల్లి : తరగతి గదుల్లోనే దేశ నిర్మాణం జరుగుతోందని, ఉపాధ్యాయులు విద్యార్థుల్లోదా గిఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని మహారాష్ట్ర అదనపు డీజీపీ లక్ష్మీనారాయణ అన్నారు. సులక్ష్య సేవా సమితి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యం లో ఆదివారం హన్మకొండలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని విద్యావేత్త చుక్కా రామయ్య, పద్మశ్రీ వనజీవి దరిపల్లి రామయ్య -జానమ్మ దంపతులతో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు గొప్ప వ్యక్తులుగా ఎ దగడానికి ధనం అవసరం లేదని సామాజిక స్పృహ దోహదపడుతుందన్నారు. చుక్కా రామ య్య మాట్లాడుతూ గ్రంథాలయాల వలన మనిసికి మానసిక ప్రశాంతత లభిస్తోందన్నారు. పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందన్నారు.

రాజయ్యకో న్యాయం.. అల్లోలకో న్యాయమా?

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రావు
- నియామకాల్లో ప్రభుత్వం విఫలం: బీజేపీ నేత రాకేష్‌రెడ్డి
- మాయ మాటలతో మోసగిస్తున్న కేసీఆర్: ధర్మారావు



రఘునందన్‌రావు

నిర్మల్‌టౌన్/మట్టెవాడ/ఎల్కతుర్తి : నిర్మల్ జిల్లా కేంద్రం నడిబొడ్డున ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తమ ప్రభుత్వం ప్రజలకు పారదర్శకంగా పాలన అందిస్తుందని, ఎవరు తప్పు చేసినా ఊరుకోనేది లేదని ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. దళిత సామాజిక వర్గానికి చెం దిన మాజీ డిప్యూటీ సీఎం రాజయ్యను మంత్రివర్గం నుంచి ఏ కారణం లేకుండా తొలగించ డం ఏ మేరకు సమంజసమన్నారు. జిల్లాకు చెందిన మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ఎన్ని తప్పులు చేసిన సీఎం ఎందుకు చర్య తీసుకోవడం లేదని ఆరోపించారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా ఉద్యోగ నియామకాల్లో ప్రభుత్వం విఫలం చెందిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి అన్నారు. హన్మకొండలో విలేకరులతో మాట్లాడుతూ 2014లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఏర్పాటు చేసి లక్షా 20వేల ఉద్యోగాలు భర్తీ చే స్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారని కానీ ఇప్పటి వరకు 15వేల ఉద్యోగాలు మ్రాత మే టీఎస్‌పీఎస్సీ భర్తీ చేసిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మాయమాటలతో ప్రజలను మోసగిస్తున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దర్మారావు ఆరోపించారు. వరంగల్ అర్బన్ జిల్లా ఎల్కతుర్తిలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కోల్‌బెల్ట్ యువకులు



రమేశ్ రాజా, అంజత్‌పాషా

మంచిర్యాల: మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన ఇద్దరు యువకులు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కారు. అంజత్ పాషా (38) సైకిల్ మెకానిక్. 15అడుగులు ఎత్తు గల సైకిల్‌ను తయారు చేశాడు. వివిధ సైకిళ్లతో సైకిల్ ట్రీని నిర్మించాడు. రెండు సెంటీమీటర్ల అతి చిన్న సైకిల్‌తోపాటు మినీ మోటార్ బైక్స్ రూపొందించాడు. మల్టిపుల్ వరల్ట్ రికార్డ్స్ హోల్డర్, ఫౌండర్ ప్రెసిడెంట్ ఆఫ్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ డాక్టర్ చింతపట్ల ఇటీవలే అజంత్‌పాషా పేరును తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మరో యువకుడు రమేశ్‌రాజా, అబ్బురపరిచే కరాటే విన్యాసాలకు పెట్టింది పేరు. పలు అవార్డులు, రివార్డులు సాధించిన రమేశ్‌రాజా(34) పేరు 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్'లో నమోదైంది.

అక్కడక్కడా మోస్తరు వానలు



జలమయమైన సూర్యాపేటలోని రహదారి

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్: తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఆదివారం అక్కడక్కడా మోస్తరు వానలు కురిశాయి. నల్లగొండ జిల్లాలో పలుచోట్ల విస్తారంగా వర్షాలు కురిశాయి. దేవరకొండ డివిజన్‌లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి. సగటున జిల్లాలో 3.4.మి.మీ. వర్షపాతం నమోదైంది. సూర్యాపేట జిల్లాలోని సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురియగా, కోదాడ, హుజూర్‌నగర్‌లలో మోస్తరు వర్షం కురిసింది. ఆదిలాబాద్ జిల్లా తాంసి, తలమడుగు, ఆదిలాబాద్, బేల, జైనథ్ మండలాల్లో వాన కురిసింది. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా చిరుజల్లులు పడ్డాయి.

రూ.41లక్షల సొత్తు దోపిడీ

- వైరాలో దొంగల హల్‌చల్

వైరా, ఆగస్టు 13: దోపిడీ దొంగలు రెచ్చిపోయారు. వరుస చోరీలు చేసి ప్రజలను భయాందోళనలకు గురిచేశారు. ఖమ్మం జిల్లా వైరాలో శనివారం అర్ధరాత్రి నాలుగు ఇళ్లలోకి చొరబడిన దుండగులు సుమారు రూ.41లక్షల విలువైన సొత్తును దోచుకెళ్లారు. దీనిలో రూ.24లక్షల నగదు, దాదాపు రూ.17లక్షల విలువైన బంగారు ఆభరణాలున్నట్టు తెలుస్తోంది. తాళాలు వేసి ఉన్న ఇళ్లను ఆ దొంగలు టార్గెట్ చేసి ఈదోపిడీకి పాల్పడ్డారు. తలుపుల గడియలు పగలగొట్టి లోపలకు ప్రవేశించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. నాలుగురోజులు వరుసగా సెలవులు రావడం, వివాహ, తదితర శుభ కార్యాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో.. ఎవరూ లేని ఇళ్లపై దృష్టి పెట్టారు. వైరాలోని గాంధీచౌక్‌కు చెందిన వ్యాపారి, టీఆర్ఎస్ నాయకుడు మిట్టపల్లి నాగేశ్వరరావు ఇంట్లో రూ.15లక్షల నగదు, 520గ్రాముల ఆభరణాలను దోచుకెళ్లారు. సుందరయ్యనగర్‌లోని సిమెంట్ రోడ్డులో ఒకేచోట మూడిళ్లలో చోరీలకు పాల్పడ్డారు. తల్లాడలోని శ్రీరామ కోల్డ్‌స్టోరేజీలో మేనేజర్‌గా పనిచేస్తున్న వెలగ నాగేశ్వరరావు ఇంట్లో రూ.9లక్షల నగదును దోచుకెళ్లారు. రైతులు, కార్మికులకు సంబంధించిన రూ.9లక్షల నగదును ఇంట్లో ఉంచిన నాగేశ్వరరావు ఖమ్మంలోని ఓ వివాహానానికి వెళ్లారు. అదే ఇంటి యజమాని అయిన లగడపాటి ప్రభాకర్‌రావు ఇంటి తలుపు గడియ విరగ్గొట్టి లోపలకు వెళ్లి వెండి వస్తువులు తీసుకువెళ్లారు. రూ.రెండులక్షల విలువైన ఆభరణాలు, రూ.పదివేల నగదు ఎత్తుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సింగరేణి ఎన్నికలపై రాజకీయ ముద్ర

- 2019 ఎన్నికలలో ప్రయోజనం కోసం ఆరాటం

మంచిర్యాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణి యూనియన్ గుర్తింపు ఎన్నికలపై సోమవారం డిప్యూటీ సీఎల్‌సీ యూనియన్ల యాజమాన్యం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎన్నికల తేదీని ప్రకటించి షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది. సెప్టెంబర్ మూడవ వారం లోపు ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. 2012 జూన్‌లో సింగరేణి ఎన్నికలు జరిగాయి. ఉద్యమ నేపథ్యంలో టీఆర్ఎస్ అనుబంధ టీబీజీకేఎస్ విజయం సాధించింది. భారతదేశంలోని బొగ్గు సంస్థలలో ఎక్కడా కూడా యూనియన్ గుర్తింపు ఎన్నికలు లేవు. కేవలం సభ్యత్వం వెరిఫికేషన్‌పైనే గుర్తింపునిచ్చి యాజమాన్యాలు చర్చించడం జేబీసీసీఐలో (వేతన కమిటీ) సభ్యత్వం ఇస్తున్నాయి. 1998లో అప్పటి ప్రత్యేక పరిస్థితులలో సింగరేణిలో యూనియన్ ఎన్నికలు పెట్టడం ప్రారంభమయ్యింది. ముందు రెండు సంవత్సరాల పాటు కాలపరిమితిని కొనసాగించారు. అనంతరం ఐఎన్‌టీయూసీ కాలంలో నాలుగు సంవత్సరాలు కాలపరిమితిని పెంచారు. దీంతో 2012లో విజయం సాధించిన టీబీజీకేఎస్ కూడా నాలుగేండ్ల పాటు గుర్తింపు సంఘంగా ఉంది. 2016 ఆగస్టులో కాలపరిమితి ముగిసిన తర్వాత ఎన్నికలు ఇప్పుడే జరుగుతున్నాయి. ఒక సంవత్సరం ఆలస్యంగా ఎన్నికలు జరుగుతున్నాయి. సహజంగా సింగరేణిలో యూనియన్ అధికారంలో ఉన్న సందర్భంగా రాజకీయ ప్రభావం కూడా ఉంటుంది. దాదాపు మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల రాజకీయాలపై ఈ ఎన్నికల ప్రభావం ఉంటుంది. ఈ ప్రయోజనాన్ని టీఆర్ఎస్ 2014లో పొందింది. కోల్‌బెల్ట్‌లోని మొత్తం 16 అసెంబ్లీ, 5 పార్లమెంట్ స్థానాలకు గాను, 12 అసెంబ్లీ, 4 పార్లమెంట్ స్థానాలలో విజయం సాధించింది. రానున్న 2019 ఎన్నికలలో ఈ ప్రాంతంలో రాజకీయ ప్రయోజనం పొందాలంటే సింగరేణి ఎన్నికలలో గెలవడం ముఖ్యమని దాదాపు అన్ని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. కోల్‌బెల్ట్‌లో విజయం సాధించాలంటే సింగరేణిలో పాగా వేయాలని ఈ పార్టీలు భావిస్తున్నాయి.

పిల్లలు



పిల్లలు నన్ను జూసి నవ్వుతారు
నేను పిల్లల్ని జూసి బతుకుతాను
ఒకటి ఉదయరాగం
రెండోది సంధ్యారాగం
అరవిరిసిన వాళ్ల ముఖాలు చూడు
కోటి సూర్యుళ్లని వెలిగిస్తారు
కొత్త కొత్త లోకాల్ని సృష్టిస్తారు
ఈ మాసిపోయిన ముఖంలో ఏం కనపడుతుంది వాళ్లకి
'కాశీపట్నం చూడర బాబూ' కన్పడుతుందా
లండన్ జెయింట్‌వీల్ కనబడుతుందా
గిరిధరాలు, హిమాలయ శిఖరాలు
గంగా, బ్రహ్మపుత్ర, కావేరి నదులు కన్పడతాయా-
వాళ్ల చేతుల్లో
అనేక వేల వనాల పూల పరిమళాలు
వేల వేల అటవీ ప్రాంతాల నుంచి వీచే
వింత పరిమళమేదో వాళ్ల ఒంటినిండా
అల్లుకుని, అలలు అలలుగా లోకాన్ని తాకుతుంది
మా యింట్లో
ఒక లేత మొగ్గుంది
మొలతాడులో వేణువు దోపుకుని
ఇది నా ఖడ్గం అంటుంది
పొడుగాటి పుల్ల తీసుకుని
ఇది నా కరవాలమంటుంది
పిల్లలు, పూలే కాదు
కత్తులు, కరవాలాలు, ఖడ్గాలు కావాలి

సంకేతం



నాకు తెలుసు
ఇది 'చివరకు' దారి తీస్తుందని
దీన్నెవడూ ఆపలేడని-
పళ్లు బిగబట్టి, కాళ్ల మునివేళ్లు
భూమికి తన్నిపట్టి
ఎంత గుంజినా వెనక్కి రాదు
బొక్కలో జొరబడ్డ పాముని
బయటికి లాగటం చాలా కష్టం
సగానికి తెగినా తెగుతుంది కానీ
అది బయటికి రాదు
వీటంటిలో నా ప్రమేయముందా
దేన్ని కాపాడగలను, ఇది ఓటమో
విజయో తెలియదు,
గుంజాటన సాగుతూనే వుంది-
'అంతం' భయపెడుతుందా
నది చివరికి సముద్రంలో అంతర్ధానమౌతుంది
కాలవలోని నీళ్లు చేలో అదృశ్యమౌతాయి
చివరి క్షణపు స్పందనల్ని
ఇపుడీ మునివేళ్లు గ్రహిస్తున్నాయా-

అతడికీ అర్థం కాదు
ఆమెకీ అర్థం కాదు- ఒక క్షణాన్ని
చెరి సగం పంచుకుని ఇంత దూరం వచ్చారని-
ఎవరికయినా అర్థమౌతుందా
భవిష్యత్తుని వర్తమానం సంకేతిస్తుందని

■ కె. శివారెడ్డి

జీవబంధం

మూఢమతుడ ఏ కీడు ఎరుగని
మూగజీవులను తెగిడెదవు
మాటికి గాడిద పందని
మాట మాటకు నోరు జారెదవు

మంచిచెడులు నీలోని గుణంబులు
ఎంచి వాటిలో వెతికెదవు
కొంచెమైన ఇంగితము లేక
నీ వంచననాపాదించెదవు

కొన్ని గొప్పవని గొడుగు పడతవు
కొన్ని అల్పమని గొడవ పెడతవు
లేని శకునముల అంటగడతవు
నీవే వాటికి శకునివిర

కొన్నింటిని భజియించమంటవు
కొన్నింటిని భుజియించమంటవు
ఒక్కడిదేనా ఈ జగము
నీకెక్కడిదిర ఈ ఆగడము

వేలెడంత ముక్కున్న గద్ద
ఎంతో ఎత్తుకు ఎగిరితె వింత
గంపెడంత నోరున్న గాడిద
మోపున ఎప్పుడు బరువుల గంత

వేలెడంత ఆ ముక్కు రూపుకు
కోడిపిల్లలకు వణుకంట
గంపెడంత ఆ గాడిద నోటికి
గరిక పోసలె ఇంపంట

జీవుల పొడిసె గద్దనెందుకొ
దేవుని మోసె వాహనమంటివి
బరువుల మోసె గాడిద సేవను
మరిసి చులకనలాడుచుంటివి

మల్లెవోలె తెలుపున్న నాగులో
నల్లని విషమే వున్నదట
మబ్బువోలె నలుపున్న బర్రెలో
తెల్లని పాలె వూరునట

కాటువేసె ఆ పాముకెందుకొ
నాగదేవతని పూజచేసెదవు
పాలనిచ్చె ఈ బర్రెనెందుకొ
బడితపూజతొ బాదపెడతవు

పాపల పొట్ట నింపె పాలను
పాముకు పోసెదవో నరుడ
లోపలి కోపం ఎళ్లగక్కుటకు
బర్రెను తిడుతవు పామరుడ

సందమావలాగున్న మూతితో
ఊరి కసువును ఊడిసె పంది
పందెము కత్తుల వంటి కోరలతొ
పాడియావులను మింగె పులి

ఆవును చంపె ఆ పులి రూపం
అమ్మవారికి ఆసనమా
ఊరికె చాకిరి చేసే పందిని
దారిని చూసితె దూషణమా

హాని ఎరుగని సాదు జీవుల
హీనమని నీవెంచెద వేల
పానందీసె గాయి మెకముల
పబ్బతి పడతవు మిడిమేల

బురద నేలను సులువుగ దున్నె
దున్న తుంగనె మేయునుర
గుహల వెచ్చగ పండె బెబ్బులి
గుండెల నెత్తురె కోరునురా

సలికి వెరవక సాగె అరకల
దున్నకు బలిపోలి గండాల
ఇలపై వెలసిన సుర రూపంబని
నరసింహానికి దండాల


పేడ పంచకం ఎత్తిన వాడ
ఆవుకు అమ్మకు చూడని తేడ
దమ్మపథం వెలుగొందినవాడ
గోవధ కామడ దూరం చూడ

బతికిన ఆవును సంపే వాటికి
బాగున్నది లోకం మొక్కు
సచ్చిన గోవు చర్మము వొలిసితె
నేరం మోపేదే ధర్మం

మూగజీవులు ఈ కతలెరుగవు
నీ తేడాలకు మురువవు మొరుగవు
వాటితొ పాచికలాడకుర
పాపం వాటికి పంచకుర

(మైసమ్మకు దున్నను బలిచ్చిన వార్త, సెరువు పనికి పందిని సజీవంగా పాతి పెట్టిన ఘోరం విని...)

■ గోరటి వెంకన్న



పద్యం తెలిస్తేనే భాష తెలిసినట్టు



పద్యం శతాబ్దాలుగా నిరక్షరాస్యులైన ప్రజల్లో కూడా జీవిస్తూనే వుంది. నలభై యాభై యేళ్ళ నాడు చదువుకున్న పద్యం పలుకరిస్తూనే వుంటుంది. ఒక్క చరణం తీగెను లాగితే డొంకంతా కదలివచ్చినట్టు పద్యమంతా ప్రత్యక్షమవుతుంది.



పద్యం తెలీనివాళ్ళూ, తెలిసినవాళ్ళూ కూడా నా మాటకు ఒప్పుకోరని తెలుసు. ఆ ఒప్పుకోకపోవడంలో ఎవరి కారణాలు వాళ్ళవి. పద్యం (ఛందోబద్ధమని చెప్పనక్కర్లేదు) తెలీనివాళ్ళు పద్యంతో అవసరం లేదనుకోవడం సహజం. పద్యం తెలీకపోయినా కథ, నవల, కవిత్వమూ రాస్తున్నవాళ్ళు "మాకు తెలుగు తెలీదా; ఇది తెలుగు కాదా?" అని ప్రశ్నిస్తారు. ఆ ప్రశ్నలో ఆగ్రహమూ ఉంటుంది. ఆ ప్రశ్నా, ఆగ్రహమూ రావలసినవే. అందుకు అంగీకరిస్తూనే, చెబుతున్నది విని ఆలోచించమని కోరుకుందాం. ఇక, పద్యం తెలిసి, మొదట పద్య కవిత్వమే రాసి ఇప్పుడు వచన కవిత్వం రాస్తున్నవాళ్ళ కారణాలు వేరు: పద్యం భూస్వామ్య సమాజానికి చెందిన సాహిత్య ప్రక్రియ. ఇప్పటి సామాజిక జీవిత చిత్రణకు పనికిరాదు. అందరికీ అర్థమయ్యేలా మాట్లాడుతున్న భాషలోనే రాయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు సరైన సాహిత్య రూపం. ఇవీ ఆ కారణాలు.

ఈ కారణాలూ సరైనవే. ఇప్పటి సాహిత్య ప్రక్రియలకు ఛందోబద్ధ పద్యం అనువైనది కాదు. అయితే, భూస్వామ్య వ్యవస్థకు చెందిన సాహిత్యమంతా పనికిరానిదేనా? పద్యమంటే మాకు ఇప్పటికీ ఇష్టమేనని, పద్యం రాసినవాళ్ళు కూడా చెప్పుకోలేనంత అపకారం పద్యం చేసిందా? పద్య సాహిత్యంలో ఉపయోగాంశమనేదే లేదా?

తెలుగువాళ్ళ బాల్యమూ, తెలుగు సాహిత్యం బాల్యమూ పద్యంతో ప్రారంభమైనదే. వెయ్యేళ్ళకు పైబడి తెలుగు సాహిత్య సామ్రాజ్యాన్ని పాలించింది పద్యమే. పోల్చవచ్చునో లేదో తెలీదు కానీ, రెండు వందల ఏళ్ళు దేశాన్ని పాలించిన విదేశీ భాషనూ, సాహిత్యాన్నీ ఇప్పటికీ నెత్తిన మోస్తూ, మన పద్య సాహిత్యం పనికి రాదనుకుంటున్నామంటే ఆశ్చర్యమూ, ఆవేదనా కలుగుతాయి. "పనికిరాని దాన్ని పనికిరాదనుకోవడం తప్పా?" ఈ ప్రశ్నకు జవాబు చెప్పాలంటే, పద్య సాహిత్యం ఏ విధంగా పనికొస్తుందో చెప్పాలి. ప్రత్యక్షంగా కాకపోయినా, పరోక్షంగా ఎలా పనికొస్తుందో చెప్పాలి. మన బాల్యం మనకిప్పుడు పనికిరాదు. అంటే మన బాల్య జీవితం వేరు, ఇప్పటి జీవితం వేరు. అయినా బాల్యాన్ని ఎవరూ ఎప్పటికీ మరచిపోలేరు. ఏ స్థితిలో వున్నవారికైనా బాల్యం ప్రియమైనదే. తెలుగువాళ్ళకు పద్యం అటువంటిది. పద్యం తెలిసినవాళ్ళు బాల్యాన్ని మరచిపోనట్టే పద్యాన్ని మరచిపోరు.

ఈ సంబంధాన్ని సాహిత్యపరంగా చెప్పాలంటే పద్య నిర్మాణం ఆ విధంగా మరచిపోవడానికి వీల్లేనంత పటిష్టమైనదనాలి. యతి ప్రాసలతో అనవసర వ్యర్థ పదాలతో వుండే పద్యానికి అంత పటిష్టమైన నిర్మాణం వుందా అనిపించవచ్చు. పద్యం శతాబ్దాలుగా నిరక్షరాస్యులైన ప్రజల్లో కూడా జీవిస్తూనే వుంది. నలభై యాభై యేళ్ళ నాడు చదువుకున్న పద్యం పలుకరిస్తూనే వుంటుంది. ఒక్క చరణం తీగెను లాగితే డొంకంతా కదలివచ్చినట్టు పద్యమంతా ప్రత్యక్షమవుతుంది. నిన్నా మొన్న చదివిన వచన కవిత్వం ఎంత బావున్నా సరే యథాతథంగా జ్ఞప్తికి వుండదు. పద్య నిర్మాణం పటిష్టమైనదంటే తప్పవుతుందామరి?

పద్యం ఇప్పటి వస్తువుకు పనికిరాదంటూనే వచన కవిత్వం కన్నా బలమైనదనడం ఏమిటి? నిర్మాణం వరకూ పరిమితమై అన్నమాటే అది. ఆ పోలిక తెచ్చింది పద్యం ఇప్పుడు అవసరం లేకపోయినా అందులో వున్న బలాన్ని గుర్తించడం అవసరం అని చెప్పడానికే. ప్రజాస్వామ్య వ్యవస్థలో సాహిత్యం ప్రజల వద్దకు వెళ్ళాలంటున్నప్పుడు అటువంటి గుర్తింపు వుండటం అవసరం అనడానికే. "సరే.. పద్యం బలమైనదే ఒప్పుకుంటాం. అవసరం లేని దాని బలం ఎంతుంటే ఏం ఉపయోగం?" అది చెప్పడానికే ఈ గొడవంతా. పద్య సాహిత్యంలో ఉపయోగాంశమే లేదా అని ప్రశ్నించిందీ, ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగా ఉపయోగిస్తుందన్నదీ... అందుకే. పద్య సాహిత్యమూ, పద్య రచనా తెలిసినవాళ్ళు ఏది రాసినా ప్రత్యేకత కనిపిస్తూ ఉంటుందని తెలుసుకునేందుకు పెద్ద పరిశోధన అక్కర్లేదు. ఈ మాటకు పద్య రచన తెలీనివాళ్ళు మంచి రచన చెయ్యలేరని అంటున్నట్టు అర్థం కాదు. "ప్రత్యేకత" అన్న మాటని ప్రత్యేకంగా అర్థం చేసుకోవాలి. ఉదాహరణకు- కృష్ణశాస్త్రి, దాశరథి, శ్రీశ్రీ, సినారె సినిమా పాటల్లో కూడా ప్రత్యేకత కనిపిస్తుంది. వాళ్ళకు పద్య సాహిత్యం తెలిసినందువల్ల వచ్చిందే ఆ ప్రత్యేకత. పద్యంలో కేవలం యతిప్రాసలు, ఛందోబద్ధమైన కట్టుబాట్లే లేవు. విస్తారమైన, విశిష్టమైన సాహిత్యమూ, భాషా ఉన్నాయి. ఈ మాటకు నేనేదో శిష్ట భాషను కోరుతున్నట్టు అర్థం చేసుకోరాదు.

ప్రస్తుతం తెలుగు భాష అంతరిస్తున్న దశలో వుందని తెలిసి మనం ఆందోళన పడుతున్నాం. తెలుగు మాట్లాడేవాళ్ళు వుండరని మాత్రం కాదు. ఇందువల్ల తెలిసేదేమిటి? తెలుగు మాట్లాడటమూ, తెలుగు భాష తెలియడమూ ఒకటి కాదని. తెలుగు భాషను బతికించుకోవాలంటే తెలుగు సాహిత్యాన్ని ప్రేమించాలనీ, సాహిత్యం తెలీకపోతే భాషను ప్రేమించలేమనీ, మనకున్న సాహిత్యం చాలా వరకూ పద్యమేననీ. ఆ రీత్యానూ పద్య సాహిత్యం పనికిరానిదనుకోవడానికి వీల్లేదు. ఏ సాహిత్యప్రక్రియ ప్రయోజనమైనా భావ వ్యక్తీకరణ సమర్థత మీద ఆధారపడవలసిందేగదా! సమర్థతే పద్య సాహిత్యంలో ఉన్న ఉపయోగాంశం. నువ్వు మాకిప్పుడు అవసరం లేదని అవమానించినా పద్యం చేసే సహాయమూ అదే. "అయితే మేమిప్పుడు పద్య సాహిత్యం తెలుసుకొని ఆ తర్వాత రాయాలా?" అంటే, "తెలుసుకున్నవాళ్ళకు తెలుసుకున్నంత ఉపయోగం" అన్నదే జవాబు.

■ పి. రామకృష్ణ

కృష్ణుణ్ణి కూడా బోనులో ఎక్కించే ప్రయత్నం!

ఇప్పటివరకు శంభూకుని పేరుతో రామునిపై రాళ్లు వేసేవారు మాత్రమే ఉండేవారు. ఇప్పుడు పులికొండ సుబ్బాచారి శ్రీకృష్ణుణ్ణి బోను ఎక్కించే ప్రయత్నం చేశారు (వివిధ, జూలై 31). వ్యక్తిగత కులద్వేషాన్ని రామ ద్వేషంగా మార్చుకొన్న పెరియార్ రామస్వామి కొసను అందుకొని తెలుగునాట త్రిపురనేని రామస్వామిచౌదరి 'శంభూకవధ'కు బీజం వేశాడు. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణంలో ఎక్కడా శంభూక వధ లేదు. వాల్మీకి కృతమో కాదో ఈ రోజుకూ పరిశోధకులు తేల్చని ఉత్తరకాండలోని కథను విశేష ప్రాచుర్యంలోకి తెచ్చారు. శంభూకుడు శూద్ర వైద్యుడని వైదిక గ్రంథాలలోనున్న విషయం చాలా మందికి తెలియదు. బ్రాహ్మణ బాలుడు అనారోగ్యంగా ఉంటే శంభూకుడు తపస్సు చేస్తూ అతనికి వైద్యం చేయలేదు. తన వృత్తిధర్మం సరిగ్గా నిర్వర్తించ లేదని రాముడు అతణ్ణి సంహరిస్తాడు. అంతేకాని శూద్రుడు తపస్సు చేసినందుకు కాదు.

త్రిపురనేని తర్వాత నార్ల, రంగనాయకమ్మ వంటివాళ్లు శంభూక వధను ఘోర తప్పిదంగా చూపించి రాముణ్ణి విలన్‌గా మార్చడానికి ప్రయత్నించారు. ఇప్పుడు శ్రీకృష్ణుని వంతు. ఇవాళ్టి కులాల సమాజాన్ని 5వేల యేళ్ల నియమాలతో పోల్చి వాదించడమే విడ్డూరం. ప్రతి సంఘటనలో బాధితుడైన ప్రతి వ్యక్తికీ ఒక కులం, మతం, ప్రాంతం, భాష తప్పక ఉంటుంది. కాబట్టి అస్తిత్వాలు- ఐడెంటిటీలు పేర అవతలివాళ్లను నిందించేందుకు ఇది సాకు మాత్రమే. శత్రుపక్షంవైపు మీడియాలో మాట్లాడితేనే సహించలేని రాజకీయ వ్యవస్థను ఈ రోజు చూడడం లేదా! మరి శత్రువుకు సంబంధించిన సేవకుడు అంతలా మాట్లాడితే జరిగేది ఏంటి? కృష్ణుడు ఆ దాడి తన శత్రువు కంసుడిని సమర్థించే వ్యక్తిని దృష్టిలో పెట్టుకొని చేసిందే కానీ, ప్రీప్లాన్డ్ కాదు. రజకశ్రేష్ఠా! అని సంబోధించి మర్యాదగానే బట్టలు అడిగారు బలరామకృష్ణులు. శత్రువుపై యుద్ధానికి వెళ్తున్నవాళ్ళకు అదే శత్రువును సమర్థిస్తూ పలికిన నిష్ఠూర వాక్యాలు వాళ్ళ ఇగోను హర్ట్ చేశాయి.

"ఎట్టెట్టా! ప్రభువుగారి వస్త్రాలు ఇవ్వమంటారా? ఇది న్యాయమా! వాటిని ధరించడానికి మీరు యోగ్యులా? పాలు, పెరుగు అపహరించి తలక్రొవ్వి ఇలా కూశారు. కాకపోతే గొల్లవారైన మీకు ఇలాంటి మాటలు నోటికెలా వస్తాయి? కంస మహారాజు ఆగ్రహానికి గురైన మీకు ప్రాణాపాయం ఉంటుంది. కాబట్టి ఈ బట్టలు అడుగవద్దు" అంటాడు.

పోతన భాగవతంలో అనువాదం ఇలా ఉంటే వ్యాస భాగవతంలో మూలంలో స్వల్పభేదం ఉంది. ఇలాంటి చర్చల్లో మూలాలను పరిశోధించకుండా పోతన ఆధారంగా చర్చ చేయడం అసంగతమే అవుతుంది. వ్యాస భాగవతం దశమ స్కంధం (పూర్వార్థం) 41 అధ్యాయంలో 32వ శ్లోకం నుండి 37వ శ్లోకం ఈ ఘటన ప్రస్తావించబడింది:

దేహ్యావయోస్సముచితాన్యంగవాసాంసిచార్హతోః/ భవిష్యతి పరం శ్రేయో దాతుస్తే నాత్ర సంశయః

ఓయీ! మేము చక్కని వస్త్రములకు తగినవారము. మాకట్టి వస్త్రమ్ములనిమ్ము. మాకిచ్చినచో నీకు గొప్ప శ్రేయస్సు కలుగగలదు.

సాక్షేపం రుషితః ప్రాహ భృత్యోరాజ్ఞస్సుధర్మదః

కోపించినవాడై నిందతో కూడుకొన్నట్లుగా ఇట్లు పలికెను.

ఈదృశాన్యేవ వాసాంసి నిత్య గిరివనేచరాః/ పరిధత్త కిముద్వృత్తా రాజద్రవ్యణ్యభీప్సథ

ఓయీ! మీరు సదాచారమును విడిచిపెట్టి రాజు వస్త్రములను కోరుచున్నారు. నిత్యము కొండలపై అడవులలో తిరిగే మీరు వస్త్రములనే ధరించెదరా!


యాతాశుబాలికామైవం ప్రార్థ్యంయదిజిజీవిషా/ బధ్నంతి ఘ్నంతి లుంపంతి దృప్తం రాజకులానివై

ఓ అజ్ఞానులారా! తొందరగా వెళ్లుడు. మీకు బ్రతకాలని ఉంటే కోరికలు కోరకుడు. గర్వించిన వ్యక్తిని రాజభటులు బంధించి కొట్టి వాని సంపదను లాగుకొనెదరు.

ఏవం వికత్థమానస్య కుపితో దేవకీసుతః/ రజకస్య కరాగ్రేణ శిరః కాయాద పాతయాత్

శ్రీకృష్ణుడు కోపించినవాడై ఈ విధముగా బీరములు పలికిన రజకుని తలను చేతి గోటితో మొండెము నుండి వేరు చేసెను.

మంచితనంతో బట్టలడిగితే వాళ్ళ కులాన్ని, శక్తిని ఎత్తిపోస్తూ మాట్లాడటం అతిగాకపోతే ఇంకేమిటి? అతను రాజగృహ బాధ్యుడిగా మాట్లాడకుండా బలరామకృష్ణులనుద్దేశించి తిట్లు తిట్టాడు. పాలు, పెరుగు దొంగలు అని, యోగ్యత లేదని, కులపరంగా గొల్లవారని తెలుగు భాగవతంలో ఉంటే; గిరి, వనాల్లో సంచరించేవాళ్ళని సంస్కృత భాగవతంలో ఉంది. 'రజకశ్రేష్ఠుడా' అని సంబోధించి బట్టలడిగిన పాపానికి ఇన్ని తిట్లు తిడితే వీరులైన బలరామకృష్ణులు ఎలా సహిస్తారు?



దారిన పోతున్న రజకుణ్ణి బట్టలు అడగడమే తప్పన్నట్లుగా అతడు ప్రవర్తించాడు. ఏదో సైన్యాధ్యక్షుడిలాగా మాట్లాడితే యుద్ధానికి వెళ్తున్నవాళ్లు ఊరుకుంటారా? ముష్టిక చాణూరులనే మల్లయుద్ధంలో ఓడించిన యదువంశ క్షత్రియులు చేతులు ముడుచుకొని కూచుంటారా? గిరివనచరులు అని ప్రస్తావించడం కులపరమైన విమర్శ కాదా! ఈ రోజుల్లో గిరిజనులను ఇలాగే కుల దూషణ చేస్తూ మాట్లాడితే 'అట్రాసిటీ కేసు' పెట్టరా? చర్యలోని లోపాలను గుర్తించకుండా ప్రతి చర్యను మాత్రమే ప్రశ్నించే మన మేధావులకు శతకోటి నమస్కారాలు!

ప్రతి సంఘటనను కులం దృష్టితో చూస్తే కులాల మధ్య ఘర్షణలు తప్ప ఇంకేం మిగలవు. వ్యక్తిగత పేరు ప్రతిష్ఠల కోసం పౌరాణిక పాత్రలను అపఖ్యాతిపాలు చేయడం, వాళ్ళను విలన్లుగా చూపడం తెలుగునాట కొత్తేం కాదు. రాముడు, శ్రీకృష్ణుడు పాత్రలను తిట్టేవాళ్ళంతా మా విమర్శ సాహిత్య దృష్టితో అంటారు. అదే పాత్రలను, వాటి వ్యక్తిత్వాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలంటే అవన్నీ మతానికి సంబంధించినవి అంటారు. ఈ ద్వంద్వ ప్రమాణాలను పాఠకులు అర్థం చేసుకొంటున్నారు కాబట్టే ఇటీవల ఉధృతి తగ్గింది. కానీ సుబ్బాచారి కొత్త అస్త్రాన్ని నూరుదామని ప్రయత్నించడం సూర్యునిపై దుమ్మెత్తి పోయడమే. ఓ పర్యాయం తమిళనాడు కోర్టులో అదేపనిగా రాముణ్ణి నిందిస్తున్న నాయకుణ్ణి ఓ జడ్జి మందలిస్తూ, "పది తలలు, ఇరవై చేతులున్న రావణుడే ఏం చేయలేక పోయాడు; చచ్చు ఓ నోరు, రెండు చేతులున్న నీవేం చేస్తావులే పో!" అన్నాడట.

■ పి. భాస్కరయోగి
99120 70125

అది రాజనీతిలో భాగం

కంసుని పాపం పండింది గనుకనే బలరామ కృష్ణులు కంసుని సంహరించడానికి మధురా నగరానికి వచ్చారు. రాజును సంహరించడానికి వచ్చినవారు- రాజసౌధంలోకి వెళ్లి వచ్చేవారి మనోగతం, స్వభావం ఎలా ఉంటాయి వంటి అంశాల్ని పసిగట్టడం రాజనీతిలో ఓ భాగం. బట్టలు ఉతికి తీసుకువెళ్లే రజకుని మనో ప్రవృత్తిని కూడా పరిశీలనలోకి తీసుకునే సందర్భంలో రాజుగారి బట్టలు అడుగుతారు. వారు చాలా చక్కగా "రజక కులంలో శ్రేష్ఠుడా" అని సంబోధించి వినయంగా మేము రాజుగారి మేనల్లురము అని కూడా చెబుతూ, ఉతికిన బట్టలు ఇవ్వమని అడుగుతారు. మేం మందలో వున్నందువలన బట్టలు మాసిపోయ్యాయి అని కూడా వివరణ ఇస్తారు. కానీ ఆ తలపొగరు రజకుడు కంసుని మదమత్సరాలు అంటినవాడై కోపంతో "ఎట్టెట్టా ప్రభువుగారి వస్త్రాలు మీకు ఇవ్వమంటారా? ఇది న్యాయమా? వాటిని ధరించడానికి మీరు యోగ్యులా?" అన్నాడు. అంతవరకూ బానే వుంది సమాధానం. ఇంకా కొనసాగింపుగా ప్రేలాపనచేస్తూ, "పాలు, నెయ్యి, పెరుగు అపహరించి తలక్రొవ్వి ఇలా కూశారు. కాకపోతే గొల్లవారైన మీకు ఇలాంటి మాటలు నోటికెలా వస్తాయి? కంసుని ఆగ్రహానికి గురై మీకు ప్రాణాపాయం ఉంటుంది. కాబట్టి ఈ బట్టలు అడుగవద్దు," అంటాడు. ఇక్కడ గమనించవలసింది- రజకుడు రాజుగారి ఆస్థాన రజకుడు. కనుక ఆయన బంధువర్గం రజకునికి తెలుసు. కనుక బలరామ కృష్ణులెవరో కూడా రజకునికి తెలుసు. లేకపోతే "పాలు నెయ్యి పెరుగు అపహరించి తలక్రొవ్వి ఇలా కూశారు" అనే దురుసు మాట మాట్లాడడు. "యథారాజా తథా ప్రజ" అన్న దురంహకారం రాజుగారిలాగానే రజకునికి ఉంది.

వీరులై కంసుని తుదముట్టింప వచ్చినవారు, ఆస్థానంలోగాని, రాజమహల్‌లోని జనంలో గాని, బయట జనంలో గాని భయం పుట్టించాలి. అలా భయకంపితుల్ని చేయకపోతే కంస సంహారానికి వీరే ముందు వాదానికి దిగి అడ్డుపడే ప్రమాదం ఉంటుంది. నాయకుడ్ని చంపాల్సి వచ్చినప్పుడు ముందు సంరక్షకుణ్ణి సంహరిస్తారు. అది పాపంగా తలచరు. అది యుద్ధనీతిలో భాగం.

దీన్ని సుబ్బాచారి ఏదో పెద్ద ఘోరం కృష్ణుడు చేసినట్టు ఎత్తి చూపడం సంఘటనలోని సూక్ష్మాన్ని గ్రహించలేకపోవడమే. కృష్ణుడు రజకుడి తలతిక్క సమాధానం విని కూడా మిన్నకుంటే మిగిలిన సాలె, తంతునాయకుడు లొంగిపోయేవారా? పనివారే లొంగిపోకపోతే సైనికులు లొంగిపోతారా? కృష్ణుడు ఆనాటి రాచరికపు సమాజంలోని రాజనీతినే పాటించాడు. ఇందులో బహుశ ఏదో బీసీ వాదాన్ని ప్రవేశపెట్టడానికి సుబ్బాచారి గారు ప్రయత్నించి వుంటారేమో అనుకుంటాను.

■ కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి
99487 74243

డిటిఎల్‌సి వ్యాస రచన పోటీ ఫలితాలు

డిట్రాయిట్ తెలుగు సాహితీ సమితి (డిటిఎల్‌సి) నిర్వహించిన తెలుగు సాహిత్య వ్యాస రచన పోటీలో విజేతలు మొదటి బహుమతి (రూ.27,231)- మానస చామర్తి, జిజ్ఞాస సోమనాథం; రెండవ బహుమతి (రూ.17,132)- విహారి; మూడవ బహుమతి (11,213)- రెంటాల శ్రీవెంకటేశ్వరరావు.

- సామల రమేష్ బాబు

కవిసంగమం

34వ మూడు తరాల కవి సంగమం ఆగస్టు 20 సా.6గం.లకు గోల్డెన్ థ్రెషోల్డ్, అబిడ్స్, హైదరాబాద్ నందు జరుగుతుంది. జూపల్లి ప్రేంచంద్, వనపట్ల సుబ్బయ్య, ధర్ మురళి, రజిత కొమ్ము, గరిగె రాజేష్ పాల్గొంటారు. అశోక్ అవారి కవితా సంపుటి 'సహజ వాక్యం' ఆవిష్కరణ ఉంటుంది.

- యాకూబ్

వానమామలై వరదాచార్యులు జయంతి

తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో కవిసమయం, భారత్ కల్చరల్ అకాడెమీ నిర్వహణలో వానమామలై వరదాచార్యులు 105వ జయంతి సభ ఆగస్టు 17 సా.6.15 ని.లకు రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జరుగుతుంది. అధ్యక్షత కె.వి.రమణ, ముఖ్య అతిథి తిరుమల శ్రీనివాసాచార్య.

- తాళ్లపల్లి మురళీధర గౌడు

'మన సంస్కృతి-చరిత్ర' ఆవిష్కరణ

శైలజ బండారి రాసిన 'మన సంస్కృతి-చరిత్ర' భిన్న కోణాలు ఆవిష్కరణ ఆగస్టు 18 సా.6గం.లకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం, షోయబ్ హాల్, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ నందు జరుగుతుంది. అధ్యక్షత జె.వి.వి.రమేష్, ముఖ్య అతిథి పాశం యాదగిరి, తొలి ప్రతి స్వీకర్త శిలాలోలిత.

- పాలపిట్ట బుక్స్

'దిమాక్ ఖరాబ్' ఆవిష్కరణ

మోహన్ రుషి పుస్తం 'దిమాక్ ఖరాబ్' ఆవిష్కరణ ఆగస్టు 20 ఉ.10గం.లకు నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని ఎన్.ఎస్.పి క్యాంప్‌గ్రౌండ్ పక్కనన్న మేరెడ్డి రామచంద్రా రెడ్డి స్మారక గ్రంథాలయంలో జరుగుతుంది. కట్టా శేఖర్‌రెడ్డి, సుబ్బారావు, అంబటి సురేంద్రరాజు, గోరటి వెంకన్న, శంకర్ కార్టూనిస్ట్, సంగిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొంటారు.

- మోహన్ రుషి

నోముల కథా పురస్కారాలు

నోముల కథాపురస్కారం 2017కు ఇంతకుముందు అచ్చుకాని కథలను ఆగస్టు 30 లోగా నోముల సత్యనారాయణ, రవీంద్ర నగర్, నల్లగొండ, తెలంగాణ చిరునామాకు డిటిపి ప్రతులను పంపాలి. వివరాలకు 98662 98023.

- ఎన్. ఎస్. రాహుల్

వర్ధమాన కవయిత్రుల శిబిరం

తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ఆగస్టు 27, 28 తేదీల్లో జరిగే వర్ధమాన కవయిత్రుల అధ్యయన శిబిరంలో పాల్గొన దలచిన వర్ధమాన కవయిత్రులు తమ వివరాలను telanganasaraswathaparishath@gmail.comకు ఈ నెల 16లోగా దరఖాస్తులు పంపాలి. వివరాలకు 040-24753724.

-జె. చెన్నయ్య

ఛాయా చిత్ర ప్రదర్శన

సామాన్యశాస్త్ర ఛాయాచిత్ర ప్రదర్శన 'దైనందిన జీవితంలో సాహిత్యం'- ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆగస్టు 19 సా.6గం.లకు హైదరాబాద్‌లోని సామాన్య శాస్త్రం గ్యాలరీలో 'ద ఆర్డినరీనెస్ ఆఫ్ ట్రూత్' పేరిట ఛాయా చిత్ర ప్రదర్శన ఉంటుంది.

- కందుకూరి రమేష్ బాబు

కవితా సంపుటాలకు ఆహ్వానం

వెన్నెల సాహితీ సంగమం, సిద్దిపేట ఆధ్వర్యంలో ఎడ్ల గురవారెడ్డి స్మారక సాహిత్య పురస్కారం కొరకు 2015, 2016లలో ప్రచురించిన కవితా సంపుటాలు 3 ప్రతులను ఆగస్టు 31లోపు చిరునామా: కొండి మల్లారెడ్డి, ఇం.నెం. 19-61/5/సి, విద్యానగర్, రోడ్ నెం.3, కుషాల్ నగర్, సిద్దిపేట-502103, ఫోన్: 94419 05525కు పంపాలి.

- వెన్నెల సాహితీ సంగమం

కథలకు ఆహ్వానం

గోలివెంకటరామయ్య స్మారక పురస్కారంకోసం కథలను ఆగస్టు 30లోగా ఎడిటర్, నెలవంక నెమలీక సాహిత్య మాసపత్రిక, 15-140, పి అండ్ టి కాలనీ, కోదండ రామాలయం వీధి, దిల్‌సుక్ నగర్, హైదరాబాద్ 500060, ఫోన్ 98661 71648కు పంపాలి.

- లక్కరాజు దేవి

పరిశోధన, లెక్చరర్‌షిప్‌నకు అర్హత కల్పించే

యూజీసీ నెట్

ఉన్నత విద్య, పరిశోధనలో అవకాశాల కోసం యూనివర్సిటీ, డిగ్రీ కాలేజీలు, ఐఐటి వంటి ఉన్నత విద్యా సంస్థల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే అర్హత పరీక్ష నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్). యూనివర్సిటీ విద్యలో సాధించిన సబ్జెక్ట్ నాలెడ్జ్ స్థాయిని అంచనా వేయడానికి, పరిశోధన రంగాల్లో ప్రోత్సాహానికి ఈ నెట్ చక్కని మార్గం. మొత్తం 100 సబ్జెక్టుల్లో 'నెట్'ను నిర్వహిస్తారు.

బ్రిటిష్ ఇండియాలో భవిష్యత్తుకు అవసరమైన విద్య స్వరూపంపై 1792లో చార్లెస్ గ్రాంట్ తన 'అబ్జర్వేషన్స్'లో తొలిసారిగా వివరించాడు. 'వుడ్స్' రిపోర్ట్‌ను అనుసరించి 1857లో కలకత్తా, బొంబాయి, మద్రాస్‌లలో ప్రత్యేక యూనివర్సిటీలు ఏర్పాటు చేశారు. అయితే 1902లో అప్పటి గవర్నర్ జనరల్ 'కర్జన్' కృషితో అనేక నూతన యూనిర్సిటీలు ఏర్పాటయ్యాయి. ఈ పరంపరకు కొనసాగింపుగా 1948లో స్వతంత్ర భారతదేశంలో ఉన్నత విద్య, ప్రధానంగా యూనివర్సిటీ విద్యలో రావాల్సిన సంస్కరణలపై రాధాకృష్ణన్ కమిషన్ అనేక సిఫార్సులు చేసింది. అయితే ఉన్నత విద్యావ్యవస్థలో గుణాత్మక మార్పుల కోసం, పరిశోధన రంగంలో వైవిధ్యం కోసం, ఆచరణాత్మక, ఫలిత ఆధారిత ప్రమాణాల కోసం అనేక సూచనలను విద్యా నిపుణులు చేశారు. ఈ నేపథ్యంలోనే జాతీయ స్థాయిలో ఉన్నత ప్రమాణాలను నెలకొల్పడానికి 'జాతీయ అర్హత పరీక్ష (నెట్)' అమల్లోకి వచ్చింది. దాదాపుగా మూడు దశాబ్దాలుగా నిర్దేశిత ప్రమాణాల మేరకు అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఈ పరీక్ష దోహదపడుతోంది.

ప్రాథమిక సమాచారం

- యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ)కి ప్రాతినిధ్యం వహిస్తూ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సిబిఎస్ఇ) ఈ పరీక్షను నిర్వహిస్తుంది. రెండు విభాగాల్లో అర్హతను నిర్ణయించేందుకు ఈ పరీక్షను నిర్వహిస్తారు.

1. యూనివర్సిటీ స్థాయిలో అసిస్టెంట్ ప్రొఫెసర్స్ నియామకపు అర్హత
2. పరిశోధన రంగంలో ఫెలోషిప్ కోసం అర్హులను గుర్తించడం



డాక్టర్ మహ్మద్ రియాజ్
సీనియర్ ఫ్యాకల్టీ

- అయితే ఈ అర్హతను జాతీయ స్థాయిలో నిర్ణయిస్తారు. కాబట్టి బోధన, పరిశోధన రంగాల్లో స్థిరపడాలనుకొనే వారికి ఈ అర్హత ప్రాథమిక ఎంట్రీగా ఉపయోగపడుతుంది.
- ఉన్నత విద్యా సంస్థల్లో అంటే డిగ్రీ కళాశాలలు లేదా వాటికి సమానమైన సంస్థలు, ఐఐటిలు లేదా దానికి సమానమైన జాతీయ సంస్థల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరాంటే 'నెట్'లో ఉత్తీర్ణత సాధించడం తప్పని సరి.
- జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ కోసం అంటే పరిశోధన రంగం (పిహెచ్‌డి)లో అవసరమైన ఆర్థిక సహాయం పొందడానికి, అదేవిధంగా యూజీసీ అందజేసే ప్రోగ్రామ్‌లకు ఫైనాన్షియల్ అసిస్టెన్స్ పొందాలంటే ఈ పరీక్షలో అర్హత సాధించాలి.

ఎవరు అర్హులు?

- 55 శాతం మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు 'నెట్'కు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, పిడబ్ల్యుడి అభ్యర్థులకు మాత్రం 50 శాతం మార్కులు ఉంటే చాలు.
- పీజీ చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే నిర్దేశిత మార్కుల శాతాన్ని సాధించలేనప్పుడు అర్హత రద్దవుతుంది.

వయోపరిమితి- మినహాయింపులు

- జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ కోసం దరఖాస్తు చేసుకొనే అభ్యర్థుల వయోపరిమితి 2017 నవంబర్ 1 నాటికి 28 ఏళ్లకు మించకూడదు. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, పిబ్ల్యుడి, మహిళా అభ్యర్థులకు వయోపరిమితిలో ఐదేళ్ల మినహాయింపు లభిస్తుంది.
- అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాల అర్హతలకు సంబంధించి ఎటువంటి వయోపరిమితి లేదు.



పరీక్ష విధానం:

నెట్‌లో పేపర్ల విధానం ఉంటుంది. మూడు పేపర్లలో కలిపి అభ్యర్థులు నిర్దేశించిన మార్కులను సాధించాలి.

పేపర్	మార్కులు	ప్రశ్నల సంఖ్య	సమయం
1	100	50	75 నిమిషాలు
2	100	50	75 నిమిషాలు
3	150	75	150 నిమిషాలు

పేపర్-1: ఈ పేపర్ సంపూర్ణంగా టీచింగ్/రీసెర్చ్ ఆప్టిట్యూడ్‌కి చెందినది. రీజనింగ్ సామర్థ్యాలు, కాంప్రహెన్షన్, వైవిధ్య ఆలోచన విధానం, జనరల్ అవేర్‌నెస్, టీచింగ్‌లో సహజ సామర్థ్యాలపై ప్రశ్నలు ఉంటాయి. 50 ప్రశ్నలతో కూడిన ఈ ప్రశ్న పత్రంలో ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు కేటాయించారు. అభ్యర్థుల సహజ సాధారణ సామర్థ్యాలకు ఈ పేపర్ కొలమానిలా ఉంటుంది.

పేపర్-2: ఈ పేపర్ పోస్ట్‌గ్రాడ్యుయేషన్‌లో చదివిన సబ్జెక్ట్ సిలబస్ ఆధారితంగా ఉంటుంది. ఈ ప్రశ్నపత్రంలో మొత్తం 50 ప్రశ్నలకు గాను 100 మార్కులు కేటాయించారు.

పేపర్-3: ఈ ప్రశ్న పత్రం అభ్యర్థులు ఎంపిక చేసుకొన్న సబ్జెక్ట్ ఆధారంగానే ఉంటుంది. కానీ పేపర్-2తో పోల్చితే ఇందులో అడిగే ప్రశ్నలు చాలా లోతుగా ఉంటాయి. 75 ప్రశ్నలతో కూడిన ఈ ప్రశ్న పత్రాన్ని రెండున్నర గంటల్లో పూర్తి చేయాలి. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు కేటాయించారు. మొత్తం మార్కులు 150.

పరీక్ష కేంద్రాలు

తెలంగాణలో హైద్రాబాద్, వరంగల్; ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు, తిరుపతి, విశాఖపట్నం

ముఖ్యమైన తేదీలు

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు చివరి తేదీ: 11-09-2017
ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫీజు చెల్లించడానికి చివరి తేదీ: 12-09-2017
ఆన్‌లైన్‌లో దరఖాస్తులో తప్పుల సవరణ: 2017 సెప్టెంబరు 19 నుంచి 25 వరకు
నెట్ పరీక్ష తేదీ: 05-11-2017

ఎంపిక విధానం

- అభ్యర్థులను సబ్జెక్ట్ వారీగా ఆరు శాతానికి మించకుండా ఎంపిక చేస్తారు.
- వయసు, దరఖాస్తులో ఎంచుకొన్న అర్హత పరీక్ష ఆధారంగా మెరిట్ లిస్టును ప్రకటిస్తారు. ఈ లిస్టు నుంచే జెఆర్ఎఫ్‌కు క్వాలిఫైడ్ అయిన వారినీ ఎంపిక చేస్తారు.
- ఈ ఎంపికలో అర్హత సాధించిన వారందరికీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హత లభిస్తుంది. కానీ, ప్రత్యేక నిర్ధారిత మెరిట్ పొందిన వారు మాత్రమే జెఆర్ఎఫ్ అభ్యర్థులుగా గుర్తింపు పొందుతారు.

దరఖాస్తు విధానం

- అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
- దీనికి సంబంధించిన పూర్తి సమాచారం www.cbsenet.nic.in లభిస్తుంది.
- నిర్ణయించిన పరీక్ష ఫీజును క్రెడిట్/డెబిట్ లేదా ఇ-చాలన్ ద్వారా మాత్రమే చెల్లించాలి.
- మని ఆర్డర్, డిమాండ్ డ్రాఫ్ట్, ఐపిఒ చెల్లింపులను అంగీకరించరు.
- పరీక్ష ఫీజును జనరల్ అభ్యర్థులకు రూ.1000; ఒబిసి అభ్యర్థులకు రూ.500; ఎస్సీ, ఎస్టీ, పిబ్లుడి అభ్యర్థులకు రూ.250గా నిర్ణయించారు.
- దరఖాస్తు సంపూర్ణంగా నోటిఫికేషన్‌లో ప్రకటించిన ఫార్మాట్ ప్రకారమే ఉండాలి.

బీమా, బ్యాంకు ఏదైనా ప్రిపరేషన్ ఒక్కటే

బ్యాంకింగ్, బీమా రంగాల్లో ఉద్యోగాలకు నోటిఫికేషన్ల పరంపర మొదలైంది. ఎంపికలో భాగంగా నిర్వహించే పరీక్షల్లో సారూప్యత ఉంది. అలాంటప్పుడు ప్రిపరేషన్‌లోనూ ఒకే మార్గం అనుసరించ వచ్చన్నది నిపుణుల సూచన. ఆ నేపథ్యంతో అందిస్తున్న వ్యాసమిది.

- యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ 'అసిస్టెంట్' ఎగ్జామ్, ఐబిపిఎస్ బ్యాంకు క్లరికల్ ఎగ్జామ్‌లోనూ రెండు దశల పరీక్షలు ఉన్నాయి. అవి 1. ప్రిలిమ్స్ 2. మెయిన్స్
- ఇన్సూరెన్స్ 'అసిస్టెంట్' కోసం నిర్వహించే ప్రిలిమ్స్ ఎగ్జామ్‌లో ఇంగ్లీష్, రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ విభాగాలు ఉంటాయి. మొత్తం 100 మార్కులకు పరీక్ష ఉంటుంది. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహావే. టెస్ట్ పేపర్ ఇంగ్లీష్ /హిందీ మీడియంలో ఉంటుంది.
- ఇన్సూరెన్స్‌లోగాని, ఐబిపిఎస్‌లోగాని ప్రిలిమ్స్ ఎగ్జామ్‌లో ఇచ్చే 100 ప్రశ్నలు ఆన్సర్ చేయడానికి ఒక గంట (అంటే 60 నిమిషాలు) సమయం ఎట్టి పరిస్థితుల్లోనూ సరిపోదు. ఎంతటి మేధావికైనా. కంప్యూటర్‌తో అడ్జెస్ట్ కావటానికి కనీసం 15 నిమిషాలు కావాలి. ఈ అడ్డంకిని దాటినవాడే మొనగాడు. ఇంటి వద్ద కంప్యూటర్ ఉండి, రోజూ ప్రాక్టీసు చేసుకుంటే, ప్రిలిమ్స్ రాయటానికి కొంతవరకు పరిస్థితులను అధిగమించవచ్చు. అయితే ఇంటి వద్ద కంప్యూటర్లు ఎంతమందికి ఉన్నాయన్నది ప్రశ్న.
- ప్రిలిమ్స్ పాసయిన వారు మెయిన్స్ రాస్తారు. ఐబిపిఎస్, ఇన్సూరెన్స్ మెయిన్స్ పరీక్షలో ఇంగ్లీష్, రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ, జనరల్ అవేర్‌నెస్, కంప్యూటర్ నాలెడ్జ్ విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయి. మొత్తం మీద ఈ విభాగాల నుంచి 200 ప్రశ్నలు ఉంటాయి. సమయం రెండు గంటలు. అందువల్ల కంప్యూటర్‌తో అడ్జెస్ట్‌మెంట్ సమస్య వచ్చినా, 10-15 నిమిషాలు వృథా అయినా తేడా అనిపించదు.
- ఇన్సూరెన్స్ ఎగ్జామ్, ఐబిపిఎస్ రెండూ ఆన్‌లైన్ పరీక్షలే. అందువల్ల ఇన్సూరెన్స్‌కి ఐబిపిఎస్‌కి కొంత వరకు కామన్‌గా ప్రిపేర్ కావచ్చు. అయితే ఇన్సూరెన్స్ లేదా ఐబిపిఎస్ ఇంతవరకు అధికారికంగా సిలబస్ వివరించలేదు. గతంలో నిర్వహించిన ఎగ్జామ్ పేపర్లే ప్రాతిపదిక. వాటి ఆధారంగానే ప్రిపేర్ కావాలి.

ఇన్సూరెన్స్, ఐబిపిఎస్ క్లర్క్‌కి నిర్వహించే మెయిన్స్‌లో క్వాలిఫై అయితే చాలు. ఇంటర్వ్యూ లేదు. ఇన్సూరెన్స్ అసిస్టెంట్ ఎగ్జామ్ మెయిన్స్ పాసైన వారికి, తరవాత రీజినల్ లాంగ్వేజ్ టెస్ట్ నిర్వహిస్తారు. దీనిలో క్వాలిఫై అయితేనే ఉద్యోగం వస్తుంది. రీజినల్ రూరల్ బ్యాంక్స్‌లో ఆఫీస్ అసిస్టెంట్స్ (మల్టీ పర్పస్) కోసం ఐబిపిఎస్ నిర్వహించే మెయిన్స్ పరీక్షలో క్వాలిఫై అయిన వారికి లోకల్ లాంగ్వేజ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో క్వాలిఫై అయితేనే ఉద్యోగం దక్కుతుంది. ఇంటర్వ్యూ లేకపోవటమే ఇందుకు కారణం. క్లరికల్/ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగులు నేరుగా వినియోగదారులతో వ్యాపార సంబంధిత సంప్రదింపులు జరుపుతారన్నది గుర్తుంచుకోవాలి.

ఇన్సూరెన్స్ అసిస్టెంట్ ఎగ్జామ్, ఐబిపిఎస్ క్లరికల్ / రీజినల్ రూరల్ బ్యాంక్స్ ఆఫీస్ అసిస్టెంట్ (మల్టీ పర్పస్)ఎగ్జామ్‌కి దేనిలో తేడా కనిపిస్తుంది?

- రీజినల్ రూరల్ బ్యాంక్స్ కోసం ఆఫీస్ అసిస్టెంట్ (మల్టీ పర్పస్) రిక్రూట్ మెంట్ కోసం ఐబిపిఎస్ నిర్వహించే ప్రిలిమినరీ ఎగ్జామ్‌లో టెస్ట్ ఆఫ్ ఇంగ్లీష్ లేదు. ఇన్సూరెన్స్ అసిస్టెంట్ ఎగ్జామ్ ప్రిలిమ్స్‌లో టెస్ట్ ఆఫ్ ఇంగ్లీష్ కూడా ఉంది.
- ఇన్సూరెన్స్ అసిస్టెంట్ కోసం నిర్వహించే మెయిన్స్ ఎగ్జామ్‌లో ఉండే జనరల్ అవేర్‌నెస్ టెస్ట్‌లో జనరల్ నాలెడ్జ్‌కి తోడు ఇన్సూరెన్స్ రంగానికి సంబంధించిన ప్రశ్నలు కూడా ఉంటున్నాయి.

ఐబిపిఎస్ క్లరికల్ మెయిన్స్‌లో జనరల్ అవేర్‌నెస్ టెస్ట్‌లో జనరల్ నాలెడ్జ్‌తోపాటు బ్యాంకింగ్ నాలెడ్జ్ ప్రశ్నలు తప్పనిసరిగా ఉంటున్నాయి. నోటిఫికేషన్‌లోనే టెస్ట్ ఆఫ్ జనరల్ అవేర్‌నెస్ (బ్యాంకింగ్ నాలెడ్జ్‌తో కలిపి) పేర్కొన్నారు.

నిరుద్యోగి ఎక్కడికక్కడ పోటీ పరీక్షల్లో సాధారణ సారూప్యతలు వెతుక్కుంటూ, మార్గాన్ని సులభతరం చేసుకుంటూ విజయపథం వైపు కొనసాగాలి.

మెడికల్ స్ట్రీమ్‌లో ఆప్షన్లు...



బైపిసితో ఇంటర్ పూర్తిచేశాను. మెడిసిన్‌లో ర్యాంకు రాలేదు. మెడికల్ స్ట్రీమ్‌లో ఎంబిబిఎస్, బిడిఎస్ కాకుండా ఏ ఆప్షన్లు ఉంటాయి. ఈ సంవత్సరం మళ్లీ కోచింగ్ తీసుకుని మెడికల్ ఎంట్రెన్సులు రాయాలనుకుంటున్నాను. సలహా ఇవ్వగలరు?

- శ్రీలత, గుంటూరు

బయాలజీ సబ్జెక్టులతో ఇంటర్‌లో చేరిన ప్రతీ ఒక్కరి కల డాక్టర్ కావడం. అయితే ఈ కలను సాకారం చేసుకోవడంలో అతికొద్ది మంది మాత్రమే విజయం సాధిస్తారు. మిగిలినవారు అందరూ ప్రత్యామ్నాయం చూసుకోవాల్సిందే. బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులకు కూడా మంచి డిమాండే ఉంటుంది. టీచింగ్ వీరికి ఉన్న అవకాశాల్లో ప్రముఖమైనది. కెమిస్ట్రీ చదివినవారు ఫార్మాస్యూటికల్ రంగంలోకి వెళ్లడానికి అవకాశం ఉంటుంది.

మెడిసిన్‌లో సీటు రాకపోయినప్పటికీ మీకు వైద్య రంగంలోకి వెళ్లాలని ఉంటే ఫిజియోథెరపి, పారా మెడికల్ సైన్సెస్, ఫుడ్‌సైన్స్ తదితర రంగాల వైపు వెళ్లవచ్చు. క్లినిక్‌లు, ఆస్పత్రులు పెరుగుతున్న క్రమంలో పారామెడికల్ సిబ్బందికి దేశవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. రోగ నిర్ధారణ చేయాలంటే ల్యాబ్ టెక్నీషియన్ల అవసరం చాలా ఉంటుంది. వీరి రిపోర్టుల ఆధారంగానే డాక్టర్లు మందులు రాస్తుంటారు. ఎక్స్‌రే-సిటి స్కాన్‌లు తీసే సిబ్బంది, కంటిచూపును నిర్ధారించడంలో డాక్టర్లకు సహాయపడే ఆప్తల్మాలజిస్టు తదితర పారామెడికల్ సిబ్బంది అవసరం ఆస్పత్రుల్లో చాలా ఉంది.

బిఫార్మసి అనేది కూడా మీరు ఎంచుకోదగిన మరో రంగం. బయాలజీ సబ్జెక్టుపై ఆసక్తి ఉంటే ఫుడ్ ప్రాసెసింగ్, న్యూట్రిషియన్, డైటెటిక్స్ గురించి ఆలోచించవచ్చు. డిగ్రీ తరవాత బిఇడి, లేదా పీజీ చేసి టీచింగ్‌వైపు కూడా వెళ్లవచ్చు. సబ్జెక్టు స్ట్రీమ్‌ను అనుసరించి కూడా ఇతర అవకాశాలు ఉంటాయి. మీ తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు, సన్నిహితులను సంప్రదించి ఆసక్తులను అనుసరించి కోర్సులను ఎంచుకోండి.



● గోవర్ధనం కిరణ్‌కుమార్

చిరునామా: వివరాలు ఇవిగో, కేరాఫ్ ఎడ్యుకేషన్ డెస్క్, ఆంధ్రజ్యోతి, ప్లాట్ నెం.76, రోడ్ నెం.70, అశ్వినీ ఎన్‌క్లేవ్, హుడా హైట్స్, జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500 033

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్‌లో అసిస్టెంట్ పోస్టులు : 696

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్సు కంపెనీ లిమిటెడ్, ప్రధాన కార్యాలయం చెన్నైలో ఉంది. సుమారు రూ.16000 కోట్ల వ్యాపారం చేస్తోంది. దీనికి దేశవ్యాప్తంగా 2100 ఆఫీసులు ఉన్నాయి. 75 సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ జనరల్ ఇన్సూరెన్సు సంస్థ సుమారు 696 అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయటానికి ప్రకటన విడుదల చేసింది. డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. ఎంపికైన వారికి నెలకు రూ.23000 వేతనం ఆరంభంలో లభిస్తుంది. దరఖాస్తులను ఆగస్టు 28 వరకు స్వీకరిస్తారు.

- ఆంధ్రప్రదేశ్‌లో పోస్టుల సంఖ్య : 32
- తెలంగాణలో పోస్టుల సంఖ్య : 20

ఈ పోస్టుల భర్తీకి రెండంచెల పరీక్ష విధానాన్ని ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తున్నారు. ఇంటర్వ్యూ లేదు. ఈ పరీక్షలో ప్రిలిమినరీలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ (30 ప్రశ్నలు), రీజనింగ్ (35 ప్రశ్నలు), న్యూమరికల్ ఎబిలిటీ (35 ప్రశ్నలు) ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు కేటాయించారు. పరీక్ష కాల వ్యవధి ఒక గంట.

ఇంగ్లీష్ లాంగ్వేజ్ టెస్ట్ ప్రశ్నలు ఇంగ్లీష్‌లో, మిగిలిన టెస్ట్‌ల్లోని ప్రశ్నలు ఇంగ్లీష్/హిందీ మీడియాల్లో ఉంటాయి. అభ్యర్థులు ప్రతి టెస్ట్‌లోనూ కనీస అర్హత మార్కులు సంపాదించాలి. ప్రతి రాష్ట్రంలో ఉన్న పోస్టులకు స్టేట్‌వైజ్ అండ్ కేటగిరీ వైజ్‌గా ఏడు రెట్ల సంఖ్యలో అభ్యర్థులను మెయిన్ ఎగ్జామ్‌కు ఎంపిక చేస్తారు.

మెయిన్ ఎగ్జామినేషన్

రీజనింగ్, ఇంగ్లీష్ లాంగ్వేజ్, జనరల్ అవేర్‌నెస్, కంప్యూటర్ నాలెడ్జ్, న్యూమరికల్ ఎబిలిటీ నుంచి ఒక్కో దానిలో 40 ప్రశ్నలు 50 మార్కులకు ఉంటాయి. 200 ప్రశ్నలకుగాను 250 మార్కులు కేటాయించారు. కాలవ్యవధి రెండు గంటలు. ప్రిలిమినరీ మాదిరిగానే నిబంధనలు ఉంటాయి. అయితే, మెయిన్ ఎగ్జామ్‌లో పాసైన అభ్యర్థులు, రీజినల్ లాంగ్వేజ్ టెస్ట్‌లోనూ క్వాలిఫై కావాలి. రీజినల్ లాంగ్వేజ్ టెస్ట్‌లో క్వాలిఫై కావటానికి కనీస మార్కులు ఏవీ నిర్ధారించలేదు. ఈ టెస్ట్ రాసేందుకు అభ్యర్థులు ఆధార్ కార్డు తీసుకెళ్లాలి.

వెబ్‌సైట్: www.uiic.co.in

ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులు 300

ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ దేశవ్యాప్తంగా 300 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రకటన విడుదల చేసింది. ఇందులో జనరలిస్టులు 223, అకౌంట్స్ 20, ఆక్చురీస్ 2, లీగల్ 30, ఆటోమొబైల్ ఇంజనీర్స్ 15, మెడికల్ ఆఫీసర్స్ 10 ఉన్నాయి. ఆయా విభాగాల్లో డిగ్రీ పాసైన వారు అర్హులు.

సెలెక్షన్ విధానం

ఇందులో మూడు దశలు ఉంటాయి.

- స్క్రీనింగ్ టెస్ట్ (ప్రిలిమినరీ ఎగ్జామ్). ఇందులో 3 టెస్ట్‌లు ఉంటాయి. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలే. 100 ప్రశ్నలు ఉంటాయి. వీటిని ఒక గంట సమయం (60 నిమిషాలు)లో పూర్తి చేయాలి. ఇది ఆన్ లైన్ పరీక్ష.
- మెయిన్ ఎగ్జామ్‌లో రెండు విభాగాలు ఉంటాయి. మొదటి భాగంలో ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహావే. ఆన్‌లైన్‌లో పరీక్ష రాయాలి. ఇంగ్లీష్ మినహా మిగిలిన అంశాలన్నీ ఇంగ్లీష్/ హిందీ మీడియంలో ఉంటుంది. రెండో భాగం డిస్క్రిప్టివ్ పేపర్. ఇందులో వ్యాసరచన, ఉత్తరం రాయటం వంటి ప్రశ్నలు ఉంటాయి. ఆన్‌లైన్‌లో ఇంగ్లీష్‌లో పరీక్ష రాయాలి. చివరిగా ఇంటర్వ్యూ ఉంటుంది.
  స్క్రీనింగ్ టెస్ట్‌లో ఇంగ్లీష్ లాంగ్వేజ్ (30 ప్రశ్నలు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (35 ప్రశ్నలు), రీజనింగ్ ఎబిలిటీ (35 ప్రశ్నలు) ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 100 మార్కులు కేటాయించారు పరీక్ష కాలవ్యవధి గంట.

మెయిన్ ఎగ్జామినేషన్ (జనరలిస్టు)

రెండు గంటల కాలవ్యవధి కలిగిన ఈ పేపర్‌లో ఒక్కో దానిలో 50 మార్కుల చొప్పున రీజనింగ్ ఇంగ్లీష్ లాంగ్వేజ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నల సంఖ్య ఇవ్వలేదు.

డిస్క్రిప్టివ్ టెస్ట్

దీనిని ఇంగ్లీష్‌లో ఆన్‌లైన్‌లో మాత్రమే రాయాలి. 20 మార్కులకు ఎస్సే రైటింగ్, 30 మార్కులకు లెటర్ రైటింగ్ ఉంటాయి.

- **వెబ్‌సైట్:** http://www.orientalinsurance.org.in/ Career.jsp

- ప్రాతూరి పోతయ్యశర్మ

టాప్ మేనేజ్‌మెంట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్

మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి అత్యధిక మంది రాసే 'క్యాట్' నోటిఫికేషన్‌ను ఐఐఎం లక్నో విడుదల చేసింది. అదేవిధంగా స్పెషల్ ఎంబిఎ కోర్సుల నిర్వహణలో అత్యుత్తమ సంస్థ అయిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టి) ప్రకటన కూడా వెలువడింది. మరో వైపు కొన్ని దిగ్గజ బి-స్కూల్స్ నోటిఫికేషన్ల విడుదలకు సిద్ధమవుతున్నాయి. ఈ నేథ్యంలో జాతీయ స్థాయిలోని ఎంబిఎ/స్పెషలైజ్డ్ ఎంబిఎ ఎంట్రెన్స్ పరీక్షలపై ఫోకస్...

ఇంజనీరింగ్, మెడిసిన్ తరవాత నేడు అత్యధిక మంది విద్యార్థులు, తల్లిదండ్రుల లక్ష్యం ఎంబిఎ/మేనేజ్‌మెంట్ పీజీ. సాధారణ ఎంబిఎ కాలేజీల్లో కంటే జాతీయ స్థాయిలో ఉండే ఐఐఎంలు, బి-స్కూళ్లలో చదవాలనే ఎక్కువ మంది కోరుకొంటున్నారు. ఐఐఎంలు, బి-స్కూళ్లు పద్ధతిగా ప్రమాణాలను పెంచుకుంటూ వస్తున్నాయి. అంతర్జాతీయ నైపుణ్యాలు, మార్కెట్ పరిస్థితులపై అవగాహన పెరిగేలా ఆయా సంస్థలు సిలబస్‌పై నిరంతరం కృషి చేస్తున్నాయి. వీటికి తోడు ఈ సంస్థల్లో ఎంబిఎ లేదా స్పెషలైజ్డ్ ఎంబిఎ చేసిన వారికి వివిధ కంపెనీలు లక్షల ప్యాకేజీలతో స్వాగతం పలుకుతున్నాయి. దాంతో నేడు అనేక మంది ఇంజనీరింగ్ కోర్సులకు ప్రత్యామ్నాయంగా ఈ ఎంబిఎ కోర్సులనే ఎంపిక చేసుకొంటున్నారు.

జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎక్స్‌ఎటి)

ఈ పరీక్షను ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ జంషెడ్‌పూర్ నిర్వహిస్తుంది. ఈ పరీక్ష ద్వారా జేవియర్ అసోసియేట్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్స్‌తో పాటు 140 బి-స్కూల్స్‌లో ఎంబిఎలో ప్రవేశం పొందవచ్చు. ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ జంషెడ్‌పూర్‌లో మొత్తం 360 సీట్లున్నాయి. ఎంబిఎలో ప్రవేశం కోసం క్యాట్ తరవాత అత్యధిక మంది రాసే పరీక్ష ఎక్స్‌ఎటి. ఏటా సుమారు 90 వేల మంది ఈ పరీక్షకు హాజరవుతున్నారు.

- **అర్హత:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **పరీక్ష విధానం:** ఏటా ప్రశ్న పత్ర స్వభావం మారుతోంది. ప్రశ్నల సంఖ్యలో కూడా ఏటా మార్పులు ఉంటున్నాయి. పరీక్షను మాత్రం ఆఫ్‌లైన్ మోడ్‌లోనే నిర్వహిస్తున్నారు. 2017లో నిర్వహించిన పరీక్షను పరిశీలిస్తే పేపర్-1లో మూడు సెక్షన్స్ ఉన్నాయి. అవి వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్, డెసిషన్ మేకింగ్ అండ్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్. పేపర్-2లో 70 ప్రశ్నలను ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఇచ్చారు. క్వాంటిటేవ్ ఎబిలిటీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్‌కు ఎక్కువ వెయిటేజీ లభించింది. అదేవిధంగా పేపర్-2లో రెండు సెక్షన్స్ ఉన్నాయి. కొన్ని ప్రశ్నలను ఆబ్జెక్టివ్, మరికొన్ని ప్రశ్నలను సబ్జెక్టివ్ పద్ధతుల్లో ఇచ్చారు. అవి జనరల్ అవేర్‌నెస్, ఎస్సే రైటింగ్. జికెకు సంబంధించి 25 ప్రశ్నలు ఇచ్చారు. మరో ప్రశ్న ఎస్సే రైటింగ్‌కు సంబంధించింది. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయించారు. నెగెటివ్ మార్కింగ్ విధానాన్ని అనుసరించారు. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కును కట్ చేశారు. మొత్తం పరీక్ష కాల వ్యవధి మూడున్నర గంటలు. నోటిఫికేషన్ ఆగస్టులో విడుదలవుతుంది. పరీక్ష జనవరిలో ఉంటుంది.

వెబ్‌సైట్: http://www.xlri.ac.in/

సింబయాసిస్ నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (స్నాప్)

పుణెలోని సింబయాసిస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ (ఎస్ఐయు) ఈ పరీక్షను నిర్వహిస్తుంది. ఈ పరీక్షలో సాధించిన స్కోరు ద్వారా ఎస్ఐయు యూనివర్సిటీ పరిధిలోని 15 బి-స్కూళ్లలో ప్రవేశం పొందొచ్చు. మొత్తం 1900 సీట్లున్నాయి.

- **అర్హత:** 50 శాతం మార్కులు /తత్సమాన సిజిపిఎతో డిగ్రీ. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా అర్హులే.
- **పరీక్ష విధానం:** ఆఫ్‌లైన్ మోడ్ పరీక్ష. కాలవ్యవధి రెండు గంటలు. ప్రశ్నపత్రంలో నాలుగు విభాగాలు ఉంటాయి. అవి... ఇంగ్లీష్, క్వాంటిటేటివ్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ డేటా సఫిషియెన్సీ, జనరల్ అవేర్‌నెస్. మొత్తం మార్కులు 150. నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 25% మార్కు కట్ అవుతుంది. నోటిఫికేషన్ నవంబర్‌లో వచ్చే అవకాశం ఉంది.

వెబ్‌సైట్: http:// www.snaptest.org/symbiosisentranceexam-formba.html



ఎన్‌మ్యాట్ బై జిఎంఐసి

నర్సీమోంజీ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎన్‌మ్యాట్)ను మొదట ముంబైలోని నర్సీమోంజి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(ఎన్ఎంఐఎంఎస్) నిర్వహించేది. ఆ తరవాత ఈ పరీక్ష నిర్వహణ గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ కౌన్సెల్(జిఎంఎసి) ఆధ్వర్యంలోకి మారింది. ఎన్‌మ్యాట్ స్కోరును నర్సీమోంజీ ఇన్‌స్టిట్యూటే కాకుండా దేశంలోని మరో 23 బి-స్కూళ్లలో ప్రవేశానికి పరిగణనలోకి తీసుకొంటారు. పరీక్ష కంప్యూటర్ బేస్డ్ పద్ధతిలోనే ఏటా అక్టోబరు నుంచి డిసెంబర్ మధ్యన నిర్వహిస్తారు. ఒక అభ్యర్థికి మూడు అటెంప్ట్‌లకు మించి అనుమతించరు. ఒక వేళ అభ్యర్థి మూడు సార్లు పరీక్ష రాసినట్లయితే, వాటిలో మెరుగైన స్కోరును మాత్రమే ప్రవేశ సమయంలో పరిగణనలోకి తీసుకొంటారు.

- **అర్హత:** 50 శాతం మార్కులు /తత్సమాన సిజిపిఎతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా అర్హులే.
- **పరీక్ష విధానం:** రెండు గంటల వ్యవధి గల పరీక్షలో మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ఆబ్జెక్టివ్ క్వశ్చన్స్ ఉంటాయి. ప్రశ్నపత్రంలో మూడు విభాగాలుంటాయి. అవి లాంగ్వేజ్ స్కిల్స్, క్వాంటిటేటివ్ స్కిల్స్, లాజికల్ రీజనింగ్ క్వశ్చన్స్. నెగెటివ్ మార్కింగ్ విధానం లేదు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. చివరి తేది అక్టోబరు 3. పరీక్షను అక్టోబరు 5 నుంచి డిసెంబరు 18 వరకు నిర్వహిస్తారు.

వెబ్‌సైట్: http://www.nmat.org.in/

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టి)

కేంద్ర ప్రభుత్వం స్థాపించిన ఢిల్లీలోని ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టి) ఇండియాలోని టాప్ బి-స్కూల్స్‌లో ఒకటి. ఎంబిఎ ఇంటర్నేషనల్ బిజినెస్ (ఎంబిఎ-ఐబి) ఈ సంస్థలో ప్రతిష్ఠాత్మకమైన కోర్సు. ఐఐఎఫ్‌టికి ఢిల్లీతోపాటు కోల్‌కతా, కాకినాడ (యుజిసి అనుమతి రావాల్సి ఉంది)లో క్యాంపస్‌లు ఉన్నాయి. ఢిల్లీ, కోల్‌కతా క్యాంపస్‌లలో మొత్తం సీట్ల సంఖ్య 350. ఈ సంస్థ ఏటా నవంబర్‌లో నాలుగో ఆదివారం 'ఐఐఎఫ్‌టి ఎంట్రెన్స్ ఎగ్జామ్'ను నిర్వహిస్తుంది. ఆ క్రమంలో ఈ ఏడాది కూడా నవంబర్ 26నే పరీక్ష నిర్వహిస్తున్నట్లు నోటిఫికేషన్ విడుదల చేసింది. కానీ అదే తేదీన క్యాట్ పరీక్ష నిర్వహిస్తున్నారు. దాంతో విద్యార్థుల అభ్యర్థన మేరకు పరీక్షను 2017 డిసెంబరు 3కి ఐఐఎఫ్‌టి మార్చింది. ఏటా సుమారు 60 వేల మంది ఈ పరీక్షకు హాజరవుతున్నారు.

- **అర్హత:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **పరీక్ష విధానం:** పరీక్షను ఆఫ్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. కాల వ్యవధి రెండు గంటలు. మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలుంటాయి. ప్రశ్నల సంఖ్యలో ఏటా మార్పులు చేస్తుంటారు. గత సంవత్సరం నిర్వహించిన పరీక్షలో మొత్తం 113 ప్రశ్నలున్నాయి. ప్రశ్న పత్రంలో నాలుగు విభాగాలున్నాయి. అవి క్వాంటిటేటివ్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ ఎబిలిటీ, వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్ అండ్ జనరల్ అవేర్‌నెస్. భిన్నమైన మార్కింగ్ విధానం ఉంటుంది. ఒక్కో విభాగానికి 0.50 నుంచి 1 మార్కు వరకు కేటాయిస్తారు. ఏ విభాగంలోని ప్రశ్నలకు ఎన్ని మార్కులు ఉంటాయన్న విషయాన్ని కచ్చితంగా చెప్పలేం. నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3వ మార్కు కట్ చేస్తారు. నోటిఫికేషన్ విడుదలైంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు చివరి తేది సెప్టెంబరు 15. పరీక్షను డిసెంబరు 3న నిర్వహిస్తారు.

వెబ్‌సైట్: http://tedu.iift.ac.in/

కామన్ మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (సిమ్యాట్)

ఆల్ ఇండియా కౌన్సెల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఎఐసిటిఇ) 2012 నుంచి సిమ్యాట్‌ను నిర్వహిస్తోంది. గతంలో ఈ పరీక్షను ఏటా రెండు సార్లు నిర్వహించేవారు. అయితే 2015 నుంచి ఏటా ఒక్కసారి జనవరిలో మాత్రమే నిర్వహిస్తున్నారు. ప్రతి సంవత్సరం సిమ్యాట్ రాసే వారి సంఖ్య పెరుగుతోంది. సిమ్యాట్ స్కోరును దేశంలోని సుమారు 1500 బి-స్కూళ్లు ప్రవేశాలకు అర్హతగా పరిగణిస్తుండటమే అందుకు కారణం. ఈ 1500 బి-స్కూళ్లలో 35,000పైగా ఎంబిఎ సీట్లున్నాయి. ప్రముఖ విద్యా సంస్థలైన జమ్నాలాల్ బజాజ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(జెబిఐఎంఎస్), సిడెన్‌హమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, గోవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ వంటివి సిమ్యాట్ స్కోరుతో ఎంబిఎలో ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

- **అర్హత:** 50 శాతం మార్కులు/తత్సమాన సిజిపిఎతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైనవారు సిమ్యాట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా అర్హులే.
- **పరీక్ష విధానం:** ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ప్రశ్న పత్రంలో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలుంటాయి. వీటిని నాలుగు విభాగాలుగా విభజించారు. అవి... క్వాంటిటేటివ్ టెక్నిక్స్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్, లాజికల్ రీజనింగ్, లాంగ్వేజ్ కాంప్రహెన్షన్, జనరల్ అవేర్‌నెస్. ప్రతి విభాగానికి 25 మార్కులు కేటాయించారు. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు కట్ చేస్తారు. ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు ఉంటాయి. మూడు గంటల వ్యవధిలో పరీక్షను పూర్తి చేయాలి. నోటిషికేషన్ అక్టోబరు రెండో వారం నుంచి డిసెంబరు చివరి మధ్య విడుదలవుతుంది. **వెబ్‌సైట్:** http://www.aictecmat.in/

మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (మ్యాట్)

భారతదేశంలోని 500 బి-స్కూళ్లు, ఇతర సంస్థల్లో ఎంబిఎలో ప్రవేశానికి ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఎఐఎంఎ) ఈ పరీక్షను నిర్వహిస్తుంది. ఈ పరీక్ష ఏటా నాలుగు సార్లు ఫిబ్రవరి, మే, సెప్టెంబరు, డిసెంబర్ మాసాల్లో జరుగుతుంది. 2009 నుంచి దీన్ని ఆన్‌లైన్ పద్ధతిలో కూడా నిర్వహించడం ప్రారంభించారు. ప్రతి సెషన్‌లో సుమారు 20 వేల మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతున్నారు. మ్యాట్‌ను ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ పద్ధతుల్లో అభ్యర్థి తనకు నచ్చిన విధానాన్ని ఎంపిక చేసుకోవచ్చు. ఆఫ్‌లైన్ మోడ్‌లో అయితే మొదటి ఆదివారం, ఆన్‌లైన్ మోడ్‌లో రెండో శనివారం నిర్వహిస్తారు. ఆన్‌లైన్ మోడ్‌లో దరఖాస్తు చేసుకొనే అభ్యర్థుల సంఖ్యను బట్టి పరీక్షను రెండు లేదా మూడు రోజులు, అదే ఆఫ్‌లైన్ మోడ్‌లో అయితే పరీక్షను ఒకే రోజు నిర్వహిస్తారు.

- **అర్హత:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **పరీక్ష విధానం:** ప్రశ్న పత్రం మల్టిపుల్ చాయిస్ ఆబ్జెక్టివ్ టైప్‌లో ఉంటుంది. వ్యవధి 2:30 గంటలు. మొత్తం ఐదు విభాగాలుంటాయి. అవి... లాంగ్వేజ్ కాంప్రహెన్షన్, డేటా ఎనాలిసిస్ అండ్ సఫిషియెన్సీ, మేథమెటికల్ స్కిల్స్, ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్ అండ్ ఇండియన్ అండ్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్. ప్రతి విభాగంలో 40 ప్రశ్నలుంటాయి. మొత్తం ప్రశ్నల సంఖ్య 200. ప్రతి ప్రశ్నకు నాలుగు మా ర్కులు కేటాయించారు. ప్రతి తప్పు సమాధానికి 1/4మార్కు కట్ చేస్తారు.

వెబ్‌సైట్: https: //www. aima. in

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్ ఆనంద్(ఐఆర్ఎంఎ)

ఐఆర్ఎంఎ రూరల్ మేనేజ్‌మెంట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ఆఫర్ చేస్తోంది. మొత్తం 180 సీట్లు ఉన్నాయి. 2013-15 విద్యా సంవత్సరం వరకు కేవలం క్యాట్ స్కోరు ఆధారంగానే ఐఆర్ఎంఎ అడ్మిషన్ కల్పించేది. అయితే 2014-16 విద్యా సంవత్సరం నుంచి క్యాట్ స్కోరుతో పాటు ప్రత్యేకంగా నిర్వహించే ఐఆర్ఎంఎ పరీక్షకు హాజరవడం తప్పనిసరి చేశారు. ఎందుకంటే ఐఆర్ఎంఎ ఎగ్జామ్ ప్యాటర్న్, క్యాట్ ఎగ్జామ్ ప్యాటర్న్ ఒకేలా ఉండదు. ఐఆర్ఎంఎ ప్రవేశ పరీక్షలో ఎక్కువగా 'ఇష్యూస్ ఆఫ్ సోషల్ కన్సర్న్'పై ప్రశ్నలు ఉంటాయి.

- **అర్హత:** 50 శాతం మార్కులు /తత్సమాన సిజిపిఎతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా అర్హులే.
- **పరీక్ష విధానం:** గతేడాది నిర్వహించిన పరీక్షను పరిశీలిస్తే ఇది కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ ఎగ్జామ్. వ్యవధి 80 నిమిషాలు. ప్రశ్న పత్రం మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటుంది. మొత్తం 40 ప్రశ్నలు 'ఇష్యూస్ ఆఫ్ సోషల్ కన్సర్న్'పై ఉంటాయి. వీటిలో పేరాగ్రాఫ్ బేస్డ్ ప్రశ్నలు 28, పేరాగ్రాఫ్ బేస్డ్ ఫిల్ ఇన్ ద బ్లాంక్ ప్రశ్నలు 9, స్టాండలోన్ ప్రశ్నలు 9 ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. తప్పు సమాధానానికి 1/4 మార్కు కట్ చేస్తారు.

వెబ్‌సైట్: https://www.irma.ac.in

స్పెషలైజ్డ్ ఎంబిఎ ప్రోగ్రామ్స్

సాధారణ ఎంబిఎ కోర్సులతో పాటు అనేక బి-స్కూళ్లు నేడు స్పెషలైజ్డ్ ఎంబిఎ కోర్సులను కూడా ఆఫర్ చేస్తున్నాయి. అయితే కోర్సుల్లో ప్రవేశానికి ఆయా సంస్థలు ప్రత్యేక ఎంట్రెన్స్ పరీక్షలు నిర్వహిస్తున్నాయి. పరీక్షలు సాధారణ ఎంట్రెన్స్ టెస్ట్‌లా కాకుండా పూర్తిగా సబ్జెక్ట్ నాలెడ్జ్‌ను పరీక్షించేలా ఓరియెంటేషన్ మెథడ్‌లో ఉంటాయి.

మైకా ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఎంఐసిఎటి)

అహ్మదాబాద్‌లోని ముద్రా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఈ పరీక్షను నిర్వహిస్తుంది. ఈ పరీక్షలో ఉత్తీర్ణ సాధించిన వారికి స్పెషలైజ్డ్ ఎంబిఎం ప్రోగ్రామ్ ఇన్ కమ్యూనికేషన్‌లో సీటు లభిస్తుంది. మొత్తం 180 సీట్లు ఉన్నాయి.

- **అర్హత:** 50శాతం మార్కులు/తత్సమాన సిజిపిఎతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా అర్హులే. అయితే అభ్యర్థులకు తప్పనిసరిగా క్యాట్, ఎక్స్‌ఎటి, మ్యాట్, సిమ్యాట్, ఎటిఎంఎ, జిమ్యాట్‌ల్లో ఏదో ఒక పరీక్ష స్కోరు తప్పనిసరి.
- **పరీక్ష విధానం:** కంప్యూటర్ బేస్డ్ పరీక్ష. వ్యవధి 3:30 గంటలు. ప్రశ్న పత్రం సబ్జెక్టివ్, ఆబ్జెక్టివ్ రెండు పద్ధతుల్లోనూ ఉంటుంది. ప్రశ్న పత్రంలో మూడు భాగాలుంటాయి. మొదటి భాగంలో 4 డిస్క్రిప్టివ్ క్వశ్చన్స్ ఉంటాయి. వీటికి 35 నిమిషాల్లో సమాధానాలు రాయాలి. నెగెటివ్ మార్కింగ్ లేదు. రైటింగ్ ఆర్గ్యుమెంట్స్, ఎస్సే రైటింగ్, స్టోరీపై ప్రశ్నలు ఉంటాయి. రెండో విభాగం సైకోమెట్రిక్ టెస్ట్‌కు సంబంధించింది. దీనిని 25 నిమిషాల్లో, మూడో భాగాన్ని గంట నలభై ఐదు నమిషాల్లో పూర్తి చేయాలి. ఇందులో తిరిగి మూడు సెక్షన్లు ఉంటాయి. అవి క్వాంటిటేటివ్ ఎబిలిటీ, జనరల్ నాలెడ్జ్, డైవర్జెంట్ కన్వర్జంట్ రీజనింగ్.

వెబ్‌సైట్: www.mica.ac.in

యూపీఈఎస్ మేనేజ్‌మెంట్ ఎంట్రెన్స్ టెస్ట్ (యూపీఈఎస్-ఎంఇటి)

డెహ్రాడూన్‌లోని పెట్రోలియం అండ్ ఎనర్జీ స్టడీస్(యూపీఈఎస్) నిర్వహించే వివిధ ఎంబిఎ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశానికి ఉద్దేశించిన పరీక్ష ఇది. 10 ఎంబిఎ స్పెషలైజేషన్స్‌లో మొత్తం 465 సీట్లున్నాయి.

- **అర్హత:** 50 శాతం మార్కులు /తత్సమాన సిజిపిఎతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా అర్హులే.
- **పరీక్ష విధానం:** ఆన్‌లైన్ మోడ్‌లో పరీక్ష ఉంటుంది. మొత్తం ప్రశ్నల సంఖ్య 160. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ మల్టిపుల్ చాయిస్ పద్ధతిలో ఉంటాయి. రెండున్నర గంటల వ్యవధిలో పరీక్షను పూర్తి చేయాలి. పరీక్షలో నాలుగు విభాగాలుంటాయి. ప్రతి విభాగంలో 40 ప్రశ్నలు అడుగుతారు. జనరల్ ఇంగ్లీష్‌లో రీడింగ్ కాంప్రహెన్షన్, వెర్బల్ రీజనింగ్, వెర్బల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లో డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ డేటా సఫిషియెన్సీ; జనరల్ అవేర్‌నెస్‌లో జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, బిజినెస్ సినారియో అండ్ ఎనలటికల్ అండ్ లాజికల్ రీజనింగ్ అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

వెబ్‌సైట్:http://www.upes.ac.in/

కామన్ అడ్మిన్ టెస్ట్ (క్యాట్)

ఎంబిఎ ఎంట్రెన్స్ టెస్టుల్లో ఎవరెస్ట్ క్యాట్(కామన్ అడ్మిషన్ టెస్ట్). ఏటా సుమారు రెండు లక్షలకు పైగా విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతున్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) ఈ పరీక్షను నిర్వహిస్తోంది. దేశంలో ప్రస్తుతం 20 ఐఐఎంలు, 100-బి స్కూల్స్ క్యాట్ స్కోరు ఆధారంగా తమ సంస్థల్లో ప్రవేశాలు కల్పిస్తున్నాయి. ఐఐఎంలు, బి-స్కూల్స్‌లో కలిపి మొత్తం నాలుగు వేల సీట్లు ఉన్నాయి.

2009 వరకు క్యాట్ పరీక్షను ఆఫ్‌లైన్ మోడ్‌లో అంటే పేపర్, పెన్సిల్ పద్ధతిలో నిర్వహించేవారు. ఆ తరవాత పరీక్షలో మార్పులు చేశారు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(ఆన్‌లైన్‌మోడ్)గా మార్చారు. 2014 నుంచి టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టిసిఎస్) సహకారంతో ఆన్‌లైన్‌లో క్యాట్ పరీక్షను విజయవంతంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం క్యాట్-2017 నోటిఫికేషన్‌ను ఐఐఎం లక్నో విడుదల చేసింది. సెప్టెంబర్ 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. పరీక్షను నవంబర్ 26న నిర్వహిస్తారు.

- **అర్హత:** 50 శాతం మార్కులు/తత్సమాన సిజిపిఎతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైనవారు క్యాట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా అర్హులే.
- **పరీక్ష విధానం:** మల్టిపుల్ చాయిస్ ఆబ్జెక్టివ్ ప్రశ్న పత్రం ఉంటుంది. మొత్తం 100 ప్రశ్నలుంటాయి. వీటిని మూడు విభాగాలుగా విభజించారు. క్వాంటిటేటివ్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్, లాజికల్ రీజనింగ్ అండ్ వెర్బల్ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్. పరీక్ష కాల వ్యవధి మూడు గంటలు. అంటే ప్రతి విభాగాన్ని గంటలో పూర్తి చేయాలి. ప్రతి ప్రశ్నకు మూడు మార్కులుంటాయి. నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు కట్ చేస్తారు. జాతీయ స్థాయిలో ప్రస్తుతం ఉన్న పోటీ పరీక్షల్లో అత్యంత కఠినమైంది క్యాట్. అయితే కొన్నేళ్లుగా క్యాట్ నిర్వహణలో ఎన్నో మార్పులు చోటు చేసుకొంటున్నాయి. అందులో భాగంగా 2015 నుంచి ఆన్‌స్క్రీన్ క్యాలిక్యులేటర్ విధానంతోపాటు నాన్-ఎంసిక్యూ (నాన్ మల్టిపుల్ చాయిస్ క్వశ్చన్స్) విధానాన్ని ప్రవేశ పెట్టారు. అయితే నాన్-ఎంసిక్యూ ప్రశ్నలకు నెగెటివ్ మార్కింగ్ వర్తించదు.

వెబ్‌సైట్: www.iimcat.ac.in

Scholarship Alert

Kishore Vaigyanik Protsahan Yojana (KVPY) 2017

Category: National
Description: To identify and encourage talented and motivated students to pursue career in research, Department of Science and Technology, Government of India is offering the scheme to young science fellows studying anywhere in India.
Eligibility: Students enrolled in class +1, +2 and 1st year of graduation in science related subjects or programme- having minimum marks required, based on the choice of programme under taken, can apply for this scheme.
Application: Applications are accepted online with registration fee of INR 1000 for general and OBC category and INR 500 for SC, ST or PWD category applicants.
Prizes & Rewards: INR 5000 to INR 7000 p.m. and annual contingency grant of INR 20,000 to INR 28,000 will be awarded depending upon the eligibility and choice of course taken by the candidate.
Last Date to Apply: August 23, 2017 **Short Source URL:** http://www.b4s.in/aj/KVP7

International Physician Scholarship USA 2017

Category: International
Description: American Academy of Hospice and Palliative Medicine is offering the scholarship opportunity to young physicians to attend an educative assembly in Chicago to learn, share and acquire new knowledge in hospice industry.
Eligibility: Candidate must be working physicians, since past 2-10 years in hospice and palliative medicines holding US visa, can apply for the scholarship.
Application: Online applications are accepted.
Prizes & Rewards: Financial support of up to USD 5000 which covers annual assembly registration and travel expenses, including air and local travel, meals and lodging.
Last Date to Apply: August 21, 2017 11:59 AM CST
Short Source URL: http://www.b4s.in/aj/IPS1

Curtin University International Student Scholarship 2017

Category: International
Description: 10 scholarship opportunities are provided by Curtin Graduate School of Business, Australia to pursue master's degree in business administration and mineral and energy economics to encourage and support international candidates.
Eligibility: Graduate candidate should be an international student holding a full- time offer of place in the B- school campus of Curtin University.
Application: Applications are attended online only.
Prizes & Rewards: Total of AUD 10,000 towards fees of 8 units will be awarded over the duration of MSc. or MBA programme.
Last Date to Apply: August 25, 2017
Short Source URL: http://www.b4s.in/aj/MIS0

courtesy www.buddy4study.com

నవ్య
కుటుంబ కదంబం
navya@andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
14-8-2017 • సోమవారం

ఉట్టి కొడతావా? ఉలిక్కి పడతావా!

'గోవిందా ఆలా రే.. ఆలా..' పాట హోరెత్తుతోంది..
"జరా సంభాల్‌కే!"
"అరే అచ్ఛా పక్‌డో!"
"హల్లూ.. హల్లూ.."
"ఓ లడ్‌కాకో దేఖ్.. ఇస్ సాల్ బీ హాండీకో ఉఁనీ మారా!!"
"షోర్ మచ్ గయా షోర్... ఆగయా మాఖన్ చోర్" పాట మొదలైంది!
ముంబయ్ నగరంలో కృష్ణాష్టమి సందర్భంగా వీధి వీధిలో వినిపించే మాటలు, పాటలివి!

కృష్ణుడు అనగానే చిలిపితనం సగపాళ్లు, కొంటెతనం అరపాళ్లు కలగలసిన ఉల్లాస మూర్తి. గోపెమ్మ కుండలో ఉన్న వెన్నముద్ద కొల్లగొట్టడం ఆయనకు అచ్చంగా వెన్నతో పెట్టిన విద్య. ఉట్టి మీద పాలు-పెరుగు దొంగలించడంలో ఆయనకు ఆయనే సాటి. ఆకాశానికి ఎగరగలిగే కన్నయ్య.. ఉట్టికెగరలేడా! అయినా.. గోపాలురతో జట్టు కట్టి.. వారి భుజానెక్కి.. ఉట్టి పగులగొట్టి.. ఆనందించడం ఆయనకో సరదా. అందుకే నల్లనయ్య పుట్టినరోజైన గోకులాష్టమి రోజు ఉట్టి కొట్టడం.. సరాదాగా సాగే సదాచారమైంది.


మహారాష్ట్రలో.. అందునా ముంబయ్ నగరంలో.. ఉట్టి ఉత్సవం అంగరంగ వైభవంగా సాగుతుంది. ఆ రోజు వీధులన్నీ యువకులతో నిండిపోతాయి. ఏడాదంతా ఎవరికి వారే అన్నట్టుండే ముంబయ్ మహానగరంలో.. ఉట్టి ఉత్సవం దగ్గరికి వచ్చేసరికి ఒకరికి ఒకరు అనుకుంటారు. తమలో ఎవరో ఒకరు 'దహీ హాండీ'ని పగులగొట్టాల్సిందే అని బలంగా ఫిక్సవుతారు. ఏ నాలుగంతస్తుల ఎత్తులోనో.. ఐదంతస్తుల ఎత్తులోనో.. ఉన్న 'దహీ హాండీ' (పెరుగు, వెన్నెతో నింపిన కుండ-ఉట్టి) మూడు దెబ్బల్లో ముక్కలు చెక్కలు చేయాలి. అందనంత ఎత్తులో ఉన్న లక్ష్యాన్ని అందుకోవడానికి అందరూ ఒక్కటిగా చేతులు కలుపుతారు. మానవ పిరమిడ్‌ని నిర్మిస్తారు. ముందు ఇరవై మంది.. వారిపై పదిహేను మంది.. వారి భుజాలపై ఎనిమిది మంది.. ఇలా తొమ్మిది వరుసలు మించకుండా హ్యూమన్ పిరమిడ్ నిర్మిస్తారు. గోపయ్యపై రంగులు చల్లుతూ గోపెమ్మలు ఆటపట్టించినట్టు. ఉట్టి కొట్టడానికి సిద్ధపడిన యువకులపై యువతులు, పిల్లలు, పెద్దలు అంతా నీళ్లు చల్లుతుంటారు. వీటన్నింటినీ ఓర్చుకుంటూ... అందులో నచ్చిన చిన్నది ఉంటే కన్నుగీటుతూ.. ఉట్టి కొట్టడంలో ఎవరి సత్తా వారు ప్రదర్శిస్తుంటారు. పిరమిడ్‌లో చివరగా ఉన్న వ్యక్తి అదను చూసి ఉట్టిని పగులగొడతాడు. అంతే... కేరింతలు మిన్నంటుతాయి. ఉట్టి కొట్టలేక.. ఉలిక్కిపడ్డారా.. పిరమిడ్ నేల కూలుతుంది. 'గోవిందా ఆలా రే.. ఆలా..' పాట మళ్లీ మొదలవుతుంది.



కృష్ణం ప్రియం

ఆటపాటలతో ఆనందంగా సాగిపోయే 'దహీ హాండీ' వేడుక ప్రపంచవ్యాప్తంగా జరిగే పసందైన ఉత్సవాల్లో ఒకటిగా పేరొందింది. అందుకే ముంబయ్‌లో గల్లీ లీడర్ నుంచి పొలిటికల్ పార్టీల అధినేతల వరకూ... అందరూ దీనిని సీరియస్‌గా తీసుకుంటారు. ఎవరికి వారు జనాలను ఆకట్టుకునేందుకు ప్రత్యేకంగా ఉట్టి కొట్టు ఉత్సవాలను నిర్వహిస్తారు. లక్ష నుంచి పది లక్షల వరకు ప్రైజ్ మనీ కూడా ప్రకటిస్తారు. ఉట్టి కొట్టిన వీరుడికి అందరి సమక్షంలో నగదు బహుమతిని అందజేస్తారు.

ఉట్టి కొట్టడం కోసం ప్రత్యేక బృందాలు కూడా ఉంటాయి. ఇందులోని సభ్యులు ఉట్టి కొట్టడంలో ఉద్దండపిండాలు అన్నమాట. గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లు, కాలనీల్లో.. 'దహీ హాండీ' నిర్వహించి.. అక్కడి వారిని ఆనందింపజేయడం వీరి పని. ఉట్టి కొట్టినందుకుగానూ వేలల్లో ఫీజు వసూలు చేస్తారు. హ్యూమన్ పిరమిడ్ ఎత్తులోనూ ఏటా రికార్డులు నమోదవుతూ ఉంటాయి. సందడిగా సాగే 'దహీ హాండీ' ఇప్పుడు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఎక్కడ ఎలా చేసినా.. ముంబయ్ తర్వాతే ఎక్కడైనా అంటారు అంతా!



లైఫ్ సేవర్



హైదరాబాద్‌కు చెందిన ప్రత్యూషా రెడ్డి - పసిబిడ్డల ఆరోగ్యానికి సంబంధించి 'నిమో బేబీవేర్'ను రూపొందించారు. 'నిమోకేర్' అనే హెల్త్‌స్టార్టప్ ప్రారంభించిన ఆమె తాము తయారుచేసిన ఈ 'స్మార్ట్' పరికరం గురించి తన బృంద సభ్యులతో కలిసి 'నవ్య'తో ఇలా పంచుకున్నారు.

స్మార్ట్ బేబీ కేర్!

"నెలలు నిండకముందే పుట్టిన పిల్లలనూ, పలు ఆరోగ్య సమస్యలతో ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉండే పసివాళ్లనూ ప్రతీక్షణం మానిటర్ చేసే పరికరం ఇది. దీని గురించిన వివరాల్లోకి వెళ్లే ముందు నా గురించి కొంత చెప్పాలి. నేను పుట్టింది, పెరిగింది హైదరాబాద్‌లోనే. బేగంపేటలోని 'హైదరాబాద్ పబ్లిక్ స్కూల్'లో చదివా. అమ్మానాన్న ఇద్దరూ డాక్టర్లు. అందుకే కాబోలు వాళ్లు నేను డాక్టర్ చదివితే బాగుండనుకునేవాళ్లు. నాకు మాత్రం ఇంజినీరింగ్ చదవాలనిపించింది. నా నిర్ణయానికి విలువనిచ్చి వాసవి కాలేజీలో ఇంజనీరింగ్ చదివించారు.



మనోజ్, శరత్, ప్రత్యూష, కీర్తన

ఆ తరువాత అహ్మదాబాద్‌లోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్'(ఎన్‌ఐడి)లో చేరాను. అది పూర్తయ్యాక కొన్నాళ్లు డిజైనింగ్ కన్సల్టింగ్ సంస్థల్లో పనిచేశాను. సొంతంగా ఓ డిజైనింగ్ కన్సల్టెన్సీ సంస్థ కూడా నడిపాను. బ్రిటన్‌లో పనిచేశాను. ఆ తరువాత హైదరాబాద్‌లోని ఐఐటిలో 'సెంటర్‌ఫర్ హెల్త్‌కేర్ ఎంట్రప్రెన్యూర్‌షిప్'లో ఫెలోషిప్ ప్రోగ్రాంలో చేరాను.

పూర్వానుభవంతో...

గత సంవత్సరం నుంచి ఆ ప్రోగ్రాంకి సంబంధించిన పనిచేస్తున్నాను. నాతోపాటు ఈ ఫెలోషిప్‌లో ఉన్న మనోజ్ కూడా ఇదే విషయం మీద పనిచేస్తున్నాడు. అందులోభాగంగా మేమిద్దరం కలిసి ఆరునెలల పాటు హాస్పిటల్స్‌కి వెళ్లి డాక్టర్, పేషెంట్‌ల సమస్యలు, వాళ్ల అవసరాల గురించి లోతుగా విశ్లేషించాం. హైదరాబాద్‌లోని కామినేని హాస్పిటల్స్, ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీలతో పాటు మహబూబాబాద్, సంగారెడ్డి, వరంగల్ లోని హాస్పిటల్స్‌కి వెళ్లి పరిశోధించాం. ఈ జర్నీలో 600 సమస్యల వరకు గుర్తించాం. వీటన్నింటికీ ఇన్నోవేషన్ డివైస్‌లు కనుక్కోవాల్సిన అవసరం ఉంది. ఆ సమస్యలన్నింటిలో నుంచి మాకున్న పరిధిలో నియో నేటల్, మెటర్నరీ వ్యవస్థలను ఎన్నుకున్నాం. అదీ కాకుండా నాకు, మనోజ్‌కి మెటర్నల్ మానిటరింగ్ హెల్త్ విషయంలో పూర్వానుభవం ఉంది. అతను ఆటిస్టిక్ పిల్లల భావోద్వేగాలను ముందుగానే గుర్తించే పరికరాన్ని ఒకదాన్ని తయారుచేశాడు. నేను ఎన్‌ఐడిలో ఉండగా గ్రామాల్లో గర్భిణులకు నొప్పులు వచ్చినప్పుడు హాస్పిటల్‌కి తీసుకెళ్లడంలో ఉన్న ఇబ్బందులు గమనించాను. వాళ్లకి ఉపయోగపడేలా ప్రత్యేకంగా స్ట్రెచర్ తయారుచేశాను. ఇప్పుడు నియో నేటల్ కేర్ ఎంపికచేసుకోవడంలో ఆ అనుభవాలు మాకు తోడయ్యాయి.

> "**నా** గ్రాడ్యుయేషన్ తరువాత బెంగళూరులోని ఇన్ఫోసిస్‌లో కొన్నాళ్లు పనిచేశాను. ఆ తరువాత ఫెలోషిప్ ప్రోగాంలో చేరాను. నేను, ప్రత్యూష ఒకటే బ్యాచ్. ఈ పనిచేయడం ఎగ్జైటింగ్‌గా ఉంది. మార్కెట్‌లో పోటీదార్లను దృష్టిలో ఉంచుకుని వాటికంటే భిన్నంగా తయారు చేస్తున్నాం."
>
> \- **మనోజ్**

ఎలా పనిచేస్తుందంటే...

నియో బేబీకేర్ పరికరం తయారుచేయాలన్న ఆలోచన వచ్చినప్పటి నుంచీ దానికో రూపు తెచ్చేందుకు ఎనిమిది నెలల సమయం పట్టింది. మా ఫెలోషిప్ ప్రోగ్రాం జూలైలో పూర్తయ్యింది. అయినప్పటికీ ఐఐటి వాళ్లు టెక్నాలజీ పరంగా మాకు కావాల్సిన సాయం అందిస్తున్నారు. ఈ పరికరం పనితీరును పరిశీలించాం. ఫలితాలు తెలుసుకున్నాక పరికరాన్ని మెరుగుపరిచే పని నడుస్తోందిప్పుడు. ఈ పరికరంలో ఉండే చిప్ సైజ్‌ను ఇంకా తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం. అత్యవసర సేవలు అవసరమైన బేబీ పాదానికి ఈ పరికరాన్ని బ్యాండ్ ఎయిడ్‌లా అమర్చాలంతే... గుంపులు గుంపులుగా వైర్లు అమర్చక్కర్లేదు. నర్సింగ్ స్టేషన్‌లో ఉన్న నర్సులకి అక్కడున్న మానిటర్లలో బేబీ పరిస్థితి తెలిసిపోతుంది. పరిస్థితిలో ఏమాత్రం మార్పు కనిపించినా బేబీ పాదానికి ఉన్న డివైస్‌లో అలారమ్ మోగుతుంది. ఐసియుల్లో, వార్డుల్లో ఉండే పసివాళ్ల ఆరోగ్యావసరాలను తెలుసుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది.

> "నేను మెకానికల్ ఇంజనీర్. రెండు నెలల నుంచి నిమో బేబీకేర్ డివైస్ తయారీలో పనిచేస్తున్నా. ఇంతకు ముందు నేను మెషినరీ డిజైనింగ్‌కి సంబంధించిన వర్క్ చేశాను. ఇప్పుడు లైఫ్ సేవింగ్ డివైస్ తయారీలో భాగం కావడం ఆనందంగా ఉంది. ఆ డివైస్ ఎలా ఉండాలి? ఏ మెటీరియల్‌తో చేయాలి? ఏ మెటీరియల్‌తో చేస్తే బేబీ కాలి చర్మానికి ఏమీ కాకుండా ఉంటుంది? అనే విషయాల్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాను"
>
> \- శరత్

> "**ఇం**జనీరింగ్ చేశాక సాఫ్ట్‌వేర్ డిజైన్ రంగంలోకి వచ్చాను. ప్రొడక్ట్ డెవలప్ చేయాలంటే మొదట వినియోగదారుడిని అర్థం చేసుకోవాలి. ఆ పనిలో చాలా విషయాలు తెలుసుకుంటున్నాను."
>
> \- **కీర్తన**



అప్పుడు మార్కెట్‌లోకి తెస్తాం

మా కుటుంబంలో అందరూ డాక్టర్లు కావడం వల్ల ఈ ఫెలోషిప్‌లో ఎంతో చేయూత లభించింది. మా సందేహాలు వెంటవెంటనే తీర్చుకోగలిగాం. నేను, మనోజ్ ఇద్దరం మెడికల్ బ్యాక్‌గ్రౌండ్‌కి చెందిన వాళ్లం కాదు. ఇంజినీర్, మెడిసిన్ కలిపి పనిచేసేందుకు అవరోధాలు ఎరుదయ్యాయి. కాకపోతే పట్టుదలగా ముందుకెళ్లడం వల్ల అనుకున్నది సాధించగలుగుతున్నాం. ప్రారంభంలో చేయగలమా? లేదా? అని అనుమానం ఉండేది. అంతెందుకు నెలక్రితం కూడా దీన్ని అంగీకరిస్తారా? మాన్యుఫాక్చరింగ్ చేయగలుగుతామా? నిధులు లభిస్తాయా? అనే అనుమానాలు ఉండేవి. అలా అనిపించినప్పుడల్లా మా టీంలో ఒకరికొకరం ప్రోత్సాహం ఇచ్చుకుంటూ ముందుకు కదిలాం. పూర్తిగా తయారయ్యాక క్లినికల్ ట్రయల్స్ చేయాలి. అది చేశాక డేటా అంత ఒక దగ్గర చేర్చి డాక్యుమెంటేషన్ చేసి అనుమతులు తీసుకోవాలి. 2020 ప్రారంభం కల్లా హాస్పిటల్స్‌లో దీన్ని అందుబాటులో తేవాలనేది మా లక్ష్యం" అంటోంది ప్రత్యూషా రెడ్డి.

• **కిరణ్మయి**

ఫోటోలు: **అశోకుడు**

హ్యాట్సాఫ్

తస్నీమ్... నీకు సలామ్

పెళ్లి, రిసెప్షన్‌లప్పుడు పెళ్లికూతురు తప్పనిసరిగా మేకప్‌లో కనిపించాల్సిందే. మేకప్ లేకుండా రెడీ అవుతానంటే ఆనందించేవారు కన్నా.. వారించేవారే ఎక్కువగా ఉంటారు. ఇలాంటి స్టీరియో సంప్రదాయాలకు 'నో' చెప్పి పదిమందిలోనూ రెబల్‌గా నిలిచింది బంగ్లాదేశ్‌కు చెందిన తస్నిమ్ జరా. ఆమె హెల్త్‌కేర్ స్టార్టప్ 'అరోగో' ప్రెసిడెంట్ మాత్రమే కాదు యుఎన్ యూత్ అడ్వయిజరీ ప్యానల్‌కు ఒకప్పుడు ప్రెసిడెంట్‌గా కూడా ఉంది. ఆమె తన వివాహంలో, రెసెప్షన్‌లో ఎలాంటి నగలు, మేకప్ లేకుండా బామ్మ నేత చీర కట్టుకుని వచ్చి నయా ట్రెండుకు శ్రీకారం చుట్టింది. వివాహం, రిసెప్షన్లలో సింపుల్‌గా ఉండడానికి ఇంట్లో వాళ్లతో తస్నిమ్ ఒకింత పోరాటం చేయాల్సి వచ్చింది. ఇంట్లో వాళ్లల్లో కొందరు తస్నిమ్ విప్లవాత్మకమైన నిర్ణయాన్ని వ్యతిరేకించారట. అదే విషయాన్ని తస్నిమ్ ఫేస్‌బుక్‌లో చెప్పుకొచ్చింది. ఆమె పోస్టుకు 102కె స్పందనలు రాగా, 27 వేలు షేర్లు వచ్చాయి. 'రిసెప్షన్‌లో నగలు పెట్టుకుని, మేకప్ వేసుకుని పెళ్లికూతురులా తయారు కాకపోతే నాతో ఫోటో తీయించుకోమని మా కుటుంబంలోని కొందరు నన్ను బెదిరించారు' అని తస్నిమ్ తన పోస్టులో పేర్కొంది. 'మన సమాజంలో పెళ్లికూతురంటే టన్నుల కొద్దీ బంగారు నగలు ధరించి, మేకప్ బాగా వేసుకుని ఒక బొమ్మలా ఉండాలి. అమ్మాయిల పట్ల ఆ దృష్టి కోణం నన్ను ఇబ్బంది పెట్టింది. పెళ్లి కూతురు బంగారు నగలు బాగా వేసుకుంటే... అది ఆ కుటుంబ ఆర్థిక స్థోమతను తెలియజేస్తుందనుకోవడం తెలివితక్కువతనం. కొన్నిసార్లు పెళ్లికూతురి ఇష్టానికి వ్యతిరేకంగా కూడా నగలు పెట్టడం, మేకప్ వేయడం జరుగుతుంటుంది' అని తస్నిమ్ అంది. ఇలా నగలకు, మేకప్‌కు వేల కొద్దీ డబ్బు ఖర్చు పెట్టడం వృథా అని తస్నిమ్ అభిప్రాయం. అలా అని పెళ్ళప్పుడు నగలు వేసుకునే అమ్మాయిను తానేమీ వ్యతిరేకించడం లేదంటోందామె. పెళ్లి సమయంలో ఆడపిల్లల ఇష్టాయిష్టాలను పరిగణనలోకి తీసుకోవడమే తన ఉద్దేశమని చెబుతోంది. పెళ్లికి



భర్తతో తస్నిమ్

నేను ఏమి వేసుకోవాలో ఒక ఏజెన్సి నిర్ణయించడం హాస్యాస్పదం' అంటూ వ్యాఖ్యానించింది. తన పెళ్లికి తస్నిమ్ చీర కట్టుకుంది. మేకప్ వేసుకోలేదు. నగలు పెట్టుకోలేదు. దీని గురించి చెపుతూ 'అందరూ నన్ను సింపుల్ అని వ్యాఖ్యానించవచ్చు. కానీ నాకు మాత్రం అలా రావడం చాలా స్పెషల్. ఎందుకంటే నా నమ్మకాన్ని, అభిప్రాయాన్ని నేను అనుసరిస్తున్నాను' అని అంటుంది తస్నీమ్.

బ్యూటీ

మెరిసే చర్మం కోసం...



- కాలుష్యం కారణంగా చర్మంపై మృతకణాలు, టానింగ్ వంటి సమస్యలు తలెత్తుతాయి. వీటిని పోగొట్టుకునేందుకు క్రమం తప్పకుండా ఎక్స్‌ఫొలియేషన్ చేసుకోవాలి. మీ చర్మ స్వభావానికి సరిపడే స్క్రబ్‌ను అప్లై చేసుకోవాలి.
- ఫేస్ మాస్కు కూడా తరచూ వేసుకోవడం వల్ల చర్మం మరింత కాంతులీనుతుంది. చర్మం లోపలికి దుమ్ము, ధూళి పోకుండా మాస్కు అడ్డుకుంటుంది.
- చర్మ స్వభావానికి తగ్గట్టు నాణ్యమైన నైట్‌క్రీమును వాడాలి. క్రీమును చర్మానికి రాసుకునే ముందు అందులో ఎలాంటి హానికర కెమికల్స్ లేకుండా చూసుకోవాలి.

గుడ్ మార్నింగ్



గమ్యం స్థిరంగా ఉండాలి..
మార్గం కచ్చితంగా నిర్ణయించుకోవాలి..
ప్రయత్నంలో రాజీ ఉండకూడదు..
అప్పుడే విజయం మనదవుతుంది!

- రామకృష్ణ పరమహంస

తెలుసా!

పి... కాస్కో



చరిత్రకెక్కిన చిత్రకారుడు, చరిత్రను కాన్వాస్‌పై చెక్కిన కళాకారుడు పికాసో. ఆయన గీసిన బొమ్మలు కోకొల్లలు. అన్నీ అందమైనవే! అద్భుతమైనవే!! ఆలోచింపజేసేవే!! ఈ చిత్రకారుడి చేతిలో అయితే కుంచె అయినా ఉండేది. లేదంటే సిగరెట్ అయినా ఉండేది. అప్పుడప్పుడూ ఈ రెండూ కాకుండా మరో వస్తువు ఆయన చేతిలో ఉండేది. అదే పిస్తోల్. ఎప్పుడో గానీ ఈ పిస్తోలు తీసేవారు కాదట పికాసో. ఎవరైనా వచ్చి ఆయన గీసిన చిత్తరువుకు అర్థం ఏమిటని అడిగారా.. పికాసోకు కోపం నశాలానికి అంటేదట. 'ఈ బొమ్మలో మీరు చెప్పదల్చుకున్నది అంతగా ప్రకటితం కాలేదు..' అని వ్యాఖ్యానాలు చేస్తే అస్సలు ఊరుకునేవాడు కాదట. వెంటనే పిస్తోలు బయటకు తీసి.. 'చూస్కో.. కాస్కో..' అనే వాడట. కోపంతో ఊగిపోతూ బొమ్మ గురించి ప్రశ్నించిన వ్యక్తి గుండెకు రివాల్వర్‌ను గురిపెట్టి "ఇప్పుడు అడుగు.. నీకు ఏం అర్థం కాలేదు?" అని ట్రిగ్గర్ నొక్కినంత పని చేసేవాడట పికాసో. ఈ విషయం తెలియని వారు చాలామంది అలా పికాసో ఆగ్రహానికి గురయ్యేవారట. తెలిసిన వారు మాత్రం పికాసో బొమ్మల గురించి ఆయన దగ్గర బాగుందని పొగడమో, మౌనంగా ఉండటమో తప్ప మరే వ్యాఖ్యలు చేసేవారు కారట. అయితే, పికాసో పిస్తోల్‌తో బెదిరించేవాడే తప్ప.. దాని ట్రిగ్గర్ ఎప్పుడూ నొక్కకపోవడం విశేషం.

కొత్త పరిశోధన

కేక్ క్యాండిల్స్‌తో చిక్కు



పుట్టిన రోజు పండుగలో పిల్లలకు కావాల్సినవి కొత్త బట్టలు, చాక్లెట్లు, గిఫ్ట్‌లు! అన్నింటికీ మించి కేక్ తప్పనిసరి. దానిపై వయసుకు తగ్గట్టు క్యాండిల్స్ పెట్టి వెలిగించడమూ పరిపాటే! వాటిని కష్టపడి ఆర్పేయడం ఇప్పుడు సంప్రదాయమై కూర్చుంది. 'పుట్టిన రోజున దీపాలు వెలిగించాలే గానీ.. ఆర్పడం ఏమిటి?' అంటూ ఇంట్లో పెద్దలు చెబుతున్నా.. పట్టించుకోరు. ఎవరి సరదాలు వారివనుకోండి. ఇంత వరకు బాగానే ఉన్నా.. కేక్‌పై నిలబెట్టి.. వెలిగించే క్యాండిల్స్ విషయంలో ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని చెబుతున్నారు పరిశోధకులు. రంగు రంగులు ఉండే ఈ చిట్టి క్యాండిల్స్ వెలిగించడం వల్ల కేక్‌పై ఉండే బ్యాక్టీరియా ఏకంగా 1,400 శాతం పెరుగుతోందని వాళ్ల హెచ్చరిస్తున్నారు. తీపి, చల్లదనం కలిగి ఉన్న కేక్ పైభాగంలో క్యాండిల్ వెలిగించడమే ఈ పరిస్థితికి కారణమని వాళ్లు విశ్లేషిస్తున్నారు. క్యాండిల్ వేడి కారణంగా.. కేక్‌పై బ్యాక్టీరియా విస్తరిస్తుందట. క్యాండిల్స్‌లోని మైనం కరిగి కేక్‌పై పడటం వల్ల.. అది కలుషితం అవుతోందని చెబుతున్నారు. పరిశోధనా సారాన్ని గ్రహించి.. దీపాలు ఆర్పే సంస్కృతికి మంగళం పాడి.. ఇష్టదైవం ముందు దీపాలు వెలిగించే సంప్రదాయాన్ని అలవాటు చేసుకుందాం.

డైలీ సుడోకు - 153

		7			5			
	5			9	4		8	
4						2	7	
			3	2		5	6	
	8						9	
	6	9		7	1			
	7	5						2
	2		5	6			4	
			1			7		

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

నిన్నటి సుడోకు- 152 సమాధానం

[illegible]

కేంద్ర కారాగారంలో ఉత్పత్తి చేసే వాటిలో సాధారణంగా లాభం అనే మాట ఉండదు. ముడి సరుకు ధర, పనివారికి వేతనం లెక్కకట్టి, దానికి 15 శాతం ప్రిజన్ డెవలప్‌మెంట్ ఫండ్ ధర కలిపి నిర్ణయిస్తారు. దీనివల్ల బహిరంగ మార్కెట్ ధర కన్నా జైలు ఉత్పత్తుల రేటు తక్కువగా ఉంటుంది.

కంసుడి చెరసాలలో ఖైదీగా పుట్టాడు కన్నయ్య. మేనమామ గండాన పుట్టాడు. అష్టకష్టాలు పడుతున్న తల్లితండ్రులకు అష్టమ గర్భంలో ఉదయించాడు. ఆ చెరసాల దాటి వచ్చాక... ఏ చెరా ఆయన్ను పట్టి పీడించలేకపోయింది. దైవత్వంతో.. అంతకు మించిన మానవత్వంతో.. యుగపురుషుడిగా మారాడు. భక్తుల గుండెల్లో ఖైదీగా నిలిచిపోయాడు!

* * *

ఈ ఖైదీ కన్నయ్యలూ అంతే! చెరసాలలో భయం భయంగా మగ్గడం లేదు! మళ్లీ కొత్త జన్మ ఎత్తడానికి ప్రయత్నిస్తున్నారు. తమలో గూడుకట్టుకుని ఉన్న కంసుణ్ణి తుదముట్టిస్తున్నారు. గుండెలోతుల్లో ఉన్న మంచి తనాన్ని తట్టి లేపుతున్నారు. రకరకాల పనులు చేస్తున్నారు. బంధీలుగా ఉంటూనే.. పకడ్బంధీగా వ్యాపారాలు చేస్తున్నారు. జైలు నుంచి విడుదలయ్యే నాటికి 'మారిన మనిషి' అనిపించుకోవాలని తహతహలాడుతున్నారు. అదెలా అంటే.. రాజమండ్రి సెంట్రల్ జైలులోని ఈ ఖైదీ అన్నయ్యల కహానీ చదవండి.

మరో ప్రపంచం

ఖైదీ అన్నయ్యలు



రాజమండ్రి సెంట్రల్ జైలులో కుట్టు పనిలో ఖైదీలు

రాజమండ్రి సెంట్రల్ జైలు గురించి తెలియని వారుండరు. కరుడుగట్టిన నేరస్థులు ఉంటారిక్కడ! క్షణికావేశంలో నేరం చేసిన వాళ్లు కొందరు! కక్ష సాధించుకుని శిక్ష అనుభవిస్తున్న వాళ్లు ఇంకొందరు!! పథకం ప్రకారం పాపం మూటగట్టుకుని జైలుకు వచ్చినవాళ్లు మరికొందరు!! వెరసి ఇక్కడి ఖైదీల సంఖ్య జైలు సామర్థ్యం కంటే ఎక్కువే ఉంటుంది. మామూలుగా అయితే... ఇక్కడున్న వాళ్లంతా కటకటాలు లెక్కబెడుతూ ఉండాలి. శిక్షా కాలం పూర్తయ్యే సరికి కొరకరాని కొయ్యల్లా తయారవ్వాలి! కానీ, అధికారుల కృషి.. ఖైదీల్లోని మానవత్వాన్ని తట్టి లేపింది. ఖాకీల కారుణ్యం వీరిలోని నేర ప్రవృత్తి రూపుమాపేలా చేసింది. సరికొత్త సంస్కరణలు.. వారిని మరింత కొత్తగా తీర్చిదిద్దుతున్నాయి మారిన మనిషిగా నిలబెడుతున్నాయి.

శిక్షణాలయం

రాజమండ్రి జైలు ఇప్పటిది కాదు. డచ్ ఇండియా కంపెనీ వారి స్థావరంగా 1759లో నిర్మించిన కోట.. బ్రిటిష్ హయాంలో 1847 నాటికి జిల్లా జైలుగా మారింది. 1870కి వచ్చే సరికి సెంట్రల్ జైలుగా స్థిరపడింది. శతాబ్దాల చరిత్ర ఉన్న ఈ జైలులో.. ఇన్నాళ్లూ ఖైదీలు శిక్ష అనుభవిస్తే.. తాజాగా శిక్షణ పొందుతున్నారు. ఈ కేంద్ర కారాగారం ఇప్పుడొక కర్మాగారం. కొందరు ఖైదీలు బీరువాలు తయారు చేస్తారు. ఇంకొందరు దర్జీలుగా మారి దర్జాగా దుస్తులు కుడుతుంటారు. నోట్ పుస్తకాల తయారీదారులు కూడా ఉన్నారు. శిక్షా కాలం ముగిసేనాటికి సొంతంగా వ్యాపారం పెట్టుకునే స్థాయికి ఎదుగుతున్నారు.



బీరువాకు రంగులు వేస్తూ..

ఎవరి బిజీలో వారు

జైలులో స్టీల్ ఫర్నిచర్ తయారీ విభాగంలో 280 మంది ఖైదీలకు తలమునకలయ్యేంత పని ఉంటుంది. ఐరన్ షీట్‌ను కట్ చేయడం, దానిని బీరువా తయారీకి అనుకూలంగా మార్చుకోవడం, బీరువాలు చేయడం, రంగులు అద్దడం.. అన్నీ నిపుణుల కన్నా మిన్నగా చేసేస్తుంటారు వీళ్లు. ఆఫీస్ ఫర్నిచర్, టేబుళ్లు, డెస్కులు నాణ్యతలో రాజీ పడకుండా చేస్తారు. మగ్గం పనిలో 80 మంది బిజీగా ఉంటారు. టైలరింగ్ విభాగంలోనూ 80 మంది విడతల వారీగా వారి పనితనం చూపిస్తున్నారు. 56 కుట్టు మిషన్లు నిరంతరం పని చేస్తూనే ఉంటాయి. పిల్లో కవర్లు, ఇతర దుస్తులు తయారు చేయడం వీళ్లకు... కొట్టినపిండి. వీరంతా తమకు నచ్చిన పనిని ఎంచుకొని, అందులో తర్ఫీదు పొందారు. ఈ ఖైదీ కన్నయ్యలంతా కలిసి జైలు గోడల మధ్య ఉంటూనే.. ఏకంగా ఏడున్నరకోట్ల విలువ గల వస్తువులు ఉత్పత్తి చేశారు. అమ్మకాలు పూర్తయ్యేసరికి కోటి పదిహేను లక్షలకు పైగా ఆదాయం పొందారు. నాణ్యత లోపం కనిపించకపోవడంతో కారాగార కర్మాగారంలో తయారైన వస్తువులకు మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. ఐటీడీఏ, సాంఘిక సంక్షేమ, ప్రభుత్వ పాఠశాలల నుంచి ఆర్డర్లు ఎక్కువగా వస్తున్నాయి. రాజమండ్రి సెంట్రల్ జైలులో తయారైన వస్తువు లేని పాఠశాల ఉభయగోదావరి జిల్లాల్లో వెతికినా దొరకదు. అంతలా మార్కెట్‌ను ఆకర్షించారు ఈ భలే ఖైదీలు.

వజ్ర సంకల్పం

ఈ ఏడాది కొత్తగా నోట్‌బుక్స్ తయారీ పరిశ్రమ కూడా ఏర్పాటు చేశారు. ఈ విభాగంలో 30 మంది ఖైదీలు పని చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరానికి సాంఘిక సంక్షేమ శాఖకు 1.10 కోట్ల విలువ చేసే నోట్‌బుక్స్ సరఫరా చేశారు. మీ నోట్‌బుక్స్ బడా బడా కంపెనీల ప్రొడక్ట్స్‌కు తీసిపోని విధంగా ఉన్నాయని ప్రశంసలు బోనస్‌గా అందుకున్నారు. పైగా బయటివాటితో పోలిస్తే వీటి ధర కూడా రూ.4 తక్కువ! సకాలంలో డెలివరీ చేయాలనే సంకల్పంతో రోజూ 20 వేల నోట్‌బుక్స్ తయారు చేశారు వీళ్లు. పని పట్ల ఉన్న నిబద్ధత.. వారి మనసులను మార్చడానికి దోహదం చేస్తోందని అంటున్నారు జైలు అధికారులు. శిక్ష పూర్తయిన ఖైదీలు.. బయటకు వెళ్లాక, వారి కుటుంబంతో గౌరవంగా బతకడానికి అవసరమైన శిక్షణ జైలులో పొందుతున్నారు. విడుదలయ్యాక కూడా వారి బాగోగులు చూసుకుంటున్నారు అధికారులు. తాను తర్ఫీదు పొందిన పని చేసుకోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. అవసరమైతే బ్యాంకు నుంచి లోను వచ్చే విధంగా కృషి చేస్తున్నారు.

సాగుబడిలో..

కటకటాల మధ్య ఉన్న కర్కశమైన మనసులను సేద్యం చేసి.. వారిని సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేసే కర్షకులుగా తీర్చిదిద్దారు అధికారులు. వేసవిలో పచ్చడి మామిడికి 'సెంట్రల్ జైలు' ప్రసిద్ధి. ఉసిరి, కొబ్బరికాయల వంటి ఉత్పత్తులు సీజన్‌ను బట్టి ఇక్కడ లభిస్తాయి. సత్ప్రవర్తన కలిగిన 60 మంది ఓపెన్ ఎయిర్ జైలు ఖైదీలు సాగుబడి చూసుకుంటున్నారు. జైలులో డైరీ అవసరాలకు స్వయంగా పాడి పశువులను నిర్వహిస్తున్నారు.

కొత్త ఆశలు

జైలు శిక్ష అనుభవిస్తున్న వారిలో చాలామంది.. విధి వక్రీకరించో, క్షణికావేశంలోనో నేరాలు చేసినవారు. జైలుకు వచ్చిన నాటి నుంచి తప్పు చేశామని లోలోపల కుంగిపోతూ ఉంటారు. నాలుగు గోడల మధ్యే తమ జీవితం తెల్లారిపోతోందని అనుక్షణం ఆవేదన పడుతుంటారు. అధికారుల చొరవతో వీరి జీవితాల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. శిక్షాకాలం దక్షతను నేర్పుతోంది. కొత్త జీవితానికి బాటలు వేస్తోంది.

పి. రమేశ్ నాగేంద్ర, రాజమండ్రి
ఫొటోలు: **ఇలియాస్ ఉద్దీన్**

జైలు పరిశ్రమలో పనిచేస్తున్న ఖైదీలకు నెలకు రూ.1839 చెల్లిస్తున్నారు. ఇందులో 50 శాతం వారి పేరిట ఉన్న బ్యాంకు ఖాతాలో జమచేస్తారు. ఆ మొత్తాన్ని విడుదల సమయంలో ఇచ్చేస్తారు. మిగతా యాభై శాతం జైలులో ఉండే వారి ఖాతాలో వేస్తారు. దీనిని ఖైదీలు వారి వారి అవసరాలకు వాడుకుంటూ ఉంటారు.



నోట్‌బుక్స్ విక్రయిస్తూ..

ఇం'ధన యోగం'

కేంద్ర కారాగారం ఆధ్వర్యంలో ఐదేళ్లుగా పెట్రోల్ బంక్ కూడా నడుస్తోంది. ఇక్కడ పెట్రోల్, డీజిల్ అమ్మకాలు కూడా జోరుగానే సాగుతాయి. ఈ బంక్‌లో మూడు షిఫ్ట్‌లుగా 20 మంది ఖైదీలు పనిచేస్తున్నారు. మున్సిపల్, పోలీస్ వంటి ప్రభుత్వ శాఖలు ఈ బంక్ నుంచే ఇంధనం కొనుగోలు చేస్తున్నాయి. ప్రతి రోజూ రూ.16 లక్షలు రాబడి ఉంటోంది. 2012-13లో డీజిల్, 2014-15లో పెట్రోల్ అమ్మకాల వృద్ధికిగానూ ఈ పెట్రోల్ బంక్‌కు అవార్డులూ వచ్చాయి.

నయా హవా

మేకల కల్పతరువు.. ఇన్‌స్టాగ్రామ్!

అమెరికాలో ఇప్పుడు మేకలకు రోజులొచ్చాయి. అదేంటీ అనుకుంటున్నారా? సాధారణంగా కుక్కలు, పిల్లులను పెంచుకునే అమెరికన్లు ఇపుడు మేకలపై ఫోకస్ పెట్టారు. మే.. అనే అరుపు వింటే చాలు కొందరు సంబరపడిపోతున్నారు. ఇది నిజం. ఇప్పుడు అమెరికాలో మేక పిల్లల రేట్లు బాగా పెరిగాయి. ఇన్‌స్టాగ్రామ్ పుణ్యమా అని మేకలకు అమాంతంగా డిమాండ్ పెరిగింది. రెండు నెలల కితం 'గోట్ యోగా' అనే ట్రెండ్ వచ్చింది. అదే మనుషులు [illegible] పడుకుని.. వారి నెత్తిమీద, నడుము మీద [illegible]మేకను ఎక్కించుకుని తొక్కించుకోవటమే గోట్ [illegible]గా. ఇలా చేయటం వల్ల మానసిక [illegible]ంతత వస్తుందో లేదో తెలియదు [illegible]గోట్ యోగా చేస్తున్నామనే [illegible] ఇన్‌స్టాగ్రామ్‌లో విపరీతంగా [illegible]లభించింది. దీంతో అమెరికన్లు [illegible]నటానికి ఆసక్తి [illegible]. కొందరు గోట్‌యోగాతో [illegible] కుక్కల మాదిరే మేకలను [illegible] తమ ప్రిస్టేజ్‌ను [illegible]. కొందరు 'మేకప్ [illegible]క్యాస్ట్యూమ్స్ తయారు చేసి, [illegible]మురిసిపోతున్నారు. ఆ ఫొటోల్ని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తున్నారు. మీకో విషయం తెలుసా.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆడే గోల్ఫ్ కోర్టుల్లో కూడా మేకల శబ్దాలు వినిపిస్తున్నాయని వినికిడి. వారెవ్వా.. మొత్తానికి జీవాలకూ రోజులొచ్చాయనమాట!



స్నేహం కోసం

నివేదన

లీలలు, మాయలు చూపడమే కాదు.. నిస్వార్థమైన స్నేహాన్ని ప్రదర్శించడంలోనూ శ్రీకృష్ణుడు ఆరాధనీయుడు. శ్రీకృష్ణుడు-కుచేలుడు మైత్రి ఇందుకు నిదర్శనంగా నిలుస్తుంది. యుగాలు దాటినా వారి స్నేహం గురించి చెప్పుకుంటూనే ఉన్నాం. సుదాముడు, కృష్ణుడు ఇద్దరూ బాల్యస్నేహితులు. కలిసి చదువుకున్నారు. కాలగతిలో కృష్ణుడు ద్వారకాధీశుడు అయ్యాడు. సుదాముడు గంపెడు సంసారం మోయలేని ఓ పేదవాడిగా మిగిలిపోయాడు. జీవితం ఎంత భారంగా గడుస్తున్నా... తన స్నేహితుడిని సాయం కోరలేదు సుదాముడు. చివరికి భార్య మాట కాదనలేక ద్వారకకు వెళ్లాడు కుచేలుడు.



స్నేహితుడి రాకను చూసి కృష్ణుడు ఎంతగానో ఆనందించాడు. ఆప్యాయంగా పలకరించాడు. కుశల ప్రశ్నలు అడిగాడు. తన సతులతో కలిసి స్నేహితుడికి సత్కారం చేశాడు. పసందైన విందు ఇచ్చాడు. కృష్ణుడికి ఇష్టం అని చిన్ని మూటలో అటుకులు తెస్తాడు సుదాముడు. కానీ, మహారాజుకు అటుకులు ఇవ్వడం ఎందుకని ఊరుకుంటాడు. భవనంలో సుదాముడు విశ్రమిస్తున్న సమయంలో.. కృష్ణుడు ఆ అటుకుల మూట చూస్తాడు. మిత్రుడు తన కోసం ప్రేమగా తెచ్చిన అటుకులను ఎంతో ఇష్టంగా ఆరగిస్తాడు. పరంధాముడు రెండు పిడికిళ్ల అటుకులు తినే సరికి.. సుదాముడి పాపకర్మ తీరిపోతుంది. అతడి దారిద్ర్యం తొలగిపోతుంది. సుదాముడి ఇంట సిరి సంపదలు తాండవిస్తాయి.

స్నేహితుడి కోసం తన సర్వస్వాన్నీ త్యాగం చేయాలనుకుంటాడు కృష్ణుడు. మూడోసారి తినడానికి పిడికిలిలో అటుకులు తీసుకుంటాడు. ఇది గమనించిన రుక్మిణి.. కృష్ణుణ్ణి వారిస్తుంది. మిత్రుడి కష్టాలు తీరాయని విశ్వసించిన కృష్ణ పరమాత్మ మూడో పిడికిలి అటుకులు తినకుండానే వదిలేస్తాడు. తన స్నేహితుడి పాపకర్మ భస్మం చేసి.. నిష్కల్మషమైన స్నేహానికి నిలువుటద్దంలా నిలిచాడు ఆయన. మిత్రుడు నోరు తెరిచి అడగకపోయినా అతడి అవసరాన్ని గుర్తించాడు. అతడి దారిద్ర్యాన్ని పరిహరించాడు. ఈ దృష్టాంతం ద్వారా స్నేహితులు ఎలా ఉండాలో చాటాడు.

నవజీవనగీతం

నల్లనయ్య ఎలా అయ్యాడు?


నిజంగానే ఏమీ తెలియక, ఎవరైనా ఏమైనా అడిగితే ఏదో ఒకటి చెప్పేసి చెల్లుబాటు కావచ్చు. కానీ, అన్నీ తెలిసి తెలిసే కావాలని అడుగుతుంటే ఏమనుకోవాలి? మన లోతెంతో తెలుసుకోవడానికి అలా అడిగారనుకోవాలా? ఒకవేళ తెలిసినా హఠాత్తుగా ఇప్పుడది గుర్తుకు రాక అడిగారనుకోవాలా? అయినా, ఆ అడిగింది సర్వజ్ఞుడైన శ్రీకృష్ణుడే అయితే, ఎవరికైనా ఇంక మాటలెలా వస్తాయి! కాకపోతే ఆ అడిగింది తల్లి యశోదనే కాబట్టి, లోకానికి చక్రవర్తే అయినా, తల్లికి కొడుకే కాబట్టి, ఆమేదో సమాధానం చెబుతుంది. 1978లో విడుదలైన 'సత్యం-శివం-సుందరం' సినిమా కోసం విఠల్ భాయ్ పటేల్ రాసిన ఈ పాటలో ఈ తల్లీ కొడుకుల సంభాషణల స్వారస్యమే కనిపిస్తుంది. లక్ష్మీకాంత్- ప్యారేలాల్ స్వరరచనకు లతా మంగేష్కర్ గాత్రం నిజంగా ప్రాణమే పోసింది.

• • • • •

యశోమతీ మైయా సే బోలే నంద్‌లాలా
రాధా క్యోఁ గోరీ.... మై క్యోఁ కాలా?
(నందకిశోరుడే అడిగాడు యశోదమ్మని...
రాధ ఎందుకు ఎరుపు? నేనెందుకు నలుపని?)

తనకు తెలిసిందేదో తెలిసే ఉంటుంది. తనలో కదిలే ప్రశ్నలకు తనవైన సమాధానాలు ఉండే ఉంటాయి. అయినా ఆ ప్రశ్నలకు ఎదుటి వాళ్ల నుంచి ఏం సమాధానం వస్తుందో చూద్దామనే కదా ఆ ప్రశ్నలు వేయడం! అయితే ఏ ప్రశ్నకైనా అందరి నుంచీ ఒకే సమాధానం రాదు. ఎందుకంటే ఎవరి అనుభవాలు వారివి! ఎవరి జీవితం వారిది! మొత్తంగా చూస్తే ఒక్కొక్కరికీ ఇక్కడ ఒక్కో వేరు వేరు ప్రపంచం ఉంటుంది. అందరి రక్తం ఒకటే కదా అన్నట్లు, స్థూలంగా అందరి జీవితాలూ ఒకేలా అనిపించవచ్చు. కానీ, అత్యంత సూక్ష్మమైన లోలోతుల్లోకి వెళితే హృదయానికీ, హృదయానికీ మధ్య, జీవితానికీ జీవితానికీ మధ్య అనంతమైన వ్యత్యాసం కనిపిస్తుంది. దీనికి తోడు, అసలు సమాధానం ఒకటైతే, దాన్ని వక్రీకరించడం మరొకటి. అందుకే ఒకే ప్రశ్నకు వేరు వేరు వ్యక్తులను అడగడం ద్వారా ఒక ప్రశ్నకు చెందిన వేయి సమాధానాలు దొరుకుతాయి. ఒకే సత్యానికి చెందిన వేయి ముఖాలు తెలుస్తాయి.

❖ ❖ ❖



బోలీ ముస్కాతీ మైయా లలన్ కో బతాయా
కారీ అంధియారీ ఆధీ రాత్ మే తూ ఆయా
లాడ్‌లా కన్హయ్యా మేరా కాలీ కమ్‌లీ వాలా
ఇసీ లియే కాలా / యశోమతీ మైయా/
(ముసిముసిగా నవ్వుతూ అమ్మ ముద్దుల కొడుకుతో అంది...
నడిరాత్రి కారు చీకట్లో కదా! నువ్వు జన్మించింది.
అందుకే ఓరి కన్నా! నువ్వు నల్ల కలువవయ్యావు
నువ్వు అందుకే నలుపు..)

నేనెందుకు నలుపని కన్నబిడ్డే నిలదీసి అడుగుతుంటే కన్నతల్లిగా సమాధానం చెప్పాలి కదా! నిజమే కానీ, ఏ పరిణామానికైనా లోకంలో ఒకే ఒక్క కారణం ఉండదు కదా! ప్రతి పరిణామం వెనుక పైకి కనిపించేవీ, కనిపించనివీ అనేకానేకమైన కారణాలు ఉంటాయి. అలా అని అన్ని కారణాల్నీ ఒకేసారి చెప్పడం కూడా అన్నిసార్లూ కుదరదు. అందుకే ఒక కారణంగా యశోద "నాన్నా! అర్ధరాత్రి వేళ అదీ కటిక చీకట్లో నువ్వు పుట్టావు. ఆ చీకటి ప్రభావంతోనే నువ్వు నల్ల కమలానివయ్యావు.. నీ నలుపు అలా వచ్చిందే కన్నా" అనేసింది. ఆ సమాధానంతో సంతుష్టుడు కాని కృష్ణుడు అది కాదు సమాధానం అంటూ మారాం చేశాడు. "నా నలుపు సంగతేంటో తేల్చ"మని తిరిగి ప్రశ్నించాడు.

❖ ❖ ❖

బోలీ ముస్కాతీ మైయా సున్ మేరే ప్యారే
గోరీ గోరీ రాధికా కే నైన్ కజ్‌రారే
కాలే నైనో వాలీ నే ఐసా జాదూ డాలా
ఇసీ లియే కాలా / యశోమతీ మైయా/
(ఆ తల్లి మందహాసం చేస్తూ, ఓ ముద్దుతండ్రీ!
ఎర్రనైన రాధికవి నల్లనల్లని కాటుక కళ్లు!
ఆ నల్లకళ్ల అమ్మాయే ఆ మంత్రమేదో వేసింది.
నువ్వు అందుకే నలుపు)

మరో సమాధానంగా యశోద "రాధ తన కాటుక కళ్లతో నిన్ను అదే పనిగా చూడటమే నువ్వు నలుపు అయిపోవడానికి అసలు కారణం" అనేసింది. చూసినంత మాత్రాన్నే మనుషులు నలుపెక్కుతారా? అంటే ఏమోమరి! ఆమె ఎన్నిసార్లు, ఎంత తీక్షణంగా చూసిందో ఎవరికి తెలుసు? అందులో ఏదో నిజమంటూ లేకపోతే, కన్నకొడుకుతోనే అలా ఎందుకంటుంది! అనుకుంటూ మనమేదో మన మనసుకు సరి చెప్పుకోవచ్చు. [illegible]

• బమ్మెర

సింగర్స్ స్పెషల్

వంద సినిమాల్లో 250కి పైగా పాటలు, మన దేశంతో పాటు పది దేశాల్లో 400కు పైగా షోలు.. ఇదీ ప్లేబ్యాక్ సింగర్‌గా దిన్‌కర్ ప్రయాణం. కానీ అయనలో ఏదో వెలితి. ఇంకా ఏదో సాధించాలనే తపన! తెలుగు గాయనీగాయకులకు సరైన గుర్తింపు దక్కడం లేదంటూనే 'హైదరాబాద్ సే ఏక్ సింగర్ ఆకే గాయారే' అని ఇతర భాషల వాళ్లు చెప్పుకోవాలని ఆశిస్తున్న **దిన్‌కర్** తన సంగీత ప్రయాణం గురించి చెప్పిన విషయాలు...



అది తెలుగువాళ్ల గొప్పతనం

- కల్వల దిన్‌కర్

నేను పుట్టింది వరంగల్‌లో! నాన్న డా.గోపాలకిషన్‌రావు, కాకతీయ యూనివర్శిటీలో ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. అమ్మ పద్మ గృహిణి. ఎనిమిదో తరగతి వరకూ అక్కడే చదువుకున్నా. మా ఇంట్లో ఎవరికీ సంగీతం, సినిమా నేపథ్యం లేదు. చదువుతోపాటు ఇంకేదన్నా కళ ఉంటే బావుంటుందని సంగీతం నేర్చుకున్నా. స్వరసుధా అకాడమీ రమాదేవిగారి దగ్గర కర్ణాటిక్, గుమ్మడి జనార్థన్, కూర్మనాథ్ గారి దగ్గర హిందుస్థానీ నేర్చుకున్నా. తర్వాత వరంగల్‌లో బీఫార్మసీ, లండన్‌లో ఎం.ఫార్మసీ పూర్తి చేశా. అక్కడే రెండేళ్లు జాబ్ చేసి, 2011లో ఇండియా వచ్చి చెన్నైలో జాబ్ కంటిన్యూ చేశా. వీకెండ్స్‌లో హైదరాబాద్ వస్తుండేవాడిని. దర్శక నిర్మాత మధుర శ్రీధర్‌గారి బ్రదర్ ఒకాయన మా నాన్నగారికి స్నేహితుడు. ఆయన వల్ల నేను పాడతాననే విషయం శ్రీధర్‌గారికి తెలిసి టాలెంట్ హంట్‌కు పిలిచారు. ఆయన దర్శకత్వం వహించిన 'ఇట్స్ మై లవ్ స్టోరీ' సినిమాలో 'నిన్నలా లేదే' అనే పాటకు అవకాశం ఇచ్చారు. సునీల్ కశ్యప్ ఆ చిత్రానికి సంగీత దర్శకుడు.

ఆ రోజును మర్చిపోలేను...

జీరో నాలెడ్జ్‌తో రికార్డింగ్ స్టూడియోలోకి వెళ్లా. అక్కడికి వెళ్లేసరికి కారుణ్య, ప్రణవి ఓ పాట పాడుతున్నారు. కాస్త టెన్షన్ అనిపించింది. అక్కడ నాకు తెలియని విషయాలను సౌండ్ ఇంజనీర్ వివరంగా చెప్పారు. గంటన్నరలో రికార్డింగ్ పూర్తయింది. ప్రతిభ, అదృష్టం ఎంత ఉన్నా సపోర్ట్ చేసే వ్యక్తి లేకపోతే ఇండస్ట్రీలో నిలబడటం కష్టం. నాకు ఆ స్టార్టప్ శ్రీధర్‌రెడ్డి ఇచ్చారు. 'నిన్ను సింగర్‌గా పరిచయం చేస్తా.. ఆ తర్వాత నీ టాలెంట్‌తోనే ముందుకెళ్లాలి' అన్నారు. ఆ ప్రోత్సాహమే నన్ను ఇక్కడి వరకూ తీసుకొచ్చింది.

ఆ షో లైఫ్ ఇచ్చింది..

కౌసల్యగారి వల్ల నేను 'సూపర్‌సింగర్-7' షోలో అడుగుపెట్టా. అదే నా మొదటి టీవీ షో. అందులో 'ఐ' సినిమాలో 'నువ్వుంటే నా జతగా' పాట పాడాను. ఆ పాటలో విక్రమ్ ఎలా మేకప్ చేసుకున్నారో నేనూ అలాగే చేసుకుని పాడా. దాని వల్ల నా ఫేస్ చాలా పాడైపోయింది. ఐబ్రోస్ ఊడిపోయాయి. ఆ పాటకు వచ్చిన రెస్పాన్స్ చూశాక ఆ కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కిందనిపించింది. ఇప్పుడు నేను ఏ షోకి వెళ్లినా అదే పాట పాడమంటారు. సినిమాల్లో ఎన్ని పాటలు పాడినా ఆ సింగర్ ఎవరో కూడా జనాలకు తెలీదు. టీవీ షోల వల్లే మేం ఎవరో వీక్షకులకు తెలుస్తోంది. సినిమాకు సంబంధించిన ప్రతి కార్యక్రమాల్లో మ్యూజిక్ డైరెక్టర్, సింగర్ల గురించి అస్సలు పట్టించుకోరు. ఆ పద్ధతి మారాలని కోరుకుంటున్నా.

అదే నా ఐడెంటిటీ...

'నిన్నలా లేదే' పాట లేకపోతే నేను లేను. అదే నా ఐడెంటిటీ. ఆ పాట విన్న ఆరు నెలలకు మణిశర్మగారి నుంచి ఫోన్ వచ్చింది. అప్పటి నుంచీ ఇప్పటివరకూ ఆయన పనిచేసిన ప్రతి సినిమాలో ఒక పాట పాడాను. 'బాహుబలి' సినిమాలో పాట పాడే అవకాశం రాకపోయినా కోరస్, బ్యాగ్రౌండ్ స్కోర్ రూపంలో అందులో భాగమైనందుకు, టైటిల్ కార్డ్‌లో నా పేరు పడినందుకు చాలా ఆనందపడ్డా. మణిశర్మ, కీరవాణిగార్లతోపాటు గోపీసుందర్, సంతోష్ నారాయణ్, శేఖర్‌చంద్ర వంటి సంగీత దర్శకులకు కూడా పాడాను. కెరీర్ ప్రారంభంలో వంద పాటలు ఫ్రీగా పాడా.

గుర్తింపు తెచ్చిన పాటలు:

కండిషన్స్ అప్లై (దూసుకెళ్తా)
అన్వేషణ (ఫ్యాషన్ డిజైనర్)
ఏ క్షణం (సినిమా చూపిస్త మావ)
నిన్నలా లేదే (ఇట్స్ మై లవ్ స్టోరీ)
నీ ఆహహ (హోరాహోరీ)
చల్లని మేఘం (ఏజెంట్ భైరవ)
వెయిటింగ్ (నాన్న.. నేను.. నా బాయ్‌ఫ్రెండ్స్)

కొన్ని మిస్ అయ్యా...

'లయన్'లో విజయప్రకాశ్ పాడిన 'ఆకాశం' పాట నేనే పాడాను. 'నేను అనుకున్న ఫీల్, ఎక్స్‌ప్రెషన్ రాకపోతే ఇంకొకరితో పాడిస్తా' అని మణిగారు ముందే చెప్పారు. ఆయనకు నచ్చినట్లు రాకపోవడంతో అది తొలగించాల్సి వచ్చింది. 'ఉయ్యాల జంపాల' సినిమాలో టైటిల్ పాట పాడాను. అది అందరికీ నచ్చడంతో ఆల్బమ్‌లో ఉంటుందనుకున్నా. కానీ తీసేశారు. అమెరికాలో ఉండటం వల్ల 'లై' సినిమాలో ఓ పాట మిస్ అయ్యా. దానిని నా ఫ్రెండ్ సాయిచరణ్ పాడాడు. నేను బాగా పాడి, మ్యూజిక్ డైరెక్టర్‌కి నచ్చీ, ఇంకేదో కారణంతో పాటను తొలగిస్తే చాలా బాధగా అనిపిస్తుంది.

రక్తం మరిగిపోతుంది...

బయటి సింగర్‌లను తీసుకొచ్చి పాడించి ఆదరిస్తున్నాం. అది తెలుగువాళ్ల గొప్పతనం. వాళ్లు మాత్రం మన సింగర్‌లను కొద్దిగా కూడా ఎంకరేజ్ చెయ్యరు. మనోళ్లు బ్రాండ్ కోరుకుంటున్నారు తప్ప ఇక్కడ ఆణిముత్యాల్లాంటి సింగర్లు ఉన్నారని గుర్తించడం లేదు. పదిమంది అక్కడి వాళ్లను, పదిమంది మనవాళ్లనూ ఒకే వేదిక మీద పాడిస్తే మేమేం తక్కువ కాదు అని నిరూపించుకునే సత్తా ఇప్పుడున్న ప్రతీ సింగర్‌కి ఉంది. 'ఏమ్మా! దేవిశ్రీ దగ్గర పాడావా? ఇంకెవరి దగ్గర పాడావ్' అని కొందరు అడుగుతుంటారు. మాకు అవకాశం ఇస్తే కదా పాడటానికి! సినిమాలో ఆరు పాటలుంటే నాలుగు పాటలు తెలుగు సింగర్లకు ఇస్తే మాలాంటి వాళ్లకు అన్నం పెట్టి ఆకలి తీర్చినట్లు అవుతుంది కదా! తెలుగు అన్న ఫీలింగ్ వస్తే రెచ్చిపోతా. మనవాళ్లకు జరుగుతున్న అన్యాయం చూస్తుంటే రక్తం మరిగిపోతుంది. 'హైదరాబాద్ సే ఏక్ సింగర్ ఆకే గాయారే' అన్న బ్రాండ్ రావాలన్నది నా కోరిక.

చిన్ని చిన్ని ఆశలు...

మనకున్నది చిన్న జీవితం. కడుపు నింపుకోవడం కోసం ఎంతో కష్టపడుతున్నాం. చిన్న ఆశల్ని నెరవేర్చుకుంటూ ఆనందించాలి. ఐదేళ్ల తర్వాత నేనేంటీ అంటే.. పూర్తిగా కుటుంబం కోసం సమయం కేటాయిస్తానని చెబుతా. ప్రైవేట్ బిజినెస్ స్టార్ట్ చేస్తా. నా భార్య ఝాన్సీ డాక్టర్ కాబట్టి తనకోసం ఓ క్లినిక్ పెడతా. సింగింగ్‌లో ఇంతే బిజీగా ఉంటే పార్ట్ టైమ్‌గా పాటలు పాడతా. సిన్సియారిటీ, హానెస్టీ, డిసిప్లిన్ నా సిద్ధాంతాలు. ఈ మూడింటిని కరెక్ట్‌గా ఫాలో అయితే జీవితం సాఫీగా ఉంటుందని నమ్ముతా.

అదృష్టం తోడవ్వాలి...

ప్రతిభ, కష్టంతోపాటు ఏ కళాకారుడికైనా అదృష్టం కూడా కలిసి రావాలి. ఐదేళ్లల్లో 250కుపైగా పాటలు పాడాను. షోల వల్ల ఎంత పేరొచ్చినా సినిమాల పరంగా నాకు సరైన బ్రేక్ రాలేదనుకుంటున్నా. ఏ రోజూ ఖాళీగా లేను కానీ కమర్షియల్ హిట్ సాంగ్స్ వచ్చుంటే బావుండుననిపిస్తుంది. అలా బాధ కలిగిన సందర్భాల్లో నా కుటుంబ సభ్యులు, నా స్నేహితులు ధైర్యం చెప్తారు. తక్కువ సమయంలో 100 సినిమాల్లో 250 పాటలు పాడావ్, పది దేశాలు తిరిగావ్, 400 షోలు చేశావ్, ఇంతకన్నా సాధించేది ఏముంటుంది? ఇది సక్సెస్ కాదు అనుకుంటే నీ జాబ్ నీకుంది! డోన్ట్ వర్రీ' అని నాన్న చెబుతుంటారు.

ఆ తర్వాత ఏమైనా ఫర్వాలేదు..

రెహమాన్‌గారికి పాడాలనేది నా చిరకాల కోరిక. ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నా. రికమండేషన్‌తో వెళ్లడం ఇష్టం లేదు. ఈ రోజు నేనిలా ఉంటాననీ నేనెప్పుడూ అనుకోలేదు. ఆయనకు పాడే రోజు వస్తుందనీ, భగవంతుడు ఇస్తాడనీ నా నమ్మకం. ఆ రోజున పూర్తిస్థాయిలో తృప్తి పడతా. అది జరిగాక నా కెరీర్ స్మాష్ అయినా డోన్ట్ కేర్. ఆ అవకాశం దక్కకపోయినా ఫర్వాలేదు. అనుకున్నది జరగలేదని డిప్రెషన్‌లోకి వెళ్లడంలాంటి వాటికి నేను దూరం.

• **ఆలపాటి మధు**
ఫొటోలు : **గోపీకృష్ణ**

ఇలా చేద్దాం..

వారి వెన్నంటే ఉండాలి....

చిన్న పిల్లలు చదువుల ఒత్తిడితో, రకరకాల కుటుంబ సమస్యలతో, ఇతర కారణాలతో తొందరగా డిప్రెషన్‌కు గురవుతుంటారు. అలాగే యువత, పెద్దవాళ్లు కూడా వివిధ సమస్యలతో డిప్రెషన్‌లోకి వెళ్లిపోతుంటారు. ఇలా డిప్రెషన్‌లోకి వెళ్లిన వారిని సరైన సమయంలో ఆదుకుంటే వాళ్లు తిరిగి సాధారణ స్థితికి రాగలరు. అందుకు మనం చేయాల్సినవి కొన్ని ఉన్నాయి.




- డిప్రెషన్‌లో ఉండేవారి పట్ల అనుక్షణం ప్రేమ చూపాలి.
- ఎమోషనల్ సపోర్టు అందివ్వడంతోపాటు వారిని అర్థం చేసుకోవాలి.
- వారితో ఓర్పుగా ప్రవర్తిస్తూ ప్రోత్సహిస్తుండాలి.
- వాళ్ల చేత ఎక్కువగా మాట్లాడించాలి.
- వాళ్లు ఏవైనా చెపుతుంటే శ్రద్ధగా వినాలి.
- ఒత్తిడిలో ఉన్నవారి భావోద్వేగాల పట్ల, బాధ పట్ల నిర్లక్ష్యంగా ఉండొద్దు.
- ఆత్మహత్య గురించి వీళ్లు మాట్లాడితే తేలిగ్గా తీసుకోవద్దు.
- మీ ఫ్యామిలీ థెరపిస్టుకు విషయం వెంటనే తెలియజేయాలి.
- ఒత్తిడిలో ఉన్న వారిని ఒంటరిగా వదలకుండా వాకింగ్‌కు, ఔటింగ్స్‌కు, రకరకాల కార్యక్రమాలకు తీసుకెళ్లాలి. వారికి ఇష్టం లేకపోతే మాత్రం బలవంతం చేయొద్దు.
- థెరపిస్టు దగ్గరకు వెళ్లేప్పుడు వారి వెంట కుటుంబసభ్యులు ఒకరు తోడుండాలి.
- కొంతసమయం పట్టినా కౌన్సెలింగ్‌తో డిప్రెషన్ పోతుందని బాధితులకు చెప్పాలి
- డిప్రెషన్ బాధితులతో పరుషంగా వ్యవహరించకూడదు.
- డిప్రెషన్ బాధితులు ఎప్పుడూ నవ్వుతుండాలి.
- వారిలోని బలాలను, ప్రత్యేకతలను వారికి తెలియజెప్పాలి.
- ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు మరీ ఎక్కువైతే ఆసుపత్రిలో చేర్పించాలి.









నా లైఫ్‌లో మజ్ను లేదు



'నేనే రాజు నేనే మంత్రి' సక్సెస్ మీట్‌లో పరుచూరి గోపాలకృష్ణ, రానా, తేజ

ఏ కథనైనా చేయగల హీరో రానా

- తేజ

"ప్రతి వ్యక్తిలోనూ మంచీ చెడులున్నట్లే రెండు ఇమేజ్‌లు ఉన్న నటుడు రానా. ఏ స్క్రిప్ట్‌నైనా చేయగల హీరో ఆయన. ఇలాంటి హీరోలు ఇంకా కొంతమంది ఉంటే తెలుగు సినిమా బెటర్ అవుతుంది" అన్నారు తేజ. రానా, కాజల్ జంటగా ఆయన దర్శకత్వం వహించిన 'నేనే రాజు నేనే మంత్రి' చిత్రం ఇటీవల విడుదలై విజయ పథంలో నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఏర్పాటుచేసిన సక్సెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ "స్వతహాగా నేను ఎగ్రెసివ్ కాబట్టి నా హీరోను కూడా ఎగ్రెసివ్‌గా చూపిస్తుంటాను. పదేళ్లు డిజాస్టర్స్ చేసిన నేను హిట్ మూవీస్ చేయగలనని ఈ సినిమాతో తెలిసింది. ఇకపై హిట్ సినిమాలు తీయడానికి నా వంతు ప్రయత్నం చేస్తాను" అని చెప్పారు. కలెక్షన్లు చూసి 'ఏంటీ ఇంత బాగా వస్తున్నాయి' అని ఆశ్చర్యపోయానని రానా అన్నారు. "భార్యాభర్తల మధ్య ప్రేమకథను ఇలా చేయడం కొత్త. కాజల్‌కు ఇది 50వ చిత్రం. ఈ ఏడాది 'బాహుబలి 2', 'ఘాజీ', 'నేనే రాజు నేనే మంత్రి'తో హ్యాట్రిక్ సాధించడం ఆనందంగా ఉంది" అని ఆయన తెలిపారు. పరుచూరి సోదరులు మాట్లాడుతూ "ఏ కోణంలో చూసినా రానాలో మంచి నటుడు కనిపిస్తున్నాడు. తేజ, రానా.. ఇద్దరూ సకల కళావల్లభులే. తొలి వారంలో ఈ సినిమా ఇరవై కోట్లు దాటేస్తుంది" అని ఆకాంక్షించారు.

నా లైఫ్‌లో మజ్ను లేదు

"రొమాంటిక్ డేట్ గురించి నేనెప్పుడూ ఆలోచించలేదు. అసలు నా జీవితంలో మజ్ను లేదు" అని అంటున్నారు పూజా హెగ్డే. నాగచైతన్య సరసన చేసిన 'ఒక లైలా కోసం' చిత్రంతో తెలుగునాట అడుగుపెట్టారు పూజా. ఆ తర్వాత బాలీవుడ్‌కు వెళ్లి వచ్చి, ఇటీవల అల్లు అర్జున్ సరసన 'దువ్వాడ జగన్నాథమ్'లో నటించారు. పూజా మాట్లాడుతూ "నేను స్కూల్లో సైలెంట్‌గా ఉండేదాన్ని. నన్ను ఒకబ్బాయి చాలా ఇష్టపడేవాడు. మూగారాధన చేసేవాడన్నమాట. ఒక రోజు తనకున్న భయాన్నంతా పక్కనపెట్టి ఒక గులాబి పువ్వుతో నాకు ప్రపోజ్ చేయడానికి వచ్చాడు. కానీ నా చుట్టూ ఉన్న అమ్మాయిలందరూ అతని తీరు చూసి, ఉన్నపళంగా నవ్వేశారు. దాంతో అతనికి ఏం చేయాలో పాలుపోలేదు.. ఇలాంటి ఎక్స్‌పీరియన్స్‌లు చాలా మందికి ఉండే ఉంటాయి. వాటిని పట్టించుకునేంత తీరిక నాకు అప్పుడూ లేదు, ఇప్పుడూ లేదు. అప్పుడు చదువుతో, ఇప్పుడు కెరీర్‌తో బిజీ. అందుకే నా లైఫ్‌లో మజ్ను లేదు అని చెబుతున్నాను" అని వివరించారు.



పూజా హెగ్డే

పెళ్లి.. షష్టి పూర్తి!

"పెళ్లి నిరాడంబరంగా, షష్టి పూర్తి ఘనంగా జరగాలనే కాన్సెప్ట్‌తో తెరకెక్కిన చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. అంజిరెడ్డి ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందింది. ఎస్.కె.విశ్వేశ్‌బాబు సమర్పించారు. అంజిరెడ్డి నిర్మాత. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను ఆదివారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. దర్శకుడు హర్షవర్ధన్ మాట్లాడుతూ "పామరులకు కూడా గుడ్, బ్యాడ్ అనే పదాలు తేలిగ్గా అర్థమవుతున్నాయి. అందుకే ఈ టైటిల్ పెట్టాను. 1988-89 మధ్య కాలంలో జరిగే కథతో తెరకెక్కించాను. ఓ మారుమూల గ్రామంలో నడిచే ప్రేమకథ ఇది. సంగీతం కూడా నేనే చేశాను" అని చెప్పారు. సినిమా బాగా వచ్చిందని, త్వరలోనే విడుదల చేస్తామని నిర్మాతలు తెలిపారు. మంచి పాత్రలో నటించినట్లు మురళి, శ్రీముఖి, కిశోర్ తెలిపారు.



మురళి, శ్రీముఖి

బయోపిక్స్

'లిటిల్ డ్రాగన్'కు మ్యాస్ట్రో మ్యూజిక్



మార్షల్ ఆర్ట్స్ లెజెండ్ బ్రూస్ లీ జీవితం ఆధారంగా రూపొందనున్న చిత్రానికి మ్యూజిక్ మ్యాస్ట్రో ఎ.ఆర్. రెహమాన్ సంగీతం అందించనున్నారు. శేఖర్ కపూర్ డైరెక్ట్ చేసే ఈ చిత్రానికి 'లిటిల్ డ్రాగన్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ బ్రూస్ లీ బయోపిక్‌కు రెహమాన్ స్వరాలు కూర్చనుండటం తనను ఉద్వేగానికి గురిచేస్తోందని శేఖర్ చెప్పారు. ప్రఖ్యాత మార్షల్ ఆర్ట్స్ స్టార్‌గానే కాకుండా ఒక తాత్త్వికునిగా బ్రూస్ లీ ఎదగడం వెనుక రాజకీయ, ఆర్థిక శక్తులు ఎలా పనిచేశాయో ఈ చిత్రం ద్వారా ఆయన చూపించనున్నారు. ప్రస్తుతం తారాగణం ఎంపిక జరుగుతోంది.

హృతిక్ గణిత శాస్త్రవేత్త!



బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్ తొలిసారి ఒక బయోపిక్‌లో నటించేందుకు సిద్ధమవుతున్నాడు. పేరుపొందిన గణిత శాస్త్రవేత్త ఆనంద్ కుమార్ జీవితం ఆధారంగా రూపొందే 'సూపర్ 30' చిత్రంలో ఆయన ప్రధాన పాత్రను పోషించనున్నాడు. 'క్వీన్', 'షాన్‌దార్' చిత్రాల దర్శకుడు వికాస్ బెహల్ దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. హృతిక్ ఆహ్వానం మేరకు ఆనంద్ శనివారం ఆయనింటికి వెళ్లి కొన్ని గంటలసేపు గడిపారు. ఆనంద్ పాత్రను పోషించడం కోసం ఆయన బాడీ లాంగ్వేజ్, ఆయన మాట్లాడే తీరును హృతిక్ అధ్యయనం చేస్తున్నాడని దర్శకుడు వికాస్ తెలిపాడు.





డిసెంబర్‌కల్లా మిడ్‌మానేరు పూర్తి

- అధికారులకు మంత్రి హరీష్‌రావు ఆదేశం
- ప్యాకేజీల పనులు వేగవంతం చేయాలని సూచన

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఎల్లంపల్లి, మిడ్‌మానేరు ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి డిసెంబరు చివరి నాటికి పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అధికారులను ఆదేశించారు. 2018 సంవత్సరం మిడ్ మానేరు ప్రాజెక్టు నీరు ఎల్లంపల్లికి చేరాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనుల పురోగతిపై ఆదివారం జల సౌధలో మంత్రి సమీక్ష నిర్వహించారు. 6, 7, 8 ప్యాకేజీలను ప్రతివారం రెండు రోజుల పాటు సైట్(పనుల క్షేత్రం)లోనే ఉండి సమీక్షించాలని లిఫ్టుల సలహాదారు పెంటారెడ్డిని ఆదేశించారు. నవంబరు చివరినాటికి ఎలక్ట్రికల్, మెకానికల్ పనులు, డిసెంబరు నాటికి 6, 7, 8 ప్యాకేజీల పనులు పూర్తి చేయాలన్నారు. నవంబరు కల్లా పంప్‌హౌస్‌లు, టన్నెల్ పనులు, ఇతర నిర్మాణాలు పూర్తిచేసి డిసెంబరులో డ్రై రన్ నిర్వహించాలన్నారు. ప్రాజెక్టు పనులన్నీ నిర్ణీత వ్యవధిలోనే పూర్తి చేయాలని ఆదేశించారు. మేడారం రిజర్వాయర్‌కు సంబందించి రైతులకు పరిహారం వెంటనే అందించాలని ఆదేశించారు. క్రాప్ హాలిడేకు సంబంధించిన ఫైలును వెంటనే క్లియర్ చేయాలని నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్‌ను ఆదేశించారు. సమీక్షలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్కే.జోషితో పాటు అధికారులు మురళీధర్‌రావు, వెంకటేశ్వర్లు, మనోహర్, శ్రీధర్ పాల్గొన్నారు.

మణికొండ పంచవటి కాలనీలో రామాలయం ప్రారంభోత్సవం సందర్భంగా అక్కడి స్థానికులు రోడ్లు, వీధి దీపాలు వంటి మౌలిక వసతులు సమకూర్చాలని మంత్రి హరీశ్‌రావును కోరారు. వెంటనే స్పందించిన మంత్రి ఫోన్‌లో అధికారులను సంప్రదించి ఒక్క రోజులో పని పూర్తి చేయాలని ఆదేశించారు.



21 మందికి టెక్స్ అవార్డులు

- స్వాతంత్ర దినోత్సవం రోజున ప్రదానం

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వివిధ పథకాల అమలులో అగ్రభాగాన నిలిచిన అధికారులకు తెలంగాణ ప్రభుత్వం అవార్డులను ప్రకటించింది. వ్యక్తిగత, బృంద, సంస్థల వారీగా అవార్డులను ప్రకటిస్తూ శనివారం రాత్రి సాధారణ పరిపాలన(జీపీఎం అండ్ ఏఆర్) నుంచి శాలినీమిశ్రా ఉత్తర్వులు ఇచ్చారు. మొత్తం 21 మందికి స్వాతంత్ర దినోత్సవం రోజున ట్రోఫీతో పాటు పురస్కారాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాల్లోని అధికారులకు తెలంగాణ ఎక్సలెన్స్(టెక్స్) అవార్డులు ఇస్తామని గతంలోనే ప్రకటించిన ప్రభుత్వం ప్రగతి నివేదికలు నిశితంగా పరిశీలించి పలువురిని అవార్డులకు ఎంపిక చేసింది.

ఇన్నోవేషన్ విభాగంలో...

ఎ.దేవసేవన (జనగామ), జ్యోతి బుద్ధప్రకాష్ (ఆదిలాబాద్) ఆర్వీ కర్ణన్ (మంచిర్యాల) అనురాగ్ జయంతి, ఐఏఎస్ టి.చిరంజీవులు, హెచ్ఎండీఏ కమిషనర్

సాధారణ విభాగంలో..

యోగితారాణా (నిజామాబాద్), ఎ.మురళి (భూపాలపల్లి కలెక్టర్), ఎ.అప్పయ్య(డీఎంహెచ్‌వో), గోపాల్(ములుగు) రవి, ప్రవీణ్‌రెడ్డి(చిట్యాల్), అపర్ణ(ఏటూరు నాగారం), వాసుదేవరెడ్డి(మహాదేవపూర్) డాక్టర్ శరత్ (జగిత్యాల కలెక్టర్)

ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల విభాగం

వెంకట్రామరెడ్డి (సిద్దిపేట కలెక్టర్), రాజీవ్ గాంధీ హనుమంతు (భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్), జ్యోతిబుద్ధ ప్రకాష్, (ఆదిలాబాద్ కలెక్టర్), కె.కృష్ణారెడ్డి (ఆదిలాబాద్ జేసీ), సీహెచ్.సూర్యనారాయణ (ఆదిలాబాద్ ఆర్డీవో), అర్వింద్‌కుమార్, (సూపరింటెండెంట్ ఆదిలాబాద్), సురేంద్రమోహన్ (సూర్యాపేట కలెక్టర్), ప్రశాంత్ జీవన్‌పాటిల్ (వరంగల్‌రూరల్ కలెక్టర్), గౌరవ్ ఉత్పల్ (నల్లగొండ కలెక్టర్)

రియల్టీకి డబుల్ దెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

మధ్యతరగతి ప్రజల అనుభవం కూడా. ఒక్క హైదరాబాద్‌లోనే కాదు.. తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రధాన పట్టణాల్లో ఇదే పరిస్థితి. నిర్మాణ రంగంలో మెజార్టీ వ్యాపారం అవ్యవస్థీకృత రంగంలోనే ఉంటుంది. వ్యవస్థీకృత రంగంలోని సంస్థలు నిర్మిస్తున్న ఇళ్ల కంటే, ఔత్సాహిక వ్యాపారులు తమ పరిమిత వనరులను పెట్టుబడిగా పెట్టి గృహ నిర్మాణ రంగంలోకి వచ్చిన ఉదంతాలే ఎక్కువగా ఉంటాయి. కొత్తగా వచ్చిన జీఎస్టీ, ఆపై రెరా ఈ రెండూ వారిని రియల్ వ్యాపారం నుంచి పూర్తిగా తుడిచిపెట్టే ప్రమాదం ఏర్పడింది. నిజానికి, దేశంలో అత్యధిక శాతం ఉపాధి అవకాశాలను కల్పిస్తున్న రంగాల్లో రియల్టీ ఒకటి. ఇప్పటికే ఈ రంగం మందగమనంలో ఉంది. లక్షల సంఖ్యలో స్కిల్డ్, అన్‌స్కిల్డ్ కార్మికులు ఉద్యోగాల కోసం అల్లాడుతున్నారు. ప్రభుత్వం తాజాగా ప్రకటించిన ఆర్థిక సర్వేలో సైతం ఇళ్లకు డిమాండ్ తగ్గిన విషయాన్ని వెల్లడించింది. అయినా ధరలు మాత్రం ఇంకా భగ్గుమంటూనే ఉన్నాయని విస్మయం వ్యక్తం చేసింది. దేశవ్యాప్తంగా 50 నగరాలకుగాను 33 నగరాల్లో పరిస్థితి దాదాపు ఇలాగే ఉందని స్పష్టం చేసింది. మరోవైపు, అధిక వడ్డీ రేట్లు, ఎన్పీఏల భయంతో బ్యాంకులు చురుగ్గా రుణాలు మంజూరు చేయడం లేదు. చాలా చోట్ల బడా బిల్డర్లు దురాశతో పెద్ద వెంచర్లను చేపట్టి సకాలంలో పూర్తి చేయకుండా నాన్చుతున్న కారణంగా వినియోగదారులు నిస్పృహతో ఉన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రభుత్వం నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించే చర్యలు తీసుకోవాలి. ఇళ్ల కొనుగోళ్లను ప్రోత్సహించాలి. కానీ, పెద్ద నోట్ల రద్దు, ఆ తర్వాత జీఎస్టీ, రెరాలతో మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా రియల్టీ కుదేలైంది.

చిన్న బిల్డర్ల ఆవేదన

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రెరా, జీఎస్టీ రెండూ తమ ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉన్నాయని చిన్న బిల్డర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద పెద్ద బిల్డర్లు ఎంతగా ఎదిగినా భవన నిర్మాణ రంగంలో 30-40 శాతం వాటా ఇప్పటికీ అసంఘటిత రంగానికి చెందిన బిల్డర్లదే. సంఘటిత రంగంలోని పెద్ద పెద్ద బిల్డర్లతో పోలిస్తే వీరిపై పన్నుల భారం పెద్దగా ఉండేది కాదు. దాంతో వీరు చౌకగా ఫ్లాట్లు అందిస్తూ మధ్య తరగతి కొనుగోలుదారులని బాగా ఆకర్షించేవారు. ఇప్పుడు వీరి ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. ముడి సరుకులు, సర్వీసులపై జీఎస్టీ చెల్లించి మళ్లీ ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ క్లెయిమ్ చేయాలంటే చిన్న బిల్డర్లకు సాధ్యం కాదు. ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ లేకుండా ప్రాజెక్టులు చేపట్టాలంటే ఖర్చు భారీగా పెరుగుతుంది. ఇక రెరా విషయానికి వస్తే, కనీసం ఎనిమిది యూనిట్లు లేదా 500 గజాలకు మించిన స్థలంలో కట్టే ప్రాజెక్టులన్నీ ఇక రెరా చట్టం కింద రిజిస్టర్ అయి ఉండాలి. లేకపోతే అమ్మకాలకు అనుమతించరు. దీంతో ప్రధాన నగరాల్లో ఒకే స్థలంలో 10-20 ఫ్లాట్లు కట్టే బిల్డర్లు ప్రధాన అనుమతుల కోసమే రూ.30-35 లక్షలు ఖర్చు చేయాల్సివస్తోంది. చిన్న బిల్డర్లలో చాలా మందికి ఈ స్థోమత ఉండదు. దీంతో రియల్ ఎస్టేట్ రంగంలో మున్ముందు చిన్న బిల్డర్లు ఉండే అవకాశం లేదని మార్కెట్ వర్గాల అంచనా.

పెద్ద బిల్డర్లలోనూ అసంతృప్తే

పెద్ద బిల్డర్లు కూడా జీఎస్టీతో సంతృప్తిగా లేరు. జీఎస్టీని ప్రవేశపెట్టిన ప్రభుత్వం స్టాంప్ డ్యూటీని తగ్గిస్తే బాగుండేదన్నది వారి అభిప్రాయం. జీఎస్టీతో పన్ను భారం అదనంగా 6శాతం మేర పెరిగిందని చెబుతున్నారు. ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ విషయంలోనూ స్పష్టత లేదంటున్నారు. జీఎస్టీతో పన్నుల భారం తగ్గి వస్తువులతోపాటు సొంతింటి ధర కూడా తగ్గుతుందని అధికార వర్గాలు, ప్రభుత్వ పెద్దలు ఊదరగొట్టారు. ఆచరణకు వచ్చేసరికి తగ్గడం మాట దేవుడెరుగు.. మరింత పెరిగింది. పేరుకు జీఎస్టీ 12 శాతమే అయినా ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (ఐటీసీ)కు సంబంధించి బిల్డర్లకు ఇప్పటివరకూ ఎలాంటి స్పష్టత లేదు. మరో ఆరేడు నెలలు గడిస్తే తప్ప దీనిపై స్పష్టత వచ్చే అవకాశం కనిపించడం లేదని క్రెడాయ్ తెలంగాణ విభాగం అధ్యక్షుడు జి.రాంరెడ్డి చెప్పారు. భవన నిర్మాణంలో కీలకమైన సిమెంట్, స్టీలు ధరలూ జీఎస్టీ తర్వాత ఏ మాత్రం తగ్గలేదు. కలప, విద్యుత్ పరికరాల వంటి వస్తువుల ధరలైతే మరింత పెరిగాయి. దీనికితోడు బిల్డర్లు గతంలో అమ్మిన ఇంటి నాణ్యతకు సంబంధించి ఒక ఏడాది వరకే హామీ ఇచ్చేవారు. రెరా చట్టంతో ఇప్పుడు అది ఐదేళ్లకు పెరిగింది. దీంతో నిర్మాణాల కోసం బిల్డర్లు ఇక నాణ్యతపైనా దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ఐదేళ్లపాటు హామీ ఇచ్చే కంపెనీల నుంచి మాత్రమే ఇక భవన నిర్మాణానికి వస్తువులు కొనాలని ఇప్పటికే చాలా మంది బిల్డర్లు నిర్ణయించారు. గతంతో పోలిస్తే ఇందుకు ఎంత లేదన్నా మరో 20 శాతం అదనంగా ఖర్చవుతుందని అంచనా. ఈ పరిస్థితుల్లో అమ్మకం ధరను 10 నుంచి 20 శాతం వరకు పెంచాల్సిన అవసరం ఏర్పడిందని రాంరెడ్డి చెప్పారు. గతంతో పోలిస్తే జీఎస్టీతో బిల్డర్లపై పన్నుల భారం 10 శాతం వరకు పెరిగిందని విజయవాడకు చెందిన 'రాజధాని ప్రాంత బిల్డర్ల సంఘం' (సీఆర్‌బీఏ) అధ్యక్షుడు వేమూరి సుబ్బారావు తెలిపారు.

ఊరికి ప్రమోషన్

(మొదటి పేజీ తరువాయి)

నల్లగొండ జిల్లాలోని నకిరేకల్.. మేజర్ గ్రామ పంచాయతీగా ఉంది. నగర పంచాయతీగా అన్ని అర్హతలు ఉన్నప్పటికీ, గతంలో కొత్త మునిసిపల్ సంస్థలు ఏర్పాటు చేసిన సమయంలో కోర్టు కేసు కారణంగా ఏర్పాటు చేయలేకపోయారు. భద్రాచలం కూడా ఇంకా పంచాయతీగానే ఉంది. హైదరాబాద్ శివారులోనూ కొన్ని గ్రామ పంచాయతీలు దాదాపు మునిసిపాలిటీల స్థాయిలో ఉన్నాయి. గ్రామ పంచాయతీలకు 2018 ఆగస్టు లోగానే ఎన్నికలు జరపాల్సిన నేపథ్యంలో వీటిని మునిసిపాలిటీలుగా మార్చాలంటే.. ఆ లోగానే కార్యాచరణ పూర్తి చేయాల్సి ఉంటుంది. రాష్ట్రంలో కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటు ప్రక్రియకు ప్రభుత్వం ఇటీవలే శ్రీకారం చుట్టింది. కనీసం 500 జనాభా ఉంటే గ్రామ పంచాయతీగా మార్చాలని భావిస్తోంది. గిరిజన తండాలను పంచాయతీలుగా మారుస్తామని సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలోనే హామీ ఇచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే గిరిజన తండాలు/గూడేలను పంచాయతీలుగా చేసే విషయంలో అప్పట్లో నివేదిక రూపొందించారు. ఆ మేరకు తెలంగాణలో 1700 వరకు కొత్త పంచాయతీలు రానున్నాయి. రాష్ట్రంలో తండాలు/తండాల సముదాయాలను గ్రామ పంచాయతీలుగా మార్చడంతోపాటు ఇప్పటికే పలు గ్రామ పంచాయతీలకు శివారుగా ఉన్న, కనీసం 500కు పైగా జనాభా కలిగిన ఆవాసాలు లేదా ఆవాస సముదాయాలను కూడా గ్రామ పంచాయతీలుగా మారిస్తే.. కొత్తగా 2వేల వరకు గ్రామ పంచాయతీలు ఏర్పడనున్నాయి. కొత్త పంచాయతీల కోసం అనేక డిమాండ్లున్నాయని, అయితే ఇప్పటివరకు ఈ ప్రతిపాదనలపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదని పంచాయతీరాజ్ శాఖ అధికారి తెలిపారు. కొత్త వాటికి శ్రీకారం చుడితే.. రాష్ట్రంలో పెద్ద ఎత్తున కొత్త పంచాయతీలు ఏర్పాటవుతాయని చెప్పారు.

జిల్లాల వారీగా గ్రామ పంచాయతీల సంఖ్య

ఆదిలాబాద్- 243, కుమరం భీం ఆసిఫాబాద్-173, మంచిర్యాల- 210, నిర్మల్-240, నిజామాబాద్- 393, కామారెడ్డి- 323, ఖమ్మం- 427, భద్రాద్రి కొత్తగూడెం- 205, కరీంనగర్- 276, జగిత్యాల- 327, పెద్దపల్లి- 208, రాజన్న సిరిసిల్ల- 211, వరంగల్ రూరల్- 269, వరంగల్ అర్బన్- 104, జనగాం- 210, జయశంకర్ భూపాలపల్లి- 274, మహబూబాబాద్- 231, మహబూబ్‌నగర్- 468, జోగులాంబ గద్వాల- 195, నాగర్‌కర్నూలు- 300, వనపర్తి- 185, మెదక్- 320, సిద్దిపేట- 399, సంగారెడ్డి- 475, నల్లగొండ- 502, సూర్యాపేట- 323, యాదాద్రి భువనగిరి- 334, రంగారెడ్డి- 416, వికారాబాద్- 367, మేడ్చల్ మల్కాజ్‌గిరి- 77.

ఒత్తిడి వల్లే డ్రగ్స్‌బాట

టెకీలపై పని భారం తగ్గించండి... వేతనమిస్తున్నాం పనిచేయాలంటే కుదరదు

- 2 ఐటీ కంపెనీలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్రెయిన్‌వాష్

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వేలల్లో జీతం! టిప్‌టాప్‌గా డ్రెస్ చేసుకుని భుజానికి లాప్‌టాప్ తగిలించుకుని దర్జాగా ఏసీ రూముల్లో వేళ్లాడించే ఉద్యోగం! వారాంతపు సెలవులు! టార్గెట్ పూర్తి చేస్తే ఇన్సెంటివ్‌లు! పండగ బోనస్‌లు! అప్పుడప్పుడు కంపెనీల రిక్రియేషన్ కార్యక్రమాలు! అబ్బా... ఏమన్నా లైఫా..? ఇదీ ఐటీ ఉద్యోగులు, మన భాషలో చెప్పాలంటే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లపై చాలా మందికి ఉండే అభిప్రాయం. అవన్నీ ఓకే, కానీ, వాటన్నింటి వెనక ఓ టార్గెట్ ఉంటుంది! ఆ టార్గెట్ పూర్తి చేయడంలో మెదడుపై తీవ్రమైన ఒత్తిడి పెరుగుతుంటుంది. ఆ ఒత్తిడిని తగ్గించుకునేందుకు కొందరు ఉద్యోగులు వెళ్లకూడని బాటలో వెళుతున్నారు. అదే డ్రగ్స్! డ్రగ్స్ కిక్‌లో ఒత్తిడిని తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నారు కొందరు ఉద్యోగులు. ఐటీ ఉద్యోగులు డ్రగ్స్‌కు అలవాటు పడడానికి ప్రధాన కారణం ఒత్తిడేనని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తేల్చేశారు. సగటు కన్నా ఎక్కువగా ఓ ఉద్యోగి శ్రమను, నైపుణ్యాలను, తెలివితేటలను విచ్చలవిడిగా వాడేసుకోవడం వల్ల మానసిక ఒత్తిడికి లోనై కొందరు మద్యానికి బానిసవుతుంటే మరికొందరు మాత్రం డ్రగ్స్‌ను తీసుకుంటన్నారని తేల్చింది. కొన్ని బడా కంపెనీలకు ఈ వ్యవహారంపై సీరియస్ కౌన్సెలింగ్ కూడా ఇచ్చింది. డ్రగ్స్ విచారణలో భాగంగా కెల్విన్, జిషాన్, సినీ ప్రముఖుల నుంచి కీలక ఆధారాలు రాబట్టింది ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం. ఆయా విచారణల్లో 28 మంది ఐటీ ఉద్యోగులు డ్రగ్స్ వినియోగిస్తున్నట్టు గుర్తించింది. వీరు ఐటీకారిడార్‌లోని 10 కంపెనీల్లో పనిచేస్తున్నారని తేల్చారు. సినీ ప్రముఖుల విచారణకు ముందే ఆ 10 కంపెనీలకు ఎన్‌డీపీఎస్ చట్టం-1985 ప్రకారం నోటీసులు జారీ చేశారు. ఐటీ ఉద్యోగుల డ్రగ్స్ వినియోగం చాలా చిన్నసమస్య అని, గుట్టుగానే వారి విచారణ లేదా కౌన్సెలింగ్ జరగాలన్న ఒత్తిళ్లు వచ్చాయి. దీంతో సిట్ అధికారులతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలోని కీలక అధికారుల బృందం నేరుగా ఐటీ కంపెనీల వద్దకు వెళ్లి విచారణ చేపట్టాలని నిర్ణయించింది. గత వారం రోజుల్లో రెండు ప్రముఖ ఐటీ కంపెనీల్లో విచారణ చేశారు. అయితే అది కాస్తా కౌన్సెలింగ్ ప్రక్రియగానే జరిగిపోయినట్లు తెలిసింది. కంపెనీ ముఖ్య అధికారి, పర్సనల్ ఆఫీసర్‌లను తొలుత సమావేశానికి పిలువగా, మానవ వనరుల(హెచ్ఆర్) విభాగం వారూ ఉండాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ షరతలు పెట్టింది. అయితే, వ్యక్తిగత సమస్యల వల్లే ఆయా ఉద్యోగులు డ్రగ్స్‌కు అలవాటు పడి ఉంటారని కంపెనీ ప్రతినిధులు విచారణలో వెల్లడించినట్టు తెలిసింది. వారి సమాధానంపై అసహనం వ్యక్తం చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్.. "జాబ్‌లోకి రాకముందు డ్రగ్స్ అలవాటు ఉందా? లేదా అనేది మీ కంపెనీ రూల్స్ ప్రకారం అన్నీ పరిశీలన చేసే రిక్రూట్ చేసుకున్నారు. ఇప్పుడు పర్సనల్ కోణం ఏమిటి? మేం ఈ కేసు మూలాల్లోకి వెళ్లి విచారించాం. తీవ్రమైన పని ఒత్తిడి వారిపై ఉంది. దాన్నుంచి ఉపశమనం పొందేందుకు కొందరు డ్రగ్స్ బాట పట్టారు. మరి కొందరు అల్కాహాల్‌ను అలవాటు చేసుకున్నారు. మీ హెచ్ఆర్ డిపార్ట్‌మెంట్ ఏం చేస్తోంది? ఏ ఉద్యోగి ఏం చేస్తున్నారు? ఎలా ఉంటున్నారో చూసుకోవడం లేదా?" అని ప్రశ్నించినట్లు సమాచారం. దానికి బదులుగా "మంచి వేతనం చెల్లిస్తున్నాం. వారిలో ఒత్తిడి తగ్గించడానికి వారాంతపు సెలవులు ఉన్నాయి. పనితో పాటువారికి రిక్రియేషన్ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుంటాం" అని హెచ్ఆర్ అధికారి చెప్పినట్లు తెలిసింది. అయితే అవన్నీ చేసినంత మాత్రాన తగ్గే ఒత్తిడి కాదని కంపెనీ ప్రతినిధులకు ఈడీ తేల్చి చెప్పింది. అన్నింటికీ వేతనం పరిష్కారం కాదని, ఇతర అంశాలపైనా హెచ్ఆర్ దృష్టిపెట్టాలని సూచించింది. ఉద్యోగులు తప్పుదోవ పట్టకుండా చూడాల్సిన బాధ్యత హెచ్ఆర్ విభాగానిదేనని, ఉద్యోగులు డ్రగ్స్ వాడుతున్నట్టు మరోసారి తెలిస్తే కేసులు తప్పవని హెచ్చరించినట్టు భోగట్టా.



పరిహారం ఇక నేరుగా!

- చెక్కుల రూపంలో అందజేత
- ఆర్ అండ్ బీ శాఖ ప్రతిపాదన
- సత్వర భూసేకరణకు నిర్ణయం



హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రహదారుల నిర్మాణంలో ఆస్తులు, భూములు కోల్పోయిన వారికి ఇకపై నష్ట పరిహారం నేరుగా చెక్కుల రూపంలో అందనుంది. ఈ మేరకు రహదారులు, భవనాల శాఖ నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు పరిహారం మొత్తాన్ని ప్రభుత్వం పే అండ్ అక్కౌంట్స్ ఖాతాలో జమ చేస్తున్నారు. ఆ విభాగం అధికారులు లబ్ధిదారుల నుంచి అడ్వాన్సు రసీదులు తీసుకునేవారు. తీరా రిజిస్ట్రేషన్ సమయానికి ఏదో అవాంతరం ఏర్పడి చెల్లింపులు నిలిచిపోయేవి. దీంతో భూసేకరణ ప్రక్రియలో అసాధారణ జాప్యం జరుగుతోంది. ఫలితంగా రహదారుల నిర్మాణ పనులపై తీవ్ర ప్రభావం పడుతోంది. దీంతో, లబ్ధిదారులకు సంబంధిత ఆర్డీవోల ద్వారా నేరుగా చెక్కులు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఆర్డీఓ పేరిట ప్రత్యేక ఖాతా తెరిచి, భూమి లేదా ఇంటి రిజిస్ట్రేషన్ జరిగిన రోజే లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తారు. ఈ ప్రతిపాదనను ఆర్ అండ్ బీ శాఖ ప్రభుత్వానికి నివేదించింది. ఆ శాఖ ప్రతిపాదించిన పనులకు 25 వేల ఎకరాలు అవసరం. ఇందులో కేంద్రం అనుమతిచ్చిన అయిదు జాతీయ రహదారులకు సంబంధించినదే 4,500 ఎకరాలు ఉంది. అనుమతులిచ్చి ఆరు నెలలైనా భూ సేకరణలో అవరోధాలు ఎదురవుతున్నాయి. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో భూ సేకరణను అడ్డుకుంటూ జీళ్లచెరువు, కేశవాపురం, గోపాల్‌రావుపేట గ్రామస్తులు ఆందోళన చేశారు. హైదరాబాద్-మన్నెగూడ జాతీయ రహదారికి 5 వేల ఎకరాలు అవసరం. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, జగిత్యాల, కరీంనగర్, వరంగల్ అర్బన్, సూర్యాపేట, ఖమ్మం, మంచిర్యాల, ఆసిఫాబాద్, వికారాబాద్, శంషాబాద్ జిల్లాల పరిధిలో భూసేకరణ జరగాలి. పలుచోట్ల ఇళ్లు, పొలాలు కోల్పోతున్న వారు ఆందోళనకు దిగుతున్నారు. ఎవరికీ అన్యాయం జరగొద్దని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

నల్సార్‌కు మార్కెట్ చట్టం తయారీ బాధ్యత

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మార్కెటింగ్ చట్టాన్ని మరింత పటిష్టం చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మార్కెటింగ్ శాఖ చట్టం-1966కు సవరణల కోసం ఇప్పటికే మోడల్ మార్కెటింగ్ రూల్స్ డ్రాఫ్ట్‌ను సిద్ధం చేసింది. దానికి మరిన్ని సవరణలు, అవసరమైన మార్పుల కోసం వివిధ స్థాయి అధికారుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తోంది. కాగా, పటిష్టమైన చట్టం కోసం మోడల్ మార్కెటింగ్ చట్టాన్ని తయారు చేసే బాధ్యతను నల్సార్ యూనివర్సిటీ చేతికి అప్పగించింది. ఇప్పటికే మార్కెటింగ్ శాఖ, నల్సార్ వర్సిటీ మధ్య ఎంఓయూ కుదిరింది. ప్రస్తుతం ఉన్న మార్కెటింగ్ చట్టం 1966లో రూపొందించారు. ఈ చట్టంలో ఉన్న అనేక లోపాలను కొందరు వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు తమకు అనుకూలంగా మార్చుకుని రైతుల్ని మోసం చేస్తున్నారు. వారి మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు, ఈ-నామ్ అమలుకు పటిష్టమైన మార్కెటింగ్ చట్టాన్ని నల్సార్‌వర్సిటీ తయారు చేయనుంది.

హైదరాబాద్ విద్యార్థులకు లక్షల్లో జీతం

హైదరాబాద్, ఆగస్టు 13: ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐఐఐటీ-హైదరాబాద్) నుంచి బీటెక్ పట్టా పొందిన విద్యార్థులు రికార్డు స్థాయిలో జీతాలు అందుకుంటున్నారట. క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా ఏడాదికి రూ.13.4-18.8 లక్షలు అందించే కొలువులు సంపాదిస్తున్నారట. 116 కంపెనీలు తమ సంస్థలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయని, ఈ ఏడాదీ తమ విద్యార్థులు వంద శాతం ప్లేస్‌మెంట్‌లు సాధించారని సంస్థ ప్రతనిధి తెలిపారు. బీటెక్ విద్యార్థులు సగటున ఏడాదికి రూ.13.4 నుంచి 18.8 లక్షల మధ్య, పోస్ట్-గ్రాడ్యుయేట్ విద్యార్థులు ఏడాదికి రూ.14 నుంచి 17.7 లక్షల మధ్య ఆఫర్లు దక్కించుకుంటున్నారని అయన వెల్లడించారు.

'పంచాయతీ' పురస్కారాలకు దరఖాస్తులు

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ఉత్తమ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు ఇచ్చే అవార్డుల కోసం కేంద్ర పంచాయతీ రాజ్‌శాఖ దరఖాస్తులకు ఆహ్వానం పలుకుతోంది. 2016-17 సంవత్సరానికిగాను ఇచ్చే ఈ అవార్డులకు ఈనెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసుకోవాల్సి ఉంటుంది. వెబ్‌సైట్ panchayataward.gov.inలో వివరాలను పొందుపర్చాల్సి ఉంటుంది. మూడు కేటగిరీల కింద ఈ అవార్డులను ఏప్రిల్ 24న జాతీయ పంచాయతీరాజ్ దివస్ రోజున ప్రదానం చేయనున్నారు.

'పదవీ విరమణ'ను పెంచాలి: సంఘాలు

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 ఏళ్లకు పెంచాలని పంచాయతీ రాజ్ సివిల్ ఇంజనీరింగ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కోదాటి శ్యాంసుందర్, మునిసిపల్ ఉద్యోగుల సంఘం నేత శ్రీశైలం తదితరులు ప్రభుత్వాన్ని కోరారు. అన్ని శాఖల్లోనూ పదోన్నతులు కల్పించాలన్నారు.

ఎస్సీ వర్గీకరణ వద్దు: మాల మహానాడు

న్యూఢిల్లీ, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు సహకరించొద్దని కేంద్ర సామాజిక, సాధికార శాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలేను కలిసి మాలమహానాడు విజ్ఞప్తి చేసింది. జి.చెన్నయ్య, జంగాల శ్రీనివాస్‌తో కూడిన బృందం ఆదివారం ఢిల్లీలో ఆయన కార్యాలయంలో కలిశారు. మరోవైపు పసుల రామ్మూర్తి ఆధ్వర్యంలో తెలంగాణ మాల మహానాడు నాయకులు అమలాపురం ఎంపీ రవీంద్రబాబును కలిసి ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవాలని వినతిపత్రం ఇచ్చారు.

సర్కార్ అండతోనే టీఆర్ఎస్ దాడి: కోదండ

హైదరాబాద్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): టీజేఏసీ నిర్వహించిన నాల్గో విడత అమరుల స్ఫూర్తి యాత్రపై జరిగిన దాడి.. ముమ్మాటికీ ప్రభుత్వ మద్దతుతో టీఆర్ఎస్ కార్యకర్తలు చేసిందేనని టీజేఏసీ చైర్మన్ కోదండరాం ఆరోపించారు. జేఏసీ యాత్రకు, హక్కుల పరిరక్షణకు మద్దతుగా నిలిచిన పలు పార్టీలు, ప్రజాసంఘాలకు కృతజ్ఞతలు చెప్పారు. ఒకటి రెండు రోజుల్లో జేఏసీ స్టీరింగ్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని చెప్పారు.

బీసీ విద్యార్థి విభాగం బలోపేతం: జాజుల

విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బీసీ విద్యార్థి విభాగాన్ని మరింత బలోపేతం చేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు నవంబరులో బీసీ విద్యార్థి గర్జనను హైదరాబాద్‌లో లక్షలాది మందితో నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 30 నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

కుంతియా విమర్శలు అర్థం లేనివి: బూర

హైదరాబాద్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సర్కారు, సీఎం కేసీఆర్‌పై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్సీ కుంతియా చేసిన వ్యాఖ్యలను టీఆర్ఎస్ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ఖండించారు. మూడేళ్ల టీఆర్ఎస్ పాలనలో కేవలం కేసీఆర్ కుటుంబమే బాగుపడిందంటూ కుంతియా చేసిన విమర్శలు అర్థం లేనివంటూ ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాగా కాంగ్రెస్ ముసుగులోనే కోదండరాం అమరుల స్ఫూర్తి యాత్రను చేపట్టారని టీఆర్ఎస్-ఆస్ట్రేలియాశాఖ అధ్యక్షుడు కాసర్ల నాగేందర్‌రెడ్డి ఆరోపించారు.

రద్దు చేస్తే ఊర్కోం: రెవెన్యూ సంఘాలు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ వ్యవస్థను రద్దు చేసి.. వ్యవసాయ శాఖలో విలీనం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై రెవెన్యూ శాఖలో అసంతృప్తి రగులుతోంది. గ్రామ స్థాయిలో ప్రజలకు ప్రాణపదంగా ఉండే ఈ వ్యవస్థను రద్దు చేస్తే ఊర్కోబోమని, సర్కార్ ప్రయత్నాలను ప్రతిఘటిస్తామని రెవెన్యూ సంఘాలు హెచ్చరించాయి. రెవెన్యూ సంఘాలన్నీ కలిసి సోమవారం(ఈనెల 14న) కీలక సమావేశాన్ని నిర్వహించనున్నట్టు తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్(ట్రెసా) అధ్యక్షుడు శివశంకర్ తెలిపారు. ప్రభుత్వం తన యోచనను విరమించుకోకుంటే ఉద్యమిస్తామని తెలంగాణ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి, తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం(టీఎన్జీవో అనుబంధం) అధ్యక్షుడు గోల్కొండ సతీశ్, తెలంగాణ గ్రామ రెవెన్యూ కార్యదర్శుల సంక్షేమ సంఘం (టీవీఆర్‌వోడబ్ల్యూఏ) రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు హెచ్చరించారు.

ఏసీ హోటల్‌లో నాన్ ఏసీలో తిన్నా పార్సిల్ తీసుకెళ్లినా 18% జీఎస్టీ

న్యూఢిల్లీ, ఆగస్టు 13: ఏసీ హోటళ్లు, రెస్టారెంట్లలో నాన్ ఏసీ ప్రాంతంలో భోజనం చేసినా, ఇంటికి పార్సిల్ తీసుకెళ్లినా 18% జీఎస్టీ విధిస్తామని ప్రభుత్వం తెలిపింది. జూలై ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చిన జీఎస్టీ ప్రకారం నాన్ ఏసీ హోటల్‌లో భోజనం చేసినా, పార్సిల్ తీసుకెళ్లినా 12%, ఏసీ, మద్యం లైసెన్స్ కలిగిన రెస్టారెంట్లలో 18%, ఫైవ్ స్టార్ హోటళ్లలో 28% పన్ను వేస్తున్నారు. అయితే ఇప్పుడు ఏసీ హోటల్‌లో ఏసీ, నాన్ ఏసీ ప్రాంతాలతో సంబంధం లేకుండా ఏకరూపంగా 18% జీఎస్టీ విధిస్తూ ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. ఏసీ హోటళ్ల నుంచి ఇంటికి పార్సిల్ తీసుకెళ్లినా 18% పన్ను వేస్తామని పేర్కొన్నది.



పట్టాలు ప్రదానం చేస్తున్న గవర్నర్ వాజుభాయ్‌వాలా, చాన్సలర్


కళాశాలల విద్య బలోపేతం గవర్నర్ చేతిలోనే

- పీఈఎస్ వర్సిటీ చాన్సలర్ ఎం.ఆర్.దొరస్వామి

బెంగళూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ ప్రగతికి కర్ణాటక దిక్సూచిగా ఉందని పీఈఎస్ లవర్సిటీ చాన్సలర్ ఎం.ఆర్.దొరస్వామి చెప్పారు. నిష్ణాతులైన వైస్‌చాన్సలర్‌ను నియమించడం ద్వారా కళాశాలల విద్య బలోపేతం చేసే మహత్తరమైన శక్తి గవర్నర్‌కే ఉందని అభిప్రాయపడ్డారు. పీఈఎస్ వర్సిటీ ద్వితీయ స్నాతకోత్సవం బెంగళూరులో జరిగింది. ఈ సందర్భంగా దొరస్వామి మాట్లాడారు. కళాశాలల విద్య గుణాత్మకం, క్రమశిక్షణగా సాగాలంటే ఉత్తమ వైస్‌చాన్సలర్లను నియమించాలన్నారు. వారిని బట్టి ఉన్నత విద్య బలోపేతమవుతుందని అభిప్రాయపడ్డారు. 638 మంది విద్యార్థులకు ఆయన పట్టాలు ప్రదానం చేశారు.

నారాయణ మూర్తిని గౌరవ చైర్మన్‌గా తీసుకోవాలి

• ఇన్ఫోసిస్ మాజీ సిఎఫ్ఓ బాలకృష్ణన్



బెంగుళూరు : ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఎన్ఆర్ .నారాయణ మూర్తిని మళ్లీ కంపెనీ గౌరవ చైర్మన్‌గా, మెంటర్‌గా నియమించాలనే డిమాండ్ ఊపందుకుంటోంది. కంపెనీ మాజీ సిఎఫ్ఓ బాలకృష్ణన్ కూడా ఇందుకు మద్దతు పలికారు. కంపెనీ ప్రస్తుత మేనేజ్‌మెంట్ ఈ విషయంలో బేషజాలకు పోకుండా వెంటనే మూర్తిని ఆహ్వానించాలని కోరారు. దీనివల్ల వాటాదారులతో పాటు ఇన్ఫోసిస్ భవిష్యత్‌కు సరైన మార్గదర్శకత్వం ఏర్పడుతుందన్నారు. 'ఇన్ఫోసిస్ డైరెక్టర్ల బోర్డు నారాయణ మూర్తిని వెంటనే గౌరవ చైర్మన్‌గా, మెంటర్‌గా ఆహ్వానిస్తే మంచిదని భావిస్తున్నా. ఆ హోదాలో దీర్ఘకాలంలోనూ కంపెనీ నిర్వహణ చక్కగా సాగేందుకు వీలుగా డైరెక్టర్ల బోర్డును పునర్ వ్యవస్థీకరించడంలోనూ కీలక పాత్ర పోషించాలి' అని చెప్పారు. ఇలా చేయడంతో స్టాక్ మార్కెట్‌లోనూ కంపెనీ షేర్లపై వాటాదారుల విశ్వాసం ఇనుమడిస్తుందని బాలకృష్ణన్ అన్నారు.

దివీస్ లాబ్ విశాఖ ప్లాంట్‌కు 'గ్రీన్'సిగ్నల్



న్యూఢిల్లీ : ఫార్మా రంగంలోని దివీస్ లాబ్ విశాఖ ప్లాంట్ ఆధునికీకరణకు పర్యావరణ అనుమతి లభించింది. 100 కోట్ల రూపాయల వ్యయంతో ఈ ప్లాంట్‌ను ఆధునికీకరిస్తున్నారు. ఈ ప్లాంట్‌లో ఉత్పత్తి ఇతర కార్యకలాపాలన్నింటినీ వేరే ప్రాంతానికి తరలించి ఎగుమతి లక్ష్యాలకు దీటుగా ఉత్పత్తిని పెంచుకునేందుకు ఆధునికీకరణ చేపట్టాలని కంపెనీ భావించింది. ఈ ప్రతిపాదనను పరిశీలించిన నిపుణుల సంఘం సిఫారసుల మేరకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ గత వారం అనుమతులు మంజూరు చేసినట్టు చెబుతున్నారు. కొన్ని నిర్దిష్ట, సార్వత్రిక షరతులకు లోబడి ఈ అనుమతి మంజూరు చేస్తున్నట్టు పర్యావరణ శాఖ దివీస్‌కు పంపిన లేఖలో తెలిపింది. ఈ విస్తరణతో సుమారు 8 వేల మందికి ఉపాధి లభిస్తుందని కంపెనీ పేర్కొంది. ప్రస్తుతం కంపెనీ చేతిలో 387 ఎకరాల భూమి ఉండగా 108.59 ఎకరాలను ఆధునికీకరణకు వినియోగించుకుంటారు. రెండు దశలుగా ఈ ఆధునికీకరణ జరుగుతుంది. దివీస్ లాబ్‌కు నల్గొండ, విశాఖపట్టణంలలో రెండు ప్లాంట్లున్నాయి. విశాఖలోని స్థలంలో 33 శాతం ప్రదేశాన్ని హరిత ప్రాంతంగా అభివృద్ధి చేయాలని, ఐదు సంవత్సరాల పాటు ఏడాదికి వెయ్యి మొక్కలు పెంచాలని, ట్రీట్‌మెంట్ యూనిట్‌లో వ్యర్థాల పరిమాణాన్ని మదింపు చేసేందుకు ఆన్‌లైన్ మానిటరింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని పర్యావరణ శాఖ షరతులు విధించింది. ఈ విస్తరణ సమయంలో ఉత్పాదక సామర్థ్యాలు, తయారవుతున్న ఉత్పత్తులు, నీటి వినియోగం, వృధానీటి పరిమాణం వంటి అంశాల్లో ఎలాంటి మార్పులు ఉండబోవని కంపెనీ స్పష్టం చేసింది.

జీఎస్‌టీఆర్ 3బి రిటర్న్ ఎలా ఫైల్ చేయాలి?

గొండాల రాంబాబు



జీఎస్‌టిలో రిజిస్ట్రేషన్ తీసుకున్న వారు ఫైల్ చేయాల్సిన రిటర్నుల గురించి తెలుసుకుందాం. ఇది కాంపోజిషన్ స్కీమ్‌లో ఉన్న వారికి కాకుండా మిగతావారికి ఉద్దేశించింది. జీఎస్‌టిలో రిజిస్ట్రేషన్ తీసుకున్న వారు ప్రతి నెల మూడు రిటర్న్లు ఫైల్ చేయాల్సి ఉంటుంది. మొదటిది జీఎస్‌టీఆర్-1, ఇది మీ ఔట్ వార్డ్ సరఫరాలకు అంటే అమ్మకాలకు సంబంధించిన రిటర్న్. దీన్ని తరువాతి నెల 10 వ తేదీ లోపు ఫైల్ చేయాల్సి ఉంటుంది. రెండోది జీఎస్‌టీఆర్-2, ఇది మీ ఇన్ వార్డ్ సరఫరాలు అంటే కొనుగోళ్లకు సంబంధించిన రిటర్న్. దీన్ని తరువాతి నెల 15 వ తేదీ లోపు ఫైల్ చేయాల్సి ఉంటుంది. ఇక మూడోది మంత్లీ రిటర్న్ జీఎస్‌టీఆర్-3, దీన్ని తరువాతి నెల 20 వ తేదీ లోపు దాఖలు చేయాలి. అంటే ఈ విధంగా చూస్తే జూలై నెలకు సంబంధించిన ఈ మూడు రిటర్నులు.. ఆగస్టు 10,15,20 వ తేదీల లోపులో ఫైల్ చేయాల్సి ఉంటుంది. కానీ, జీఎస్‌టి చట్టం కొత్తగా అమల్లోకి వచ్చింది కాబట్టి ప్రభుత్వం మొదటి రెండు నెలలకు గాను ఈ రిటర్న్లు ఫైల్ చేసే గడువును పొడిగించింది. దీని ప్రకారం జూలై నెలకి సంబంధించిన ఈ మూడు రిటర్నులను సెప్టెంబరు 5,10,15 వ తేదీల్లోపు, ఆగస్టుకి సంబంధించిన రిటర్నులను సెప్టెంబరు 20,25,30 వ తేదీల్లోపు ఫైల్ చేసే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది (పన్ను చెల్లింపు తేదీని మాత్రం పొడిగించలేదన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి).

అయితే ఈ లోపులో మాత్రం జీఎస్‌టీఆర్ 3బి అనే సంక్షిప్త రిటర్న్‌ను మాత్రం ప్రతి ఒక్కరు కచ్చితంగా ఫైల్ చేయాలని ప్రభుత్వం నిబంధన విధించింది. దీని ప్రకారం జూలై నెలకు సంబంధించిన జీఎస్‌టీఆర్ 3బి రిటర్న్‌ను ఆగస్టు 20 వ తేదీ లోపు, ఆగస్టు నెల రిటర్న్‌ను సెప్టెంబరు 20 వ తేదీ లోపు దాఖలు చేయాలి. అంటే జూలై నెలలో రిజిస్టర్ అయిన వారు, వ్యాట్, సర్వీస్ టాక్స్, సెంట్రల్ ఎక్సైజ్ నుంచి జీఎస్‌టిలోకి మైగ్రేట్ అయిన వారితో సహా అందరు (కాంపోజిషన్ స్కీమ్‌లో ఉన్నవారు మినహా) జూలై నెలకు సంబంధించిన ఈ జీఎస్‌టీఆర్ 3బి రిటర్న్ ఈ నెల 20 వ తేదీలోపు కచ్చితంగా ఫైల్ చేయాల్సి ఉంటుంది. కాబట్టి ప్రతి ఒక్కరు ఈ రిటర్న్ ఎలా ఫైల్ చేయాలో తెలుసుకోవాలి. దీనికి ముందుగా జూలై నెలకు సంబంధించిన ఈ వివరాలు సిద్ధం చేసుకోండి. మీ నుంచి జూలై నెలలో జరిగిన అమ్మకాలు, సరఫరాలకు సంబంధించిన వివరాలు విభాగాల వారీగా అంటే పన్ను కింద వచ్చేవి, పన్ను నుంచి మినహాయింపు పొందినవి, ఎగుమతి లేదా సెజ్‌లకు ఏమైనా సరఫరాలు చేస్తే ఆ వివరాలు.. అలాగే రివర్స్ చార్జ్‌లో మీరే కట్టాల్సిన సరఫరాలు ఏమైనా మీరు తీసుకుంటే వాటికి సంబంధించిన వివరాలు. అంతరాష్ట్ర సరఫరాలు, రిజిస్ట్రేషన్ లేని వారికి లేదా కాంపోజిషన్ స్కీమ్‌లో ఉన్నవారికి ఏమైనా చేస్తే వాటి వివరాలు సిద్ధం చేసుకోండి. అలాగే వీటిలో పన్ను చెల్లించాల్సిన సరఫరాకు సంబంధించి ఐజీఎస్‌టి, సిజీఎస్‌టి, ఎస్‌జిఎస్‌టి ఎంతెంత చెల్లించాలో లెక్కించి ఉంచుకోండి. అలాగే మీకు రావాల్సిన ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌కు సంబంధించి జూలై నెలలో మీరు తీసుకున్న సరఫరాలకు సంబంధించిన మొత్తం ఐజీఎస్‌టి, సిజీఎస్‌టి, ఎస్‌జీఎస్‌టి వివరాలు ఇవి కూడా విభాగాల వారీగా ఉంటే. దిగుమతుల ద్వారా వచ్చిన సరఫరాలు, దేశీయ సరఫరాలు, మీరు తీసుకున్న వాటిలో మీకు ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ తీసుకోవటానికి అర్హత లేని సరఫరాలు ఏమైనా ఉంటే వాటి తాలూకు వివరాలు కూడా ఉంచుకోవాలి. ఈ వివరాలతో మీరు మీ యూజర్ ఐడి, పాస్‌వర్డ్‌తో లాగిన్ అయి (WWW.-GST.-GOV.IN) మీ జీఎస్‌టీఆర్ 3బి ఫైల్ చేయవచ్చు. అలాగే మీకు ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ పోను ఇంకా పన్ను చెల్లించాల్సి ఉంటే ఆ మొత్తం కూడా ఇదే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు. మొత్తం మీద పైన చెప్పిన అన్ని వివరాలతో పాటుగా మీకు నచ్చిన ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్, ఇంకా ఆన్‌లైన్‌లో చెల్లించిన మొత్తాలను మీరు కట్టాల్సిన మొత్తాలకు సరిపోయే విధంగా బదిలీ చేయాల్సి ఉంటుంది. మీరు చూపించే వివరాలు తర్వాత మీరు ఫైల్ చేసే జీఎస్‌టీఆర్ 1,2,3లతో సరిపోవాలి. కాబట్టి ఈ వివరాలు జాగ్రత్తగా సరిచూసుకోవాలి. అలాగే జీఎస్‌టీఆర్ 3బి ఎలా ఫైల్ చేయాలో డెమో రూపంలో చూడటానికి https:// youtube/ dH4fuakVEHY లింక్ లోని వీడియోను వీక్షించండి.

ఇదీ జీఎస్‌టీ

గమనిక : ఈ వ్యాసాల ద్వారా ఇస్తున్న సమాచారం కేవలం అవగాహన కోసం మాత్రమే. పాఠకులు ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత చట్టాలు/నిబంధనలను కూలంకషంగా పరిశీలించాలి.

జీఎంఆర్ ఇన్‌ఫ్రాను ఆదుకున్న ఎయిర్‌పోర్ట్స్

క్యు1లో 44 శాతం తగ్గిన నష్టాల భారం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ నష్టాలను తగ్గించుకుంది. గత ఏడాది ఇదే కాలంలో అనుబంధ కంపెనీలతో కలుపుకుని (కన్సాలిడేటెడ్) రూ.235 కోట్ల వరకు ఉన్న కంపెనీ నష్టాలు ఈ ఏడాది 42 శాతం తగ్గి రూ.137 కోట్లకు చేరాయి. కంపెనీ నిర్వహణలోని విమానాశ్రయాల రాబడులు పెరగడం ఇందుకు దోహదం చేసింది.

ఈ ఏడాది ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో ప్రయాణికుల రద్దీ హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో 35 లక్షల నుంచి 42 లక్షలకు (19 శాతం), ఢిల్లీ విమానాశ్రయంలో 1.38 కోట్ల నుంచి 1.57 కోట్లకు (14 శాతం), ఫిలిప్పీన్స్‌లోని సెబు ఎయిర్‌పోర్టుల్లో 21 లక్షల నుంచి 24 లక్షలకు (16 శాతం) పెరిగిందని పేర్కొంది.

రాబడిలో వృద్ధి..

ఎయిర్‌పోర్ట్స్ విభాగం దన్నుతో ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కంపెనీ ఆదాయం రూ.3,159 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 41 శాతం ఎక్కువ. దీంతో వడ్డీ, పన్నులు, తరుగుదల, అప్పుల చెల్లింపులు పోను మిగిలే ఆదాయం (ఎబిడిటా) 11 శాతం పెరిగి రూ.845 కోట్లకు చేరింది. ఒడిశాలోని కమలాంగ విద్యుత్ ప్లాంట్ స్థాపిత ఉత్పత్తి సామర్థ్యం (పిఎల్ఎఫ్) వినియోగం 72 శాతం నుంచి 65 శాతానికి తగ్గినా మహారాష్ట్రలోని వరోరా పవర్ ప్లాంట్ పిఎల్ఎఫ్ 44 శాతం నుంచి 77 శతానికి పెరగడం తొలి త్రైమాసిక కాలంలో జీఎంఆర్ ఇన్‌ఫ్రాకు కలిసొచ్చింది. బొగ్గు ధరలు పెరగడంతో ఇండోనేషియాలోని జాయింట్ వెంచర్ కంపెనీ గోల్డెన్ ఎనర్జీ మైన్స్ కంపెనీ లాభం రూ.10 కోట్ల నుంచి రూ.210 కోట్లకు పెరగడం కూడా జీఎంఆర్ ఇన్‌ఫ్రా నష్టాలు తగ్గించుకునేందుకు దోహదం చేసింది.

గోవా ఎయిర్‌పోర్ట్‌కు నిధుల సమీకరణ

గోవాలో కొత్తగా తలపెట్టిన మోపా ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు కోసం రూ.1,330 కోట్ల రుణ సేకరణనూ జీఎంఆర్ ఇన్‌ఫ్రా తొలి త్రైమాసికంలో పూర్తి చేసింది. దాదాపు 18 ఏళ్ల కాల పరిమితి ఉండే ఈ రుణాలను వీలైనంత తక్కువ వడ్డీ రేటుకే సేకరించినట్టు తెలిపింది. గ్రీస్‌లో ఒక అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ, ఆపరేటర్ కాంట్రాక్టును కూడా కంపెనీ ఇదే కాలంలో సాధించింది. గ్రీస్‌కు చెందిన టెర్నా ఎస్ఎ అనే కంపెనీతో కలిసి జీఎంఆర్ ఇన్‌ఫ్రా ఈ ప్రాజెక్టు చేపట్టబోతోంది.

బడాబాబుల 'డొల్ల'మాయ

• పెద్దల పాత్రపై త్వరలో దిమ్మ తిరిగే విషయాలు
• బిల్డర్లు, బ్రోకర్లు, బాలీవుడ్ పెద్దలపైనా దర్యాప్తు



న్యూఢిల్లీ: డొల్ల కంపెనీల గుట్టు రట్టవుతోంది. దీనికి సంబంధించిన దర్యాప్తును మరింత విస్తృతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో బిల్డర్లు, బ్రోకర్లు, బాలీవుడ్ ప్రముఖులు తమ నల్లధనాన్ని వైట్ చేసుకునేందుకు దాదాపు 500 డొల్ల కంపెనీలను ఎలా ఉపయోగించుకున్నారనే విషయం త్వరలో బయటికి రానుంది. ఈ విషయాలు విస్తుపోయేలా ఉంటాయని అధికార వర్గాలు చెప్పాయి. ఇందుకు సంబంధించి ఇప్పటికే ప్రాథమిక ఆధారాలు సేకరించినా, దర్యాప్తు పూర్తయ్యే వరకు ఈ వివరాలు బయటపెట్టకూడదని నిర్ణయించారు. ఆదాయ పన్ను (ఐటి) శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన తీవ్ర ఆర్థిక నేరాల దర్యాప్తు సంస్థ (ఎస్ఎఫ్ఐఒ) ఇందుకోసం డొల్ల కంపెనీల ఖాతాలను జల్లెడ పడుతున్నాయి. డొల్ల కంపెనీలనే అనుమానంతో సెబి ఇప్పటికే 331 కంపెనీల షేర్ల ట్రేడింగ్‌పై ఆంక్షలు విధించింది. ఇవిగాక మరో వందకిపైగా అన్‌లిస్టెడ్ కంపెనీలపైనా దర్యాప్తు సంస్థలు దృష్టి పెట్టాయి. బిల్డర్లు, బ్రోకర్లు, బాలీవుడ్ పెద్దలకు చెందిన అక్రమ నగదును ఈ సంస్థలు స్టాక్ మార్కెట్‌కు మళ్లించి లావాదేవీలు జరిపినట్టు అనుమానిస్తున్నారు.

ప్రముఖ కంపెనీలకూ పాత్ర !

డొల్ల కంపెనీలనే అనుమానంతో సెబి తమ షేర్ల లావాదేవీలపై వేటు వేశాక కొన్ని లిస్టెడ్ కంపెనీలు సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (శాట్) ఆశ్రయించి స్టే తెచ్చుకున్నాయి. అదే సమయంలో నిబంధనలను తుంగలో తొక్కిన కంపెనీలపై దర్యాప్తుకూ శాట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో తమవి డొల్ల కంపెనీలు కావని కొన్ని కంపెనీలు ఇప్పటికే ప్రకటనల మీద ప్రకటనలు ఇచ్చుకుంటున్నాయి. డొల్ల కంపెనీల అంటే ప్రజల్లో ఉన్న అభిప్రాయంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని అధికార వర్గాలు చెబుతున్నాయి. నిజానికి నల్లధనాన్ని వైట్‌గా మార్చుకునేందుకు డొల్ల కంపెనీల ద్వారానే లావాదేవీలు చేయాల్సిన పని లేదు. లిస్టయిన ప్రముఖ కంపెనీల షేర్ల ట్రేడింగ్ ద్వారానూ అక్రమంగా కూడబెట్టిన నల్ల ధనాన్ని 'తెలుపు' చేసుకునేందుకూ అనేక అవకాశాలున్న విషయాన్ని అధికార వర్గాలు గుర్తు చేస్తున్నాయి. ఇందులో భాగంగానే డొల్ల కంపెలనీ అనుమానం ఉన్న చిన్న చిన్న బ్రోకరేజ్ సంస్థలకు పెద్ద పెద్ద బ్రోకరేజ్ సంస్థలతో ఉన్న సంబంధాలపై సెబి దర్యాప్తు చేస్తోంది. సెబి నిర్ణయం తర్వాత తమ నిధులను వెనక్కి తీసుకునేందుకు స్టాక్ మార్కెట్లో ఈ సంస్థలు సృష్టించిన భయాందోళనపైనా సెబి దృష్టి పెట్టినట్టు సమాచారం.

ఐయుసి చార్జీలపై త్వరలో ట్రాయ్ నిర్ణయం

న్యూఢిల్లీ : దేశంలో మొబైల్ కాల్ చార్జీలు మరింత తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. ఒక నెట్‌వర్క్‌లోని వ్యక్తి మరో నెట్‌వర్క్‌లోని మొబైల్ యూజర్‌కు చేసే కాల్స్‌పై చెల్లించే 'ఇంటర్ కనెక్ట్ యూసేజ్ ఛార్జీ (ఐయుసి)'లను తగ్గించాలని ట్రాయ్ భావించడమే ఇందుకు కారణం. ప్రస్తుతం ఐయుసి కింద కంపెనీలు కాల్ టెర్మినేట్ అయ్యే ఆపరేటర్‌కు నిమిషానికి 14 పైసల చొప్పున చెల్లిస్తున్నాయి. ప్రస్తుతం ఇంటర్‌నెట్ ప్రొటెకాల్ (ఐపి) ఆధారంగా జరుగుతున్న ఈ టెర్మినేషన్‌కు నిమిషానికి మూడు పైసల కంటే ఎక్కువ కాదని అంచనా.



రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.10		నెక్ (100 గుడ్లు)	
హైదరాబాద్	348.00	వరంగల్	350.00
విజయవాడ	355.00	చెన్నై	387.00
గోదావరి	355.00	నమక్కల్	375.00
బెంగుళూరు	375.00	చిత్తూరు	380.00
విశాఖపట్నం	360.00	ముంబై	388.00



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	77.00	గోదావరి	77.00
కరీంనగర్	78.00	విజయవాడ	78.00
వరంగల్	77.00	గుంటూరు	78.00
మహబూబ్‌నగర్	77.00	ఒంగోలు	80.00
కర్నూలు	77.00	చిత్తూరు	70.00
విశాఖపట్నం	78.00	నెల్లూరు	70.00

ఆస్ట్రో గైడ్

గత వారం కనిష్ఠ స్థాయికి దిగువన మరింత బలహీనం



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

(ఆగస్టు 14-18 తేదీల మధ్య వారానికి)

గత వారం నిఫ్టీ : 9711 (- 355)

నిఫ్టీ గత వారం 10088-9686 పాయింట్ల మధ్యన విస్తృత పరిధిలో కదలాడి 355 పాయింట్ల భారీ నష్టంతో (సుమారు 3.60 శాతం) 10066 పాయింట్ల వద్ద ముగిసింది. ముగింపు ధోరణి అత్యంత ప్రతికూలంగా ఉంది.

- స్వల్పకాలిక ధోరణి బలహీనంగా మారింది. మధ్య, దీర్ఘకాలిక ధోరణులు రెండింటిలోనూ బుల్లిష్‌గానే ఉంది. 9900 కన్నా పైన ముగిసినప్పుడే తిరిగి బుల్లిష్ అవుతుంది.
- 20, 50, 100, 200రోజుల చలన సగటు స్థాయిలు 9963, 9775, 9533, 9001 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.
- నిఫ్టీ ప్రస్తుతం 20,50 డిఎంఏల కన్నా దిగువకు వచ్చింది. కాని 50 డిఎంఏ 200 డిఎంఏల కన్నా పైనే ఉంది. దీర్ఘకాలిక ట్రెండ్ బుల్లిష్‌గా ఉందనేందుకు ఇది సంకేతం.

వారానికి బ్రేకౌట్ స్థాయి: 9850 బ్రేక్‌డౌన్ స్థాయి : 9600
నిరోధ స్థాయిలు: 9865, 9940 (9790 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 9565, 9490 (9640 దిగువన బేరిష్)

ఇన్వెస్టర్లకు సూచన

వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు.

ద్వితీయార్ధం నిస్తేజం (సోమవారానికి)

తిథి: శ్రావణ బహుళ సప్తమి **నక్షత్రం:** భరణి
మృగశిర, చిత్త, ధనిష్ట నక్షత్ర జాతకులు, వృషభ, కన్యా రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

ట్రెండ్ మార్పు వేళలు : 10.47

ధోరణి: గ్రహగతులను బట్టి నిలకడ/నిస్తేజంగా ప్రారంభమై 11.15 నుంచి 1.30 మధ్యలో రికవరీ సాధించి ఆ తర్వాత ముగింపు వరకు కూడా నిస్తేజంగా ట్రేడ్ కావచ్చు.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 11.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 1.30 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.45 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

నిరోధ స్థాయిలు : 9750, 9785
మద్దతు స్థాయిలు : 9670 9635

గ్రహగతులు

- మేషంలోని భరణి పాదం 1 నుంచి మిథునంలోని ఆర్ద్ర పాదం 3 మధ్యలో చంద్ర సంచారం
- కర్కాటకంలోని ఆశ్లేష పాదం 4 నుంచి సింహంలోని మఖ పాదం 1 మధ్యలో రవి సంచారం
- సింహంలోని పుబ్బ పాదం 1, 2 మధ్యలో వక్రగతిలో బుధ సంచారం
- మిథునంలోని పునర్వసు పాదం 1, 3 మధ్యలో శుక్ర సంచారం
- కర్కాటకంలోని ఆశ్లేష పాదం 1,2 మధ్యలో కుజ సంచారం
- వృశ్చికంలోని జ్యేష్ఠ పాదం 4లో మీన నవాంశలో వక్రగతిలో శని సంచారం
- కన్యలోని చిత్త పాదం 1 లో సింహ నవాంశలో బృహస్పతి సంచారం
- సింహంలో రాహువు, కుంభంలో కేతువు మేష, తుల నవాంశల్లో సంచారం

9, 11 తేదీల మధ్యలో చంద్రుడు కుంభం, మీన రాశుల్లో మార్కెట్ సంచరించిన సమయంలో ఏర్పడిన పరిధిలో

కనిష్ఠ స్థాయి 9686 కన్నా దిగజారితే మరింత కనిష్ఠ స్థాయిలకు రావచ్చును.

టెక్ వ్యూ

ప్రధాన మద్దతు స్థాయిలు 9700, 9450



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం అంతా బలమైన కరెక్షన్ ట్రెండ్‌లో ట్రేడవుతూ వారం కనిష్ఠ స్థాయిలో క్లోజ్ కావడం అమ్మకాల ఒత్తిడికి సంకేతం. కొద్ది వారాల పాటు సాగిన నిరంతర అప్‌ట్రెండ్ అనంతరం ఇప్పుడు టెక్నికల్‌గా మార్కెట్ బలమైన డౌన్ ట్రెండ్‌లో ప్రవేశించి గత కొద్దిరోజులుగా 450 పాయింట్లు కోల్పోయింది. తక్షణ ర్యాలీకి స్వల్పకాలిక విరామం ఇచ్చినట్టు కనిపిస్తోంది. ఇక ఎక్కడ మద్దతు తీసుకుంటుందో వేచి చూడాలి. తొలి విడత కరెక్షన్‌లో మిడ్ క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్ల అమ్మకాలు సాగి 15 నుంచి 20 శాతం కరెక్షన్ ఏర్పడింది. టెక్నికల్‌గా ప్రస్తుతం కీలక మద్దతు స్థాయి 9700 కన్నా స్వల్ప ఎగువన ఉంది. ఇక్కడ రికవరీ తప్పనిసరి.

బుల్లిష్ స్థాయిలు...

మరింత అప్రమత్త ట్రెండ్ కొనసాగే ఆస్కారం ఉంది. ప్రస్తుత స్థాయిలో రికవరీ సాధించినట్టయితే 9800 ప్రధాన నిరోధ స్థాయిగా ఉంటుంది. ఇదే కొద్ది రోజుల క్రితం సాధించిన మైనర్ టాప్. ఆ పైన క్లోజయితే మరింత అప్‌ట్రెండ్‌లో తదుపరి నిరోధం 9900 దిశగా కదులుతుంది. కన్సాలిడేషన్ అనంతరమే ట్రెండ్‌లో స్పష్టత ఉండవచ్చు.

బేరిష్ స్థాయిలు...

9700 వద్ద విఫలమై అంతకన్నా దిగువన క్లోజయితే స్వల్పకాలిక కరెక్షన్ మరింతగా కొనసాగవచ్చు. ప్రధాన మద్దతు స్థాయిల 9600, 9450. ఈ ఏడాది జూన్ చివరి వారంలో వీక్లీ చార్టుల్లో ఏర్పడిన ప్రధాన బాటమ్ 9450.

- బ్యాంక్ నిఫ్టీ ప్రస్తుతం ప్రధాన మద్దతు స్థాయి 24000 చేరువలో ఉంది. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. అంతకన్నా దిగువన క్లోజయితే స్వల్పకాలిక కరెక్షన్‌లో పడుతుంది. దిగువ మద్దతు స్థాయిలు 23500, 23000.

స్వల్పకాలిక వ్యూహం : మార్కెట్ దిశపై స్పష్టమైన సంకేతాలు వెలువడే వరకు స్వల్పకాలిక ట్రేడర్లు స్వల్పకాలిక బై పొజిషన్లకు దూరంగా ఉండడం మంచిది.

పాటర్న్ : గత వారంలో మార్కెట్ ఓవర్‌బాట్ స్థితిని సద్దుబాటు చేసుకోవడం కనిపించింది. 9500 వద్ద అడ్డంగా కనిపిస్తున్న సపోర్ట్ ట్రెండ్‌లైన్ వద్ద నిరోధం ఉంది. నిఫ్టీ ప్రస్తుతం 9700 వద్ద ఏటవాలుగా ఎగువకు కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్ కన్నా స్వల్పంగా పైన ఉంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం ఇక్కడ రికవరీ తప్పనిసరి. అలాగే ఏటవాలుగా దిగువకు కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్ కన్నా చాలా దిగువన ఉండడం అప్‌ట్రెండ్‌కు కొంత సమయం పడుతుందనేందుకు సంకేతం. నిఫ్టీ ఇప్పుడు 50 డిఎంఎ వద్ద పరీక్ష ఎదుర్కొనబోతోంది. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది.

టైమ్ : ఈ సూచిక ప్రకారం తదుపరి రివర్సల్ బుధవారం ఉంది.

సోమవారం స్థాయిలివే...
నిరోధం : 9750, 9800-9810 మద్దతు : 9680, 9600

నిఫ్టీ వ్యూహం...

మార్కెట్ స్ట్రాటజీ

గత కొద్ది వారాలుగా దూకుడుగా కొనసాగుతున్న మార్కెట్లు గడచిన వారం నీరసించాయి. అమెరికా, ఉత్తర కొరియా మధ్య ముదురుతున్న వివాదం, డోక్లామ్ ఉద్రిక్తత, డొల్ల (షెల్) కంపెనీలపై మార్కెట్ నియంత్రణ సంస్థ సెబి వేటు.. ఇవన్నీ మార్కెట్లో కరెక్షన్‌కు కారణంగా భావించవచ్చు. నిజానికి గత కొద్ది నెలలుగా ఒకటే దిశలో దూసుకుపోతున్న మార్కెట్లకు ఈ కరెక్షన్ అనివార్యం. ఇక ఈ వారానికి నిఫ్టీకి సంబంధించిన వ్యూహం ఇస్తున్నాం. ఇందులో నిఫ్టీ ఫ్యూచర్ ఒక లాట్ 9738లో షార్ట్ చేయాలి. దీంతోపాటు 9700 పుట్ రూ.106 చొప్పున రెండు లాట్లు షార్ట్ చేయాలి. 9900 కాల్ ఒక లాట్ రూ.49లో కొనుగోలు చేయాలి. ఆగస్టు కాంట్రాక్టుల ముగింపు తేదీ నాటికి అంటే 31 వ తేదీ నాటికి నిఫ్టీ 9500 ఎగువన ఉంటే కచ్చితంగా లాభంలో ఉంటారు. ముఖ్యంగా నిఫ్టీ 9600 నుంచి 9800 మధ్యన ముగిస్తే కచ్చిత లాభం రూ.7,500 నుంచి రూ.15,000 మధ్య పొందవచ్చు. ఒకవేళ మార్కెట్లు ఇంకా క్షీణించి 9500 కంటే తగ్గుతుంటే మాత్రం నష్టం వచ్చే అవకాశం ఉన్నందున మార్కెట్లు ఈ స్థాయి కంటే తగ్గుతున్నట్లు అనిపిస్తే లాభనష్టాలతో సంబంధం లేకుండా వ్యూహం నుంచి వైదొలగాలి లేదా 9500 లేదా 9400 పుట్ ఒకటి కొనుగోలు చేయాలి.

- గొండాల రాంబాబు

ఈ వారంలోనూ నీరసమే...

మార్కెట్ నాడి



విజయ్ సింఘానియా
డైరెక్టర్, ట్రేడ్‌స్మార్ట్ ఆన్‌లైన్

"ప్రపంచ యవనికపై చోటు చేసుకోనున్న రాజకీయ పరిణామాలు, స్థూల ఆర్థిక గణాంకాలు ఈ వారంలో మార్కెట్ దిశకు కీలకం కానున్నాయి".

అమెరికా, ఉత్తరకొరియాల మధ్య మాటల యుద్ధం, డొల్ల కంపెనీలపై సెబి చర్య, అంతర్జాతీయ మార్కెట్లలో స్థూలంగా నెలకొన్న బలహీనత వంటి అంశాలన్నీ గత వారం మార్కెట్‌ను తిరోగమన బాటలోకి నెట్టాయి. నిఫ్టీ ఐదు సెషన్లలో మూడు శాతానికి పైగా కరెక్షన్ సాధించింది. ఈ వారంలో కూడా అవే అంశాలు మార్కెట్ గతిని నిర్ణయించనున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం సెలవు కావడంతో ఈ వారంలో నాలుగు రోజులే మార్కెట్ పనిచేస్తుంది. అమెరికా, ఉత్తర కొరియాల మధ్య యుద్ధం చెలరేగవచ్చునన్న భయాలతో అంతర్జాతీయ మార్కెట్లలో ఇన్వెస్టర్లు అమ్మకాలకు తెగబడ్డారు. ఇక దేశీయ అంశాలకు వస్తే కార్పొరేట్ కంపెనీలు ప్రకటించనున్న ఫలితాలు, రుతుపవనాల పురోగతి ప్రధానం కానున్నాయి. ఈ వారంలో కోల్ ఇండియా, గ్రాసిమ్, టాటా పవర్ కంపెనీ ఆర్థిక ఫలితాలు ప్రకటించనున్నాయి. భారత వాతావరణ శాఖ తాజా నివేదిక ప్రకారం ఈ నెల 9వ తేదీ నాటికి వర్షపాతం సాధారణ సగటు కన్నా 3 శాతం తక్కువగా ఉంది.

కీలక గణాంకాలివే...

జూలై నెలకు టోకుధరల సూచీ, వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం గణాంకాలు సోమవారం వెలువడనున్నాయి. అమెరికాలో రిటైల్ విక్రయ గణాంకాలు మంగళవారం, ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ తీర్మానాలు, ఇళ్ల అమ్మకాల గణాంకాలు బుధవారం, ఐఐపి గణాంకాలు గురువారం వెలువడనున్నాయి.

టెక్నికల్స్ ఇవే...

అన్ని ప్రధాన ఇండెక్స్‌లు గత వారం దిగజారి కనిష్ఠ స్థాయిల్లో క్లోజ్ కావడం గమనార్హం. నిఫ్టీ 3.53 శాతం, బ్యాంక్ నిఫ్టీ 3.39 శాతం దిగజారాయి. మార్కెట్లో ఆటుపోట్లను సూచించే విఐఎక్స్ ఇండెక్స్ 33 శాతం పెరిగి ఆరు నెలల గరిష్ఠ స్థాయికి చేరింది. నిఫ్టీ ఫ్యూచర్స్ కాంట్రాక్టుల్లో 75 లక్షల షేర్లు చేతులు మారడం బలమైన కరెక్షన్‌కు దారి తీసింది. నిఫ్టీ 9500 పిఇ వద్ద గరిష్ఠ ఓపెన్ ఇంటరెస్ట్ కనిపించింది. 20 లక్షల షేర్లలో ఇది కనిపించగా గరిష్ఠంగా షార్ట్ పొజిషన్లున్నాయి. అలాగే నిఫ్టీ ఎటిఎం/ఒటిఎం కాల్ ఆప్షన్ స్ట్రైక్‌లో కూడా తాజా షార్ట్ పొజిషన్లే అధికంగా నమోదయ్యాయి. ఈ కారణాలన్నింటి ద్వారా చూస్తే ఈ వారంలో కూడా నిఫ్టీలో అమ్మకాల ఒత్తిడి ఉండవచ్చు.

- నిఫ్టీ, బ్యాంక్ నిఫ్టీల గత శుక్రవారం నాటి ముగింపును చూస్తే దోజీ పాటర్న్ ఏర్పడింది. అంటే పుల్‌బ్యాక్‌కు ఆస్కారం ఉంది. బలమైన అవరోధం 9860 వద్ద పునరుజ్జీవానికి ఆస్కారం ఉంది. దోజీ కనిష్ఠ స్థాయి 9865 కన్నా దిగజారినందువల్ల ప్రధాన సెంటిమెంట్ బేరిష్‌గా మారింది.
- బ్యాంక్ నిఫ్టీ 50 డిఎంఎ 23920 కన్నా పైన క్లోజ్ కాగలిగింది. అంతకన్నా పైన నిలదొక్కుకోగలిగితే అర్థవంతమైన పునరుజ్జీవం ఏర్పడవచ్చు.

ఫ్యూచర్ షార్ట్ టర్మ్ ట్రేడింగ్ గైడ్

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ (రూ.1756) - కొనుగోలు స్థాయిలకు చేరువలో..

రూ.1750 ఎగువన అప్‌ట్రెండ్ మొదటి నిరోధం రూ.1800 రెండో నిరోధం రూ.1850
రూ.1740 దిగువన డౌన్‌ట్రెండ్ మొదటి మద్దతు రూ.1700 రెండో మద్దతు రూ.1650

డిజిటల్ లావాదేవీలకు ఊతం నిధుల బదిలీ చార్జీలు తగ్గిస్తున్న బ్యాంకులు

పెద్ద నోట్ల రద్దు తర్వాత దేశవ్యాప్తంగా డిజిటల్ నగదు లావాదేవీలు పెద్ద ఎత్తున దూసుకుపోయిన విషయం తెలిసిందే. అయితే నగదు లభ్యత పెరుగుతున్న కొద్దీ ఈ లావాదేవీల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. ఈ నేపథ్యంలో ప్రజలు డిజిటల్ లావాదేవీల వైపు ఆసక్తి చూపేందుకుగాను పలు ప్రధాన బ్యాంకులు తమ సర్వీసులపై చార్జీలు తగ్గిస్తున్నాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఇటీవలే నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ (నెఫ్ట్), రియల్ టైమ్ గ్రాస్ సెటిల్‌మెంట్ (ఆర్‌టిజిఎస్)లావాదేవీలపై చార్జీలను తగ్గించింది. ఇంటర్నెట్, మొబైల్ బ్యాంకింగ్ ద్వారా జరిపే లావాదేవీలకు ఈ చార్జీలను వర్తింపజేసింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) కూడా తన చార్జీలను సవరించింది.

ఎలక్ట్రానిక్ లావాదేవీలపై బ్యాంకులు వసూలు చేస్తున్న చార్జీలు ఇలా ఉన్నాయి..(రూ..లలో)

ప్రభుత్వరంగ బ్యాంకులు

	నెఫ్ట్		ఆర్‌టిజిఎస్		ఐఎంపిఎస్
	శాఖ	ఆన్‌లైన్	శాఖ	ఆన్‌లైన్	
ఎస్‌బిఐ	2.50-25	1-5	25-50	5-10	5-15
బ్యాంక్ ఆఫ్ బరోడా	2.50-25	0	25-55	25-55	అందుబాటులో లేదు
బ్యాంక్ ఆఫ్ ఇండియా	2.50-25	2.50-5	0-50	5వరకు	2.50-5
పంజాబ్ నేషనల్ బ్యాంక్	2.50-25	2.50-25	25-55	25-45	5-25
కెనరా బ్యాంక్	2.50-25	2.50-25	27-55	27-55	5-10

ప్రైవేటు బ్యాంకులు

	నెఫ్ట్		ఆర్‌టిజిఎస్		ఐఎంపిఎస్
	శాఖ	ఆన్‌లైన్	శాఖ	ఆన్‌లైన్	
ఐసిఐసిఐ బ్యాంక్	2.50-25	2.50-25	25-50	25-50	5-15
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్	2.50-25	2.50-25	25-50	25-50	5-15
యాక్సిస్ బ్యాంక్	2.50-25	2.50-25	25-50	25-50	5-15
కోటక్ మహీంద్రా బ్యాంక్	2.50-25	నిల్	25-50	నిల్	5-15
యెస్ బ్యాంక్	2.50-25	నిల్	25-50	నిల్	5



నెఫ్ట్ : ఒక బ్యాంకు ఖాతాదారు తన బ్యాంకు వెబ్‌సైట్ ద్వారా ఇంటర్నెట్ బ్యాంకింగ్ సేవలను పొందవచ్చు. నెఫ్ట్ ద్వారా ఒక బ్యాంకు ఖాతా నుంచి మరో బ్యాంకు ఖాతాకు నగదును బదిలీ చేయవచ్చు. నెఫ్ట్ ద్వారా ఒక్కో లావాదేవీ కింద 50,000 రూపాయల వరకు బదిలీ చేయవచ్చు. ఇందుకు గరిష్ఠంగా వసూలు చేసే చార్జీ 25 రూపాయలు. జిఎస్‌టి అదనం.

ఆర్‌టిజిఎస్ : దీన్ని ఎక్కువ మొత్తంలో నగదు బదిలీ కోసం వినియోగిస్తారు. దీని ద్వారా కనీసం 2 లక్షల రూపాయలు బదిలీ చేయాల్సి ఉంటుంది. 30 నిమిషాల్లో నిధుల బదిలీ జరుగుతుంది. ఆర్‌టిజిఎస్ లావాదేవీలపై గరిష్ఠంగా 55 రూపాయలు మాత్రమే చార్జీ వసూలు చేయాల్సి ఉంటుంది. జిఎస్‌టి అదనం.

ఐఎంపిఎస్ : ఐఎంపిఎస్‌ను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ (ఎన్‌పిసిఐ) అమలు చేసింది. నెఫ్ట్, ఆర్‌టిజిఎస్ ద్వారా లావాదేవీలను ఇంటర్నెట్, మొబైల్ బ్యాంకింగ్ ద్వారానే కాకుండా బ్యాంకు శాఖల ద్వారానూ జరపవచ్చు. అయితే ఐఎంపిఎస్ కోసం బ్యాంకు శాఖలకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఐఎంపిఎస్ ద్వారా రోజులో ఎప్పుడైనా వెంటనే నగదును పంపించవచ్చు. అయితే ఒక రోజులో రెండు లక్షల రూపాయలకు మించి నగదును ట్రాన్స్‌ఫర్ చేయడానికి అవకాశం ఉండదు. ఐఎంపిఎస్‌పై బ్యాంకులు చార్జీలను నిర్ణయించే అధికారం ఉంది.

ఇన్వెస్టర్ల కోసం ప్రభుత్వం భారత్-22 పేరుతో మరో ఇటిఎఫ్ పథకం ప్రకటించింది. ఇంతకీ ఈ పథకం విశేషాలు ఏమిటి? పెట్టుబడి లాభాల కోసం రిటైల్ ఇన్వెస్టర్లు ఈ పథకంలో ఇన్వెస్ట్ చేయవచ్చా ? లేదా ?



భారత్-22 ఇటిఎఫ్‌లో పెట్టుబడి పెట్టొచ్చా?

కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సిపిఎస్‌యు ఇటిఎఫ్ పేరుతో ఒక ఇటిఎఫ్ పథకం నిర్వహిస్తోంది. ఇపుడు కొత్తగా భారత్-22 పేరుతో మరో కొత్త పథకం ప్రారంభిస్తోంది. ఇందులో బ్లూచిప్ కంపెనీలుగా పేరొందిన కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని 22 కంపెనీల షేర్లు ఉంటాయి. ఇవన్నీ ఏటా లాభాలు ఆర్జిస్తూ, డివిడెండ్లు పంచుతున్న కంపెనీలే. 2014, మార్చిలో ప్రారంభించిన సిపిఎస్‌ఇ ఇటిఎఫ్ పథకం ద్వారా ప్రభుత్వం ఇప్పటికే మూడు విడతలుగా రూ.8,500 కోట్లు సమీకరించింది. గత ఏడాది కాలంలో ఈ పథకం ఇన్వెస్టర్లకు దాదాపు 20 శాతం రాబడులు పంచింది. ఈ స్ఫూర్తితో ప్రభుత్వం భారత్-22 పేరుతో మరో ఇటిఎఫ్ పథకం తీసుకొస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థల పెట్టుబడుల ఉపసంహరణ (డిజిన్వెస్ట్‌మెంట్) ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం రూ.72,500 కోట్లు సమీకరించాలన్న లక్ష్య సాధనకూ ఇది ఉపయోగపడుతుందని భావిస్తోంది.

ముఖ్యాంశాలు..

ఈ ఇటిఎఫ్‌లో కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని ఒఎన్‌జిసి, ఐఒసి, ఎస్‌బిఐ వంటి 22 బ్లూచిప్ కంపెనీల షేర్లు ఉంటాయి. ప్రభుత్వానికి పాక్షికంగా వాటా ఉన్న యాక్సిస్ బ్యాంక్, ఐటిసి, ఎల్ అండ్ టి వంటి కంపెనీల షేర్లనూ భారత్-22 ఇటిఎఫ్ పోర్టుఫోలియోలో చేర్చారు. ఇంకా ప్రభుత్వానికి చెందిన యుటిఐ నిర్వహణలోని కొన్ని ప్రత్యేక కంపెనీ (ఎస్‌యుయుటిఐ)ల షేర్లనూ ఈ జాబితాలో చేర్చారు. ఈ ఇటిఎఫ్ బిఎస్‌ఇ, ఎన్‌ఎస్‌ఇల్లో లిస్టవుతుంది. పోర్టుఫోలియోలోని 22 కంపెనీల షేర్ల ధరల్లో మార్పులకు అనుగుణంగా భారత్-22 ఇటిఎఫ్ ఎన్‌ఎవి మారుతుంటుంది.

ఫండ్ మేనేజర్..

ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఎఎంసి) భారత్-22 ఇటిఎఫ్ పథకానికి ఫండ్ మేనేజర్‌గా వ్యవహరిస్తుంది. ఆసియా ఇండెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఇండెక్స్ ప్రొవైడర్‌గా సేవలు అందిస్తుంది.

పెట్టుబడులు..

'భారత్-22 ఇటిఎఫ్ ద్వారా సమీకరించిన నిధులను ఇంధన, ఆర్థిక, ఎఫ్ఎంసిజి, ఇండస్ట్రియల్, యుటిలిటీస్ రంగాలకు చెందిన కంపెనీల షేర్లలో ఇన్వెస్ట్ చేస్తారు. అయితే ఏ ఒక్క రంగానికి చెందిన కంపెనీల షేర్లలో మొత్తం పెట్టుబడుల్లో 20 శాతానికి మించి ఇన్వెస్ట్ చేయరు. అలాగే మొత్తం పెట్టుబడుల్లో ఏ ఒక్క కంపెనీ షేర్లలో 15 శాతానికి మించకుండా జాగ్రత్త పడతారు. దీనివల్ల రాబడుల వృద్ధి, స్థిరత్వం మధ్య సమతూకం ఏర్పడుతుంది. ఇలాంటి పెట్టుబడి వ్యూహంతో మార్కెట్లో తీవ్ర ఆటుపోట్లు ఏర్పడినా ఇటిఎఫ్ ఎన్‌ఎవిలో పెద్ద మార్పులు ఉండవని మార్కెట్ వర్గాల అంచనా. ఈ సౌలభ్యంతో పెట్టుబడులకు పెద్దగా ఢోకా లేకుండా సురక్షిత రాబడుల కోసం చూసే పెన్షన్ ఫండ్స్ కూడా భారత్-22 ఇటిఎఫ్‌లో ఇన్వెస్ట్ చేసేందుకు ముందుకు వస్తాయని భావిస్తున్నారు.

సిపిఎస్‌ఇ ఇటిఎఫ్ పనితీరు..

గత ఏడాది కాలంలో సిపిఎస్‌ఇ ఇటిఎఫ్ పథకం ఇన్వెస్టర్లకు 20 శాతానికి పైగా లాభాలు పంచింది. ఈ సంవత్సరం మార్చి నెలలోనూ ప్రభుత్వం ఐదు శాతం డిస్కౌంట్‌తో రూ.26.80 దగ్గర ఇన్వెస్టర్లకు యూనిట్లు కేటాయించింది. అదే నెలలో ఈ యూనిట్లు రూ.27.60 దగ్గర లిస్టయ్యాయి. మధ్యలో కొన్ని రోజులు ఆఫర్ ధర కంటే తక్కువకి కోట్ అయినా, తర్వాత కోలుకుంది. ప్రస్తుతం మార్కెట్ బేర్ ఆపరేటర్ల పట్టులో ఉన్నా ఈ యూనిట్లు ప్రస్తుతం రూ.27.26 దగ్గర ట్రేడవుతున్నాయి. భారత్-22 ఇటిఎఫ్ ప్రకటన వెలువడిన తర్వాత సిపిఎస్‌ఇ ఇటిఎఫ్ యూనిట్ల ఎన్‌ఎవి పది శాతానికిపైగా పెరిగింది.

సబ్‌స్క్రిప్షన్..

ప్రభుత్వం భారత్-22 ఇటిఎఫ్ పథకం వివరాలు వెల్లడించినా ఎపుడు మార్కెట్‌కు వచ్చేది ఇంకా ప్రకటించ లేదు. మొత్తం మీద త్వరలోనే ఈ పథకం మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉంది. 2017, మార్చిలో సిపిఎస్‌ఇ ఇటిఎఫ్ మూడో విడత యూనిట్లకు దరఖాస్తు చేసిన వారికి ఇచ్చినట్టే భారత్-22 ఇటిఎఫ్ దరఖాస్తుదారులకీ ఆఫర్ ధరలో ఐదు శాతం వరకు రాయితీ ఉంటుందని భావిస్తున్నారు.

పెట్టుబడి పెట్టొచ్చా?

భారత్-22 ఇటిఎఫ్ కింద సమీకరించే నిధులను ఫండ్ మేనేజర్ నిర్దేశిత 22 కంపెనీల షేర్లలో మాత్రమే ఇన్వెస్ట్ చేయాలి. ఎంత మంచి అవకాశాలున్నా ఆ పరిధి దాటేందుకు అవకాశం ఉండదు. అదే ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్... ఫండ్ మేనేజర్లను తీసుకుంటే వారు ఎక్కడ పెట్టుబడి అవకాశం కనిపిస్తే ఆ కంపెనీల షేర్లలో ఇన్వెస్ట్ చేయవచ్చు. 2014, మార్చిలో సిపిఎస్‌ఇ ఇటిఎఫ్ ప్రారంభించే వరకు ఈ జాబితాలోని కంపెనీల షేర్లన్నీ స్టాక్ మార్కెట్లో చతికిల పడినవే. సిపిఎస్‌ఇ ఇటిఎఫ్ ప్రారంభంలోనే ఇన్వెస్టర్లు ఎగబడి మరీ సబ్‌స్క్రైబ్ చేశారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా గత మూడేళ్లలో ఈ పథకం ఇన్వెస్టర్లకు అదే స్థాయిలో రాబడులు పంచింది. ఈ రాబడులు ఇండెక్స్‌ల కంటే ఎక్కువగానే ఉన్నాయి. భారత్-22 ఇటిఎఫ్ కూడా అదే స్థాయిలో రాబడులు పంచుతుందని అంచనా. అయితే ఈ పథకం పూర్తి వివరాలు వెల్లడైతేగానీ దీనిపై ఒక అభిప్రాయానికి రాలేం.




రిస్క్..

పైకి బాగానే కనిపిస్తున్నా భారత్-22 ఇటిఎఫ్ పోర్టుఫోలియో పెట్టుబడుల్లో 50 శాతం నిధులను ఎల్ అండ్ టి, ఐటిసి, ఎస్‌బిఐ, పవర్ గ్రిడ్, యాక్సిస్ బ్యాంక్ షేర్లలో మాత్రమే ఇన్వెస్ట్ చేస్తారు. రంగాల వారీగా చూసినా 90 శాతం పెట్టుబడులు ఐదు రంగాలకు చెందిన కంపెనీల షేర్లలో ఇన్వెస్ట్ చేస్తున్నారు. ఏవైనా అవాంతరాలు ఏర్పడి ఆ రంగాలు దెబ్బతింటే, ఇన్వెస్టర్ల రాబడులు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల్లో కొద్ది భాగాన్నే భారత్-22 ఇటిఎఫ్‌లో ఇన్వెస్ట్ చేయడం మంచిది.

భారత్-22 ఇటిఎఫ్ పోర్టుఫోలియోలో ఉండే కంపెనీల షేర్లు

కంపెనీ పేరు	పెట్టుబడుల శాతం
నాల్కో	4.4
ఒఎన్‌జిసి	5.3
ఐఒసి	4.4
బిపిసిఎల్	4.4
కోల్ ఇండియా	3.3
ఎస్‌బిఐ	8.6
యాక్సిస్ బ్యాంక్	7.7
బ్యాంక్ ఆఫ్ బరోడ	1.4
ఆర్ఇసి	1.3
పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్	1.0
ఇండియన్ బ్యాంక్	0.2
ఐటిసి	15.2
ఎల్ అండ్ టి	17.1
భారత్ ఎలక్ట్రానిక్స్	3.3
ఇంజినీర్స్ ఇండియా	1.5
ఎన్‌బిసిసి(ఇండియా)లిమిటెడ్	0.6
పవర్ గ్రిడ్ కార్పొరేషన్	7.9
ఎన్‌టిపిసి	6.7
గెయిల్ ఇండియా	3.7
ఎన్‌హెచ్‌పిసి	1.2
ఎస్ఎల్‌సి ఇండియా లిమిటెడ్	0.3
ఎస్‌జెవిఎన్ లిమిటెడ్	0.2



ఇన్వెస్టర్ల సొమ్ము గల్లంతేనా ?

వాన రాకడ, ప్రాణం పోకడ ఎవరికి తెలియదు. డొల్ల కంపెనీల షేర్లలో ఇన్వెస్ట్ చేసిన ఇన్వెస్టర్లదీ ప్రస్తుతం ఇదే పరిస్థితి. బుల్ షేర్లనే నమ్మకంతో రిటైల్ ఇన్వెస్టర్లతో పాటు ఎఫ్‌పిఐలు, మ్యూచువల్ ఫండ్స్, బీమా కంపెనీలూ ఈ షేర్లలో ఇన్వెస్ట్ చేశాయి. సెబి డొల్ల కంపెనీలుగా ప్రకటించిన 331 కంపెనీ జాబితాలో ఎస్‌క్యుఎస్ బిఎఫ్‌ఎస్‌ఐ వంటి బహుళ జాతి కంపెనీతో పాటు జెకె ఇన్‌ఫ్రా, పిన్‌కాన్ వంటి ప్రముఖ కంపెనీలూ ఉండడం ఇన్వెస్టర్లను విస్మయపరుస్తోంది. సెబి డొల్ల కంపెనీలుగా పేర్కొన్న కొన్ని కంపెనీల ఈక్విటీలో దాదాపు 95 శాతం షేర్లు రిటైల్ ఇన్వెస్టర్ల దగ్గరే ఉంది. దీన్ని బట్టి ఈ కంపెనీల ప్రమోటర్లు, బ్రోకర్లు ఇన్వెస్టర్లకు ఎంతగా టోపీ పెట్టారో అర్థం చేసుకోవచ్చు.

తొందరపడొద్దు...

ప్రస్తుతం ఈ 331 కంపెనీలకు చెందిన షేర్లు కొన్న ఇన్వెస్టర్ల ముందు ఉన్న మార్గాలు పరిమితమనే చెప్పాలి. సెబి ఈ కంపెనీల షేర్లపై ఇంత ఆకస్మికంగా నిర్ణయం తీసుకుంటుందని ఎవరూ ఊహించలేదు. పెద్ద మొత్తంలో ఈ కంపెనీల షేర్లు కొన్న ఇన్వెస్టర్లకు నిద్ర కూడా కరువైంది. ఇపుడు ఈ షేర్లను అమ్మాలన్నా పెద్ద సమస్యే. ప్రతి నెల ఒక రోజు అదీ మొదటి సోమవారం మాత్రమే స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ఈ షేర్ల ట్రేడింగ్‌ను అనుమతిస్తారు. మళ్లీ అందులోనూ సవాలక్ష ఆంక్షలు. గత క్లోజింగ్ ధరకు మించి ఈ షేర్ల ధర పెరిగేందుకు అవకాశం లేదు. ఇన్ని ఆంక్షలను తట్టుకుని ఎవరైనా ఈ షేర్లు కొనేందుకు ముందుకు వచ్చినా, ట్రేడింగ్ వాల్యూకి రెట్టింపు మొత్తం డిపాజిట్ చేయాలి. ఇవన్నీ చూస్తుంటే డొల్ల కంపెనీల ముద్ర పడిన కంపెనీల షేర్లు కొనేందుకు అసలు ఎవరైనా ముందుకు వస్తారా? అనే సందేహం తలెత్తుతోంది. అలా అని భయపడి ఇన్వెస్టర్ల చేతిలో ఉన్న షేర్లను ఏదో ఒక ధరకు అమ్మి నష్టాలు మూటకట్టుకోవాల్సిన అవసరమూ లేదు. స్పెక్యులేటర్లయితే తప్ప, చాలా మంది ఇన్వెస్టర్లు ఈ కంపెనీల షేర్లను కొద్దో గొప్పో ఫండమెంటల్స్ చూసే కొని ఉంటారు. సెబి కూడా కంపెనీ వ్యవహారాల శాఖ సిఫారసుపైనే ఈ కంపెనీలను డొల్ల కంపెనీలని ముద్ర వేసిన విషయాన్ని మర్చిపోవద్దు. నిజానికి ఇందులో కొన్ని కంపెనీలు డొల్ల కంపెనీలు కాకపోవచ్చు. డొల్ల కంపెనీలని స్టాంప్ పడినా, మంచి ఫండమెంటల్ ఉన్న కంపెనీల షేర్లను తొందరపడి అమ్ముకోవద్దు.

గ్రే మార్కెట్ జోలికి పోవద్దు..

సెబి ఆదేశాలతో ఈ కంపెనీల షేర్లలో రోజువారీ ట్రేడింగ్ నిలిచిపోయింది. ఇక నెలకు ఒక రోజు, అదీ తొలి సోమవారం మాత్రమే ఈ షేర్లలో ట్రేడింగ్ జరుగుతుంది. ఎవరైనా కొనాలనుకున్నా ట్రేడింగ్ వాల్యూకి రెట్టింపు మొత్తాన్ని డిపాజిట్ చేయాలి. దీంతో ఈ కంపెనీల షేర్ల ధర మరింత క్షీణించే ప్రమాదం ఉంది. దీన్ని అవకాశంగా చేసుకుని కొంత మంది కేటుగాళ్లు డొల్ల కంపెనీలని స్టాంప్ పడినా, మంచి ఫండమెంటల్స్ ఉన్న కంపెనీల షేర్లను చౌకగా కొట్టేసేందుకు షేర్ హోల్డర్లను ఆశ్రయిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇలా అమ్మిన విషయం బయటపడితే రెగ్యులేటరీ సంస్థలు మీపైనా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. కంపెనీ ఫండమెంటల్స్ ఏ మాత్రం బాగోలేదని పక్కాగా తెలిస్తే తప్ప, నెలకి ఒకసారి జరిగే ట్రేడింగ్‌లోనూ మీ దగ్గర ఉన్న షేర్ల అమ్మకానికి తొందరపడకూడదు.

భయపడొద్దు..

వీటిలో కొన్ని కంపెనీలు సక్రమంగానే వ్యాపారాలు చేస్తూ ఎప్పటికపుడు నిబంధనలకు అనుగుణంగా ఆర్ఒసి, స్టాక్ ఎక్స్ఛేంజీలకు రిటర్న్‌లు సమర్పిస్తున్నాయి. సాట్ ముందు ఈ కంపెనీల వాదనలో వాస్తవం ఉందని భావిస్తే సెబి నిషేధం తొలిగిపోయే అవకాశం ఉంది. కాబట్టి ఇన్వెస్టర్లు వేచి చూడటం మంచిది

గుణపాఠం..

ఏదేమైనా ఈ మొత్తం వ్యవహారం స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లకు కొత్త గుణపాఠం చెబుతోంది. ఎవరో ఏదో చెప్పారని లేదా ఫలానా బ్రోకరేజ్ సంస్థ రికమండ్ చేసిందని కాకుండా కంపెనీ పాలనా వ్యవహారాలు పద్ధతిగా ఉండే కంపెనీల షేర్లలోనే ఇన్వెస్ట్ చేయాలి. ఇవేవీ మాకు తెలియవనుకుంటే మంచి రాబడులు ఇస్తున్న ఏదో ఒక ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ పథకంలో మదుపు చేసుకుని నిశ్చింతగా ఉండడం మేలు. లేకపోతే డబ్బూ పోయి శని పట్టినట్టవుతుంది.

ఆర్థిక స్వాతంత్య్రం లభించాలంటే..

'ఆర్థిక భద్రత, స్వాతంత్య్రం లేని చోట నిజమైన వ్యక్తిగత స్వేచ్ఛ ఉండదు' అని ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ ఎప్పుడో చెప్పారు. ప్రస్తుతం మన దేశ ప్రజల ఆర్థిక పరిస్థితి చూస్తే ఇది ఎంత నిజమో అర్థమవుతుంది. ఏళ్ల పోరాటం, ఎంతో మంది మహామహుల ప్రాణత్యాగం ఫలితంగా దేశానికి స్వాతంత్య్రం సిద్ధించింది. రేపు మనమంతా 70వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని జరుపుకోనున్నాం. వలస పాలన నుంచి స్వాతంత్య్రం పొందడానికి అనేక రకాల వ్యూహాలు అనుసరించారు మన స్వాతంత్య్ర సమరయోధులు. ఇవన్నీ భారత పౌరులకు అవగతమే. ఆర్థికంగా స్వాతంత్య్రం పొందడానికి కూడా వ్యక్తులు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తే తమ లక్ష్యాన్ని చేరుకోవడం ఎంతో సులభం. ఫలితంగా జీవితం సాఫీగా సాగిపోతుంది. అదెలాగంటే..

అస్తమానం డబ్బు గురించి ఆందోళన వద్దు..

డబ్బు చేతిలో లేని సమయంలో ఎప్పుడూ దాని గురించే ఆలోచిస్తుంటారు చాలామంది. ఇలాంటి ఆలోచనతో కాలం గడిపేస్తే వచ్చే ప్రయోజనం శూన్యం. అందుకే ఈ రకం ఆలోచనలను మనసులోంచి తీసివేయడం ఆర్థిక స్వాతంత్య్రం సాధించడంలో ముఖ్యమైన అంశం. గతంలో చేసిన తప్పుల గురించి చింతిస్తూ.. భవిష్యత్‌లో ఆర్థిక పరిస్థితి ఇంకా ఎంత ఘోరంగా ఉంటుందోనని మదన పడుతుండటం వల్ల అడుగు ముందుకుపడదు. ఇదేజరిగితే విలువైన కాలం కరిగిపోయి ఆర్థిక స్వాతంత్య్రం పొందడం మరింత కష్టంగా మారిపోతుంది.



ఆర్థిక లక్ష్యాల నిర్దేశం..

భవిష్యత్‌కు సంబంధించిన ఆర్థిక లక్ష్యాలను ముందే నిర్దేశించుకోవడం మంచిది. పదవీ విరమణ, ఇంటి కొనుగోలు, పిల్లల పెళ్లిళ్లు వంటి వాటి విషయంలో ఒక స్పష్టతను కలిగి ఉండాలి.

ఆచితూచి షాపింగ్..

స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని డిస్కౌంట్లు, ఆఫర్ల హోరు మొదలైంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విపరీతంగా ఆఫర్లను ఇస్తున్నారు. తక్కువ ధరకు వస్తున్నాయి కదా అని చాలా మంది అవసరం లేని ఉత్పత్తులను కూడా కొనేస్తుంటారు. ఫలితంగా బడ్జెట్ కట్టుతప్పుతుంది. అందుకే అవసరం ఉన్న ఉత్పత్తుల జాబితాను ముందుగా తయారు చేసుకోవాలి. తర్వాత అలాంటి వాటిపై ఎంత మేరకు ఆఫర్లు లభిస్తున్నాయో చూసుకుని కొనుగోళ్లు చేస్తే కొన్ని ఖర్చులనైనా తగ్గించుకోవచ్చు.

పొదుపే మంత్రం..

రోజుకు రూపాయి పొదుపు చేసినా నెల రోజులు తిరిగే సరికి రూ.30 అవుతుంది. అదే రూ.100 అయితే నెలకు రూ.3,000, ఏడాదికి రూ.36,000 అవుతుంది. ఇలా తెలియకుండానే పెద్దమొత్తంలో సొమ్ము జమ అవుతుంది. ఇలాంటి సొమ్ము అత్యవసర సమయంలో ఆపద్బాంధవుడిగా ఆదుకుంటుంది. అందుకే పొదుపు మీరు పాటిస్తూనే మీ పిల్లలకూ నేర్పండి. మీ అవసరాలు తీరగా మిగిలిన మొత్తాన్ని స్టాక్ మార్కెట్ లేదా మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టడం ద్వారా సంపదను వృద్ధి పరచుకోవచ్చు. ఫలితంగా మీకు ఆర్థిక స్వాతంత్య్రం త్వరగానే వస్తుంది.

ఆరోగ్య ఖర్చులపై జాగ్రత్త..

నేటి కాలంలో ఏ వ్యాధులు ఎప్పుడు అంటుకుంటాయో చెప్పడం కష్టం. ఆరోగ్యపరంగా ఎన్నిరకాల జాగ్రత్తలు తీసుకున్నా దురదృష్టవశాత్తు ఏదైనా వ్యాధి సోకితే చేతి చమురు వదులుతుంది. చిన్న రోగానికి చికిత్స చేయించుకున్నా లక్షల్లో బిల్లులు చెల్లించే పరిస్థితి నెలకొంది. ఇలాంటప్పుడు మొత్తం కుటుంబ ఆర్థిక పరిస్థితే తలకిందులవుతుంది. అందుకే ఆరోగ్య బీమాను నిర్లక్ష్యం చేయవద్దు. బీమా కోసం చెల్లించే మొత్తం తక్కువే అయినా చాలా మంది దీనికి అంతగా ప్రాధాన్యం ఇవ్వరు. అయితే ఇలాంటి బీమానే ఆపత్కాలంలో ఆదుకుంటుందన్న విషయం మరవొద్దు. ఆరోగ్య బీమా రక్షణను కొనసాగించడం వల్ల ఆర్థిక స్వాతంత్య్రం సాధించడం మరింత సులభతరం అవుతుంది.

సమీక్ష..

ఆర్థిక స్వాతంత్య్రాన్ని సాధించడం అనేది ఓ సుదూర ప్రయాణంలాంటిది. మీ లక్ష్యాన్ని సాధించేందుకు చేసే పెట్టుబడులు, పొదుపు, ఆస్తుల కొనుగోలు వంటి వాటిని కొంత కాలం తర్వాత సమీక్షించుకోవాలి. అవసరం అయితే మీ ఆలోచనల్లో మార్పులు చేసుకోవాలి. మీ సొమ్మును ఏదో ఒక రంగానికే పరిమితం చేయకుండా విభిన్న రంగాలకు విస్తరించడం వల్ల అనుకోని ఉపద్రవాలు ఎదురైనా మీ లక్ష్యం చెక్కు చెదరకుండా ఉంటుంది.

సో.. ఈ స్వాతంత్య్ర దినోత్సవం నుంచైనా మీరు మీ ఆర్థిక స్వాతంత్య్రం గురించి ఆలోచించడం మొదలుపెట్టండి. బెస్ట్ ఆఫ్ లక్..

బీమాకు రైతన్న దూరం!

- లక్షన్నరే ప్రీమియం చెల్లించారు
- వరి తప్ప మిగతా పంటలకు ముగిసిన గడువు
- కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం నెరవేరేనా?
- బీమా పరిధిలోని పత్తి రైతులు 10 శాతమే

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పంట రుణాల మంజూరులో జాప్యం.. శాస్త్రీయత లేని తుది గడువుతో ఈ ఏడాదీ లక్షలాది మంది రైతులు పంటల బీమా సదుపాయానికి దూరమవుతున్నారు. వరి మినహా అన్నిపంటలకూ బీమా ప్రీమియం చెల్లింపునకు తుదిగడువు ముగిసినా ఇంత వరకు దాని పరిధిలోకి వచ్చిన రైతులు లక్షన్నరలోపే ఉన్నారని వ్యవసాయ శాఖ వర్గాల సమాచారం. ఈ ఏడాది ఖరీఫ్ పంటల విస్తీర్ణంలో కనీసం 40% పంటలను బీమా పరిధిలోకి తీసుకురావాలని సీజన్ ప్రారంభానికి ముందే రాష్ట్రాలకు కేంద్రం ఆదేశించిది. దాని ప్రకారం ఖరీఫ్‌లో 4.30 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలోని పంటలు బీమాపరిధిలోకి రావాలి. రాష్ట్రంలో చిన్న, సన్నకారు రైతులే 80 శాతానికి పైగా ఉన్నారు. రాష్ట్రంలో రైతుకు సరాసరి 1.12 హెక్టార్లు ఉన్నాయని 2010-11నాటి గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుత అంచనాల ప్రకారం సగటున ఒక హెక్టారు ఉందనుకున్నా కేంద్రం ఆదేశాల ప్రకారం 4 లక్షల మందికి పైగా రైతులు బీమా పరిధిలోకి రావాల్సి ఉంది. వరి మినహా అన్ని పంటలకూ జూలై 31తో ప్రీమియం చెల్లించే గడువు ముగిసింది. అయితే ఆ తేదీకి పంటల బీమా పథకాల కింద ప్రీమియం చెల్లించిన రైతుల సంఖ్య లక్షన్నరకు మించని పరిస్థితి. ఇందులోనూ లక్షకుపైగా రైతులు పత్తి సాగు చేస్తున్నవారే. వరికి ప్రీమియం చెల్లింపు గడువు పక్షం రోజులు మాత్రమే ఉంది. కాగా, ఇప్పటివరకు సాగైన ఖరీఫ్ పంటల్లో దాదాపు సగం విస్తీర్ణంలో పత్తే ఉంది. పత్తి సాగు చేస్తున్న రైతులు 10 లక్షల మందికి పైగానే ఉంటారని వ్యవసాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి. కానీ, పత్తికి బీమా ప్రీమియం చెల్లించిన రైతులు 10%కు మించి లేరని అధికారులు అంటున్నారు. ఇక వరికి ప్రీమియం చెల్లించడానికి పక్షం రోజులు మాత్రమే మిగిలి ఉంది. కేంద్రం నిర్దేశించిన లక్ష్యంలో సగానికి కూడా చేరుకోవడం అనుమానమేనని వ్యవసాయ వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. గడువు పెంచినా పెద్దగా ప్రయోజనం ఉండదంటున్నారు.

తుంగలో దొంగ



కర్ణాటక తొండి.. నీటి తీరువా ఉల్లంఘన
ఆలమట్టిలాగే తుంగభద్ర ఎగువనా భారీగా లిఫ్టులు

- 290 టీఎంసీలకు అదనంగా 90 టీఎంసీల వాడకం
- ఫలితంగా దిగువకు చుక్కరాని పరిస్థితి
- శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల వెలవెల
- నల్లగొండ, హైదరాబాద్‌కు తాగునీటి గండం

హైదరాబాద్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కృష్ణా ఆయకట్టు రైతులకు మరింత కష్టకాలం! ఈ ఖరీఫ్ సీజన్‌పై ఆశలు వదిలేసుకోవాలేమో! ఎందుకంటే.. దిగువకు చుక్క నీరు రాకుండా కర్ణాటక జల దోపిడీకి తెర తీసింది. ఎగువన పుష్కలంగా వర్షాలు పడి కర్ణాటకలోని ఆలమట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులు నిండితే తుంగభద్ర ద్వారా శ్రీశైలం, నాగర్జునసాగర్‌లోకి వరద నీరు వచ్చేది. అందుకే సాగర్ కింద ఖరీఫ్ సీజన్‌కు నీటిని విడుదల చేసే గడువు ముగిసినా రైతాంగం ఇప్పటికీ ఎగువన వర్షాలు పడి తమకు సాగునీరు అందుతుందనే ఆశతోనే ఉన్నారు. అయితే.. ఎగువన ఆలమట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులు ఇప్పటికే పూర్తిగా నిండాయి. అయినా నీటిని కర్ణాటక దిగువకు వదలడం లేదు. ఈ ప్రాజెక్టులకు ఎగువ, దిగువ లిఫ్టులు ఏర్పాటు చేసి భారీగా నీటిని మళ్లిస్తోంది. తుంగభద్ర బేసిన్ నుంచి కూడా కర్ణాటక ప్రభుత్వం భారీగా నీటిని ఎగువకు తరలిస్తున్నట్టు తెలంగాణ రాష్ట్ర జల విభాగం అధికారులు గుర్తించారు. దీంతో శ్రీశైలం రిజర్వాయర్‌లోకి నీరు రావడానికి ఆలమట్టి, తుంగభద్ర ప్రాజెక్టుల ద్వారా ఉన్న మార్గాలు మూసుకుపోయి చుక్క నీరు రావడం లేదు. దీంతో తెలంగాణలోని కృష్ణా ఆయకట్టు మనుగడే ప్రమాదంలో పడింది. కర్ణాటక ప్రభుత్వం తుంగభద్ర ఎగువలో భద్ర రిజర్వాయర్ ద్వారా 61 టీఎంసీలు, ఆనకట్ట ద్వారా 3 టీఎంసీలు, తుంగప్రాజెక్టు ద్వారా 11 టీఎంసీలు, అంజన్‌పుర నుంచి 2 టీఎంసీలు, హంగిబొమ్మ నుంచి 2 టీఎంసీలు, విజయనగరి నుంచి 6 టీఎంసీలు, మైనర్ ఇరిగేషన్ నుంచి 61 టీఎంసీలను ఉపయోగించుకుంటోంది. దీన్ని లెక్కిస్తే ట్రిబ్యూనల్‌తీర్పులో కర్ణాటకకు కేటాయించిన నీరుకంటే ఎక్కువగానే ఉపయోగించుకుంటున్నట్టు తెలుస్తోంది.

నికర జలాల కోటాకన్నా ముందే..

తుంగభద్ర ప్రధాన కాల్వలపైన, ఎగువ ప్రాంతంలోని తుంగ, భద్ర నదుల ఆధారంగా అనేక చిన్న లిఫ్టు స్కీంలను ఉపయోగించి కర్ణాటక భారీగా నీటిని మళ్లిస్తున్నట్టు తెలుస్తోంది. తుంగభద్ర బేసిన్‌లో కూడా కర్ణాటక ప్రభుత్వం భారీగా నీటి మళ్లింపునకు పూనుకుంటున్నట్టు రాష్ట్ర జల విభాగం అధికారులు గుర్తించారు. ఈ కారణంగానే ఈ ఏడాది ఇప్పటి దాకా తుంగభద్ర ప్రాజెక్టులోకి చెప్పుకోదగ్గ నీటి ప్రవాహం రావడం లేదు. ప్రస్తుతం ప్రాజెక్టులో 47 టీఎంసీల నీరే ఉంది. తుంగభద్ర ప్రాజెక్టు ద్వారా కర్ణాటకతో పాటు, తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు కూడా నీటిని వాడుకోవాల్సి ఉంది. ఈ ప్రాజెక్టు పరిధిలో కర్ణాటక వాటా 230 టీఎంసీలు. ఏపీ వాటా 70 టీఎంసీలు, తెలంగాణ వాటా 14.5 టీఎంసీలు. ఈ నీరు కాకుండా దిగువకు అంటే శ్రీశైలం ప్రాజెక్టులోకి 70 టీఎంసీలు రావాల్సి ఉంది. తెలంగాణాకు కేటాయించిన 14.5 టీఎంసీల్లో 5 టీఎంసీలకు మించి వాడ లేదు.

వట్టిపోయిన శ్రీశైలం, సాగర్

ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రధాన ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు అడుగునకు చేరాయి. ప్రస్తుత పరిస్థితిని బట్టి సాగునీటి విడుదల మాట అటుంచితే.. నల్లగొండ, హైదరాబాద్‌కు తాగునీటి అవసరాలకూ ప్రమాదం నెలకొంది. ఈ నేపథ్యంలో తాగునీటి అవసరాల కోసం ఆలమట్టి, నారాయణపూర్ రిజర్వాయర్ల నుంచి కనీసం 15 టీఎంసీల నీటినైనా విడుదల చేయాల్సిందిగా కర్ణాటక ప్రభుత్వానికి రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి హరీశ్‌రావు లేఖను రాయాల్సి వచ్చింది.

పంద్రాగస్టుకు జాతీయ జెండా ఎగురవేయనున్న ఐఏఎస్‌లు!

- జిల్లాల సంఖ్య పెరగడంతో అవకాశం

హైదరాబాద్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పంద్రాగస్టుకు జిల్లా కేంద్రాల్లో జాతీయ జెండాను ఈసారి ఐఏఎస్ అధికారులు, ఎమ్మెల్సీలు కూడా ఎగురవేయనున్నారు. సాధారణంగా జిల్లా కేంద్రాల్లో రాష్ట్ర మంత్రులే జాతీయ జెండాను ఎగురవేస్తుంటారు. అయితే రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 31కి పెరగడం, కేబినెట్‌లో సీఎం కేసీఆర్ మినహా 17 మంది మంత్రులే ఉండడంతో మంత్రులు లేని జిల్లాల్లో ఇతరులకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో ఇదే తొలి స్వాతంత్ర్య దినోత్సవం. ఏయే జిల్లాల్లో ఎవరెవరు జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారో తెలుపుతూ ప్రభుత్వం జాబితాను సిద్ధం చేసింది. ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి వరంగల్ అర్బన్ జిల్లాలో, మరో ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ రంగారెడ్డి జిల్లాలో జెండాను ఎగురవేస్తారు. మంత్రులు తుమ్మల ఖమ్మంలో, కేటీఆర్ రాజన్న సిరిసిల్లలో, ఈటల (కరీంనగర్), హరీశ్‌రావు(సిద్దిపేట), నాయిని (మేడ్చల్), ఇంద్రకరణ్‌రెడ్డి(నిర్మల్), పోచారం (నిజామాబాద్), జగదీశ్‌రెడ్డి(సూర్యాపేట), జోగు రామన్న(ఆదిలాబాద్), జూపల్లి(నాగర్ కర్నూల్), సి.లక్ష్మారెడ్డి(మహబూబ్‌నగర్), తలసాని(జోగులాంబ గద్వాల), పి.మహేందర్‌రెడ్డి(వికారాబాద్), టి.పద్మారావు గౌడ్(భద్రాద్రి కొత్తగూడెం)లు జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.



జిల్లా	జెండా ఆవిష్కరించేవారు
జయశంకర్ భూపాలపల్లి	ఎస్.మధుసూదనాచారి (స్పీకర్)
కుమరం భీం ఆసిఫాబాద్	కె.స్వామిగౌడ్ (మండలి చైర్మన్)
మెదక్	పద్మాదేవేందర్‌రెడ్డి (డిప్యూటీ స్పీకర్)
నల్లగొండ	నేతి విద్యాసాగర్ (శాసనమండలి డిప్యూటీ చైర్మన్)
మహబూబాబాద్	బి.పి.ఆచార్య (ఐఏఎస్)
సంగారెడ్డి	బి.ఆర్.మీనా (ఐఏఎస్)
జగిత్యాల	కొప్పుల ఈశ్వర్
యాదాద్రి భువనగిరి	గొంగిడి సునీత
పెద్దపల్లి	పాతూరి సుధాకర్‌రెడ్డి
వరంగల్ రూరల్	పల్లా రాజేశ్వర్‌రెడ్డి
వనపర్తి	ఎస్. నిరంజన్‌రెడ్డి
మంచిర్యాల	నల్లాల ఓదేలు
కామారెడ్డి	గంప గోవర్ధన్
జనగాం	బోడకుంటి వెంకటేశ్వర్లు



ఐఎస్‌వో గుర్తింపు కోసం రూపొందించిన డాక్యుమెంట్లతో మునిసిపల్ చైర్మన్, కమిషనర్

సిద్దిపేటకు ఐఎస్‌వో

- పట్టణ పురపాలక సంఘానికి మరో గుర్తింపు
- తెలంగాణలో తొలి మునిసిపాలిటీగా బెంచ్‌మార్క్
- స్వాతంత్ర్య వేడుకల్లో సర్టిఫికెట్ స్వీకరణకు ఏర్పాట్లు

సిద్దిపేట మున్సిపాలిటీ : ఎన్నో రంగాల్లో ముందుకు దూసుకెళ్తున్న సిద్దిపేట పట్టణం మరోసారి ప్రత్యేక గుర్తింపు పొందింది. తొలిసారి అన్ని విభాగాల్లో కలిపి ఐఎస్‌వో 9001:2015 సర్టిఫికెట్ పొందిన తెలంగాణ తొలి పురపాలక పట్టణంగా చరిత్ర సృష్టించింది. ఎక్కువగా ప్రైవేట్ రంగ సంస్థలు పోటీపడే ఐఎస్‌వో సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేయడమే కాకుండా, దాన్ని సాధించిన ప్రభుత్వరంగ సంస్థగా నిలిచింది. ఈ సర్టిఫికెట్‌ను స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి హరీశ్‌రావు చేతులమీదుగా అందుకునేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆదివారం మునిసిపల్ చైర్మన్ కడవేర్గు రాజనర్సు మాట్లాడుతూ.. పట్టణ ప్రజలందరి సహకారంతో మునిసిపల్ సిబ్బంది కలిసికట్టుగా శ్రమించి ఈ సర్టిఫికెట్‌ను సాధించారని తెలిపారు. ఈ గుర్తింపును కాపాడుకుంటామని, మంత్రి హరీశ్‌రావు సహకారంతో సిద్దిపేటను మరింత మెరుగైన ప్రమాణాలున్న పట్టణంగా తీర్చిదిద్దుతామని అన్నారు. కాగా రాష్ట్రంలోనే ఐఎస్‌వో గుర్తింపు పొందిన తొలి పట్టణం సిద్దిపేట అని మునిసిపల్ కమిషనర్ రమణాచారి అన్నారు.

ఐఎస్‌వో అంటే ..

ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్‌కి సంయుక్త రూపమే ఐఎస్‌వో. ఇది ఒక అంతర్జాతీయ సంస్థ. ప్రభుత్వ లేదా ప్రైవేట్ రంగాలలోని వివిధ శాఖలు, సంస్థలు తమ సేవలను నిర్దేశించిన ప్రమాణాల మేరకు అందిస్తున్నప్పుడు దానిని గుర్తించి ఐఎస్‌వో గుర్తింపు పత్రాన్ని అందిస్తుంది. ఒక సంస్థకు ఐఎస్‌వో గుర్తింపు అనేది ఒక బెంచ్ మార్క్ లాంటిది.

హజ్ యాత్రకు తొలి బృందం సిద్ధం

హైదరాబాద్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పవిత్ర హజ్‌యాత్రకు తొలి బృందం వెళ్లింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన హజ్ యాత్రికులకు నాంపల్లి హజ్‌హౌజ్‌లో వసతి సౌకర్యం కల్పించారు. ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ ఆదివారం రాత్రి 11.30కు హజ్‌హౌజ్‌లో జెండా ఊపి తొలి బృందం బస్సులను ప్రారంభించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి సోమవారం తెల్లవారు జామున 2.50 గంటలకు హజ్ యాత్రికుల తొలి విమానం జెద్దాకు బయల్దేరింది. 465 మంది యాత్రికులతో వెళ్లిన బృందంలో ఇద్దరు హజ్ స్వచ్ఛంద సేవకులున్నారు.

సమస్యలు పరిష్కరించండి: ఎస్‌ఎఫ్‌ఐ

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాఠశాలలు, కాలేజీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని విద్యామంత్రి కడియం శ్రీహరిని ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ కలిసి విజ్ఞప్తి చేసింది. విద్యాసంస్థల్లో సౌకర్యాలు కొరవడి విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వసతి గృహాలకు సరైన భవనాలు లేవని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎం.నాగేశ్వర్‌రావు మంత్రి దృష్టికి తెచ్చారు.

పని చేస్తేనే పదవులు

(మొదటి పేజీ తరువాయి)

బహిరంగ విమర్శలకు పాల్పడితే క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. ఈ మేరకు ఆదివారం గాంధీభవన్‌లో ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ విభాగాలతో సమావేశాలు నిర్వహించారు. ఉదయం పార్టీ సీనియర్ నాయకులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో సమావేశమైన కుంతియా.. మధ్యాహ్నం అధికార ప్రతినిధులతో భేటీ అయ్యారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఆయా సమావేశాల్లో కుంతియా మాట్లాడుతూ.. 2019లో ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని, దీనికోసం నేతలంతా కష్టపడి పనిచేయాలని అన్నారు. రాష్ట్రంలో పరిస్థితులు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నాయని, తెలంగాణను కాంగ్రెస్ ఇచ్చిన విషయాన్ని, ఎవరి కోసం ఇచ్చిందన్న విషయాన్ని గ్రామీణ ప్రజల వరకు తీసుకెళ్లాలన్నారు. రాష్ట్రం కోసం పోరాడింది ఎందుకో, ఆ ఆకాంక్షలు సిద్ధించాయో లేదో ప్రజలను ప్రశ్నించాలని, తద్వారా వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించేలా చేయాలని ఉద్బోధించారు. ఇక పార్టీలో రెండు, మూడు వర్గాలు ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని, అలాంటి అభిప్రాయాలు ఏర్పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత అగ్ర నాయకులదేనని కుంతియా అన్నారు. ముందుగా నాయకులు ఐకమత్యం సాధిస్తే కార్యకర్తల్లో ఉత్సాహం, ఆత్మవిశ్వాసం నిండుతాయన్నారు.

అవినీతిపై గట్టిగా పోరాడాలి..

2019లో గెలవాలంటే అధికార పార్టీపై గట్టి పోరాటం చేయాలని, అవినీతిని మొహమాటం లేకుండా ఖండించాలని పార్టీ నేతలకు కుంతియా సూచించారు. పార్టీ కార్యకర్తలపై నిర్బంధం విషయంలోనూ గట్టి పోరాటం చేయాలన్నారు. కార్యకర్తల్లో పార్టీపై నమ్మకం ఏర్పడినప్పుడే వాళ్లు ఎంతటి త్యాగాలకైనా సిద్ధమవుతారని అన్నారు. రాష్ట్రంలో దళితులు, గిరిజనులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడాలని, ఆ వర్గాలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. వివిధ వర్గాల ప్రజలకు కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, అవి ఎంతవరకు అమలయ్యాయో వివరించి చెప్పాలన్నారు. రిజర్వేషన్ల పేరిట మైనారిటీలకు కేసీఆర్ చేస్తున్న అన్యాయాన్ని ఎండగట్టాలన్నారు. రానున్న ఎన్నికలల్లో పొత్తులకు సంబంధించి ఇప్పుడే ఏమీ మాట్లాడవద్దని కుంతియా అన్నారు. కాంగ్రెస్‌కు ఎవరితోనూ పొత్తు అవసరం లేదని, ఒకవేళ ఏదైనా నిర్ణయం ఉంటే అది అధిష్ఠానం నుంచే వస్తుందని తెలిపారు. ఎంఐఎంతో మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ దోస్తీ అవసరం లేదన్నారు. ఇక పార్టీలో బీసీ సెల్ ఉండగా ఫోరం ఎందుకు తెరపైకి వచ్చిందని ప్రశ్నించినట్లు, దీనికి సంబంధించిన నివేదిక ఇవ్వాలని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరినట్లు తెలిసింది. పార్టీలో అందరికీ సమన్యాయం జరుగుతుందని, కష్టపడే వారికి తప్పకుండా ప్రాధాన్యం లభిస్తుందని చెప్పినట్లు సమాచారం. ఈ సమావేశాల్లో ఉత్తమ్‌తోపాటు మల్లు భట్టి విక్రమార్క, జానారెడ్డి, షబ్బీర్ అలీ, మల్లు రవి, మధుయాష్కి, డీకే అరుణ, గీతారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుద్వేల్‌లో ఐటీ పార్కు

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర శివారు రాజేంద్రనగర్ మండలం బుద్వేల్‌లోని సుమారు 80 ఎకరాల స్థలాన్ని ఐటీ పార్కు అభివృద్ధి కోసం రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల కల్పనా సంస్థ (టీఎస్ఐఐసీ)కు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ప్రస్తుతం గ్రామ అభివృద్ధి అధికారుల శిక్షణ సంస్థ (వీడీవోటీసీ) స్వాధీనంలో సుమారు 254 ఎకరాలకు పైగా ఖాళీ స్థలాలుండగా, ఇందులో 80 ఎకరాల స్థలాన్ని ఐటీ పార్కు కోసం వినియోగించనున్నారు.

జంతువుల ఎముకలతో నూనె

- సీడ్ కంపెనీ మాటున కల్తీ దందా
- ఎముకల నూనె.. ఎముకల దాణా మిశ్రమం..
- కల్తీ డాల్డా సీజ్.. ఫ్యాక్టరీకి తాళం
- కంపు భరించలేక దోర్నాల్ ప్రజల ఫిర్యాదు

ధారూరు, ఆగస్టు 13: ముక్కుపుటాలు పగిలిపోయే దుర్గంధం! ఆ కంపును భరించలేక రెండు ఊళ్ల ప్రజలు వాంతులూ చేసుకున్నారు! భరించలేని జనం ఆకంపెనీకి వెళ్లి చూస్తే జంతుకళేబరాలు, ఎముకలు, వాటితో తయారుచేసిన నూనె, కోళ్ల దాణా! సీడ్ కంపెనీ మాటున 'మారియా' అనేసంస్థ వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం దోర్నాల్ శివారులో చేస్తున్న కల్తీ దందా ఇది. గ్రామస్థుల ఫిర్యాదుతో రెవెన్యూ, పోలీసు అధికారులు ఆదివారం కంపెనీని సీజ్ చేశారు. సంస్థ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. దోర్నాల్ శివారులో సీడ్ ఇండస్ట్రీ పేరిట కోళ్ల దాణాను ఉత్పత్తి చేస్తున్న మారియా సీడ్ కంపెనీ నుంచి దోర్నాల్, దోర్నాల్ తండా పరిసరాల్లో దుర్గంధం వ్యాపిస్తోంది. కంపెనీ లోపలికి వెళ్లిన అధికారుల ముక్కులు ఆ దుర్గంధానికి అదిరిపోయాయి. కోళ్ల దాణా ఉత్పత్తికి వాడుతున్న ఎముకలను, యంత్రాలు, దాణా మిశ్రమం, డాల్డాను పోలీసులు, రెవెన్యూ అధికారులు పరిశీలించి పంచనామా నిర్వహించారు. కంపెనీలో పెద్ద ట్యాంకులో నిల్వ ఉన్న వెయ్యి లీటర్ల ఎముకల నూనె, 210 బస్తాల ఎముకల దాణా మిశ్రమం, 150 లీటర్ల డాల్డా, 38 దూది సంచులను స్వాధీనం చేసుకున్నారు. కాగా, అధికారులొస్తున్న విషయం తెలుసుకుని కంపెనీలో ఎముకల లోడుతో ఉన్న రెండు లారీలను యాజమాన్యం పంపించేసినట్టు గ్రామస్థులు చెబుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జంతు వ్యర్థాలు, కళేబరాలతో నూనె తయారుచేయడం నేరమని, ప్రజలకు చుట్టుపక్కల అటవీ ప్రాంతానికి కాలుష్య కారకంగా మారిన కంపెనీని సీజ్ చేసి కేసు నమోదు చేస్తున్నట్లు ధారూర్ సీఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఎముకలనూనె, దాణా మిశ్రమం, డాల్డా,ఎముకలను ల్యాబ్‌కు పంపించి పరీక్షలు చేయిస్తామన్నారు. కంపెనీ యజమాని మతులుక్ ఖురేషీపై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేస్తామని సీఐ చెప్పారు.





కంపెనీలో యంత్రాలు, ఎముకలను పరిశీలిస్తున్న సీఐ ఉపేందర్, (ఇన్‌సెట్లో) ట్యాంకులో నిల్వ చేసిన ఎముకల నూనె

నిర్బంధాన్ని ఎదిరిద్దాం

రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోంది

- అవినీతిపై పోరాడుతూనే పార్టీ బలోపేతం
- త్వరలో 'గడప గడపకు కాంగ్రెస్'తో ప్రజల్లోకి
- అసెంబ్లీ స్థాయిలో రాహుల్ సందేశ్ యాత్రలు
- కాంగ్రెస్ లక్ష్యం.. మిషన్ 2019
- టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో తీర్మానాలు

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోలీసురాజ్యం నడుస్తోందని, ఒక్క సభకు గానీ, సమావేశానికి గానీ అనుమతి ఇవ్వకుండా తీవ్ర నిర్బంధాన్ని కొనసాగిస్తోందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) ఆరోపించింది. దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని, అవినీతి పెచ్చుమీరిపోయిందని పేర్కొంది. ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదిరించి.. అవినీతిపై పోరాటం చేయాలని నిర్ణయించింది. ఆదివారం గాంధీభవన్‌లో టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్‌సీ కుంతియా, ఇన్‌చార్జి కార్యదర్శి సతీశ్ జార్కోలి, సీఎల్పీ నేత జానారెడ్డి, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టి విక్రమార్క, శాసనమండలి విపక్ష నేత షబ్బీర్ అలీ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. ఇటీవల గుజరాత్ పర్యటనలో రాహుల్ గాంధీ కారును ధ్వంసం చేసిన ఘటనను టీపీసీసీ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. ఇక ఉత్తర్‌ప్రదేశ్‌లో ఆక్సిజన్ అందక 60 మంది పసిపిల్లలు మృత్యువాత పడడంతో అక్కడి పాలకుల వైఖరిని ఖండిస్తూ తీర్మానం చేశారు. నేరెళ్ల ఘటనను తీవ్రంగా ఖండిస్తూ బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. కార్యవర్గ భేటీ అంశాలను టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, ప్రధాన కార్యదర్శి దాసోజు శ్రవణ్, అధికార ప్రతినిధులు అద్దంకి దయాకర్, మానవతారాయ్ మీడియాకు వివరించారు. ప్రాజెక్టుల కోసం భూసేకరణకు జీవో 123 కాకుండా 2013 భూసేకరణ చట్టాన్నే అమలుచేయాలని తీర్మానం చేసినట్లు, లేదంటే రైతుల తరపున కాంగ్రెస్ పోరాడనుననట్లు పేర్కొన్నారు.

సంస్థాపరంగా బలోపేతం..

కాంగ్రెస్ లక్ష్యం 2019 ఎన్నికలేనని, మిషన్-2019 దిశగా ముందుకు సాగాలని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలకు వ్యతిరేకంగా పోరాడుతూనే పార్టీని కూడా క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలని నిర్ణయించామన్నారు. కాంగ్రెస్ సిద్ధాంతాలను గడప గడపకు వెళ్లి ప్రజలకు వివరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సెప్టెంబరు 30లోపు బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీలు వేయాలని, సోషల్ మీడియా కమిటీలు మండల, డివిజన్, జిల్లా స్థాయి వరకు కమిటీలను ఆగస్టు 20 వరకు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పార్టీకి ఇపుడున్న అనుబంధ విభాగాలకు అదనంగా రీసెర్చ్ కమిటీ, కల్చరల్ కమిటీలను ఏర్పాటు చేయాలనుకున్నట్లు చెప్పారు. గతంలో కాంగ్రెస్ శ్రేణులకు రాష్ట్రస్థాయిలో శిక్షణ ఇచ్చామని, త్వరలో జిల్లా, అసెంబ్లీ, మండల స్థాయిలో శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. అసెంబ్లీ స్థాయిలో రాహుల్ సందేశ్ యాత్రలు ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వంపై రూపొందించిన చార్జిషీటును విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు.

పోలీసు జులుం



రాయదుర్గం పోలీస్ స్టేషన్

- కూతురి కోసం అదనపు డీసీపీ దందా
- ఆయనతో సహా ఇన్‌స్పెక్టర్, ఎస్సైపై కేసు
- 'రియల్' వ్యవహారంలో తలదూర్చిన వైనం
- ఇద్దరు వ్యక్తులపై స్టేషన్‌లో దౌర్జన్యం
- చెక్కులపై బలవంతంగా సంతకాలు



ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్



ఎస్సై రాజశేఖర్

హైదరాబాద్/రాయదుర్గం, ఆగస్టు 13: కూతురికి భూమి హక్కులు రాయించేందుకు ఓ అడిషనల్ డీసీపీ జులుం ప్రదర్శించాడు. బాధితులను బెదిరించి బలవంతంగా చెక్కులపై సంతకాలు చేయించుకున్నాడు. ఈ విషయం పోలీసు కమిషనర్ దృష్టికి వెళ్లడంతో.. సివిల్ పంచాయితీలో తలదూర్చిన ఆ డీసీపీ సహా నలుగురు పోలీసులపై కేసు నమోదైంది. వీరు సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్నారు. రాచకొండ కమిషనరేట్‌లోని అంబర్‌పేట్ కార్ హెడ్‌క్వార్టర్స్‌లో పులేందర్ రెడ్డి అడిషనల్ డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయన కూతురు టి.కీర్తి ఐశ్వర్యా రెడ్డి గచ్చిబౌలిలోని ఎన్‌సీసీ అర్బన్ ప్రాంతంలో ఉంటోంది. ఆమె రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం. టోలీచౌకికి చెందిన ఖైసర్‌బిన్ అబూబకర్‌తో పాటు 15మంది సభ్యులకు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు మండలం ముత్తంగిలో సర్వే నంబర్ 549/ఎలో రెండు ఎకరాల 7 గుంటల భూమి ఉంది. గత ఏడాది మార్చి 23న కీర్తి రూ.కోటి 10 లక్షలకు ఆ భూమిని కొనుగోలు చేసింది. అగ్రిమెంట్ ఆఫ్ జీపీఆర్‌పీ రాయించుకుని వారికి అడ్వాన్సుగా రూ.5 లక్షలు చెల్లించింది. మిగిలిన సొమ్ము చెల్లించేందుకు 45 రోజుల గడువు కోరింది. గడువు ముగిసినా ఆమె సొమ్ము చెల్లించకపోవటంతో అబూబకర్ గ్రూపు ఆ భూమిని గంగాధర్, రవీందర్ రెడ్డికి విక్రయించారు. ఈ విషయాన్ని కీర్తి తండ్రి పులేందర్ రెడ్డికి చెప్పింది. నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న ఆమె అదే ఠాణాలో ఫిర్యాదు చేయాలి. కానీ తండ్రి పలుకుబడితో ఆమె జూలై 25న అబూ బకర్‌పై రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, ఎస్సై రాజశేఖర్, కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ నార్సింగ్ వెళ్లారు. జూలై 26వ తేదీ అబూబకర్, అహ్మద్‌లను పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకూ పోలీస్ స్టేషన్‌లోనే కూర్చోబెట్టారు. పోలీసు మార్కు ట్రీట్‌మెంట్ రుచి చూపించారు. అబూ బకర్ వద్ద వున్న రూ.49 వేల నగదును ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ తీసుకున్నాడు. రూ.20 లక్షల చొప్పున మూడు చెక్‌లపై అతడి సంతకం తీసుకుని వదిలేశారు. బాధితులు సైబరాబాద్ కమిషనర్ సందీప్ శాండిల్యను కలసి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన సీపీ శాండిల్య ఆ నలుగురు పోలీసులపై కేసు నమోదు చేయాలని మాదాపూర్ ఏసీపీ రమణ్‌కుమార్‌ను ఆదేశించారు. ఏసీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన విచారణలో బాధితుల నుంచి చెక్‌లు తీసుకున్నట్లు నిర్ధారించారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఆ రోజు రికార్డయిన సీసీ కెమెరాల ఫుటేజ్ సేకరించారు. సీపీ ఆదేశాలతో అదనపు డీసీపీ పులేందర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, ఎస్సై రాజశేఖర్, కానిస్టేబుల్ లక్ష్మీనారాయణపై రాయదుర్గం ఠాణాలో శనివారం రాత్రి 448, 365, 342, 384, 147, 506, ఆర్/డబ్ల్యూ 149 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.



అయ్యో.. బోల్ట్!



రివ్వున చలిగాలి వీస్తోంది..అప్పటికే ఎంతో సేపటినుంచి స్టేడియంలో కిక్కిరిసిన అభిమానులు ఆత్రుతగా ఆ పరుగు కోసం ఎదురుచూస్తున్నారు.. ఇక టీవీల వద్ద అయితే కోటానుకోట్లమంది.. ఎంతకీ రేస్ మొదలుకాలేదు.. వారిలో అసహనం పెరిగిపోతోంది.. అయినా తమ అభిమాన అథ్లెట్‌కోసం దాన్ని ఓర్చుకున్నారు..ఎట్టకేలకు పరుగు మొదలైంది..ప్రేక్షకుల్లో ఉత్సాహం నిండింది..ఇక అతడికి స్వర్ణం, కెరీర్‌కు 'గోల్డెన్' వీడ్కోలు ఖాయం అనుకుంటుండగా జరిగిందో అనూహ్య ఘటన..ఆ యోధుడు పడిపోయాడు..అభిమానులు నిశ్చేష్టులయ్యారు..గాయంతో ఆ దిగ్గజం పరుగును పూర్తి చేయలేకపోయాడని తెలిసి ఒక్క క్షణం వారి గుండె ఆగినంతపనైంది.. అయినా 11 'ప్రపంచ' స్వర్ణాలతో లబ్ధప్రతిష్టుడై కెరీర్ ముగిస్తున్న ఉస్సేన్ బోల్ట్‌కు జేజేలు పలికారు..


- చివరి అంకంలో గాయం
- ట్రాక్‌పై కుప్పకూలి విలవిల
- రేస్ 40 నిమిషాలు ఆలస్యం
- చలిలో వణికిన అథ్లెట్లు

లండన్: దిగ్గజ అథ్లెట్ ఉసేన్ బోల్ట్ అద్భుత కెరీర్ విషాదంగా ముగిసింది. 100 మీటర్ల స్ప్రింట్‌లో మూడో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చిన ఈ జమైకా పరుగుల వీరుడు చివరి రేస్‌లోనైనా పసిడి పతకం సాధించి మహోన్నత కెరీర్‌కు మరింత ఉన్నతంగా వీడ్కోలు పలకాలన్న ఆశ నెరవేర లేదు. ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో ఆదివారం తెల్లవారుజామున జరిగిన పురుషుల 4×100 మీటర్ల రిలేలో ఆఖరి లెగ్‌లో పరుగెత్తిన 30 ఏళ్ల బోల్ట్.. గాయంతో ట్రాక్‌పై అనూహ్యంగా కుప్పకూలాడు. బాధతో విలవిల్లాడాడు. యావత్ స్టేడియం, టీవీలలో వీక్షిస్తున్న కోట్లాదిమంది అభిమానులు ఒక్క క్షణం ఏం జరుగుతోందో తెలియక ఆందోళన చెందారు. ఈలోపు బ్రిటన్, అమెరికా, జపాన్ అథ్లెట్లు ఫినిషింగ్ లైన్ దాటేశారు. కానీ బోల్ట్ అలా ట్రాక్‌పైనే మెలికలు తిరిగిపోయాడు. ఎడమ కాలి కండరం పట్టేయడంతో ఈ జమైకా చిరుత పరుగును పూర్తి చేయలేకపోయాడు. అగ్రస్థానంతో తాను కెరీర్‌ను ముగించలేకపోయానన్న బాధకన్నా.. కోట్లాదిమంది అభిమానులను నిరాశ పరిచానని, తన దేశానికి స్వర్ణ పతకం తేలేకపోయాన్న వేదన అతడిలో కనిపించింది. ఆపై గుండె బరువెక్కి కన్నీరు ఉబికింది. 34 ఏళ్ల వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో అత్యంత విజయవంతుడైన అథ్లెట్‌గా ఖ్యాతినార్జించిన బోల్ట్ మరిన్ని బంగారాలతో కెరీర్ ముగించాలని తలచాడు. అయినా ప్రపంచ అథ్లెటిక్స్‌లో 11 స్వర్ణ పతకాలు గెలుచుకోవడం ఓ చరిత్రే. ఇంకా ఎనిమిది ఒలింపిక్స్ బంగారాలు, రెండు 'వరల్డ్' రజత పతకాలతో మొత్తం 21 మెడల్స్‌తో ఎవరికీ అందనంత ఎత్తులో నిలుస్తాడు బోల్ట్.

వీల్‌చైర్ వద్దని..: బాధతో మెలికలు తిరిగిపోతున్న బోల్ట్‌ను చికిత్సకు తరలించేందుకు వైద్య సిబ్బంది వీల్ చైర్ తెచ్చారు. కానీ దానిపై వెళ్లేందుకు తిరస్కరించిన ఉస్సేన్ ..ట్రాక్‌పై తన ఆఖరి క్షణాలను మరింత ఆస్వాదించేందుకు అక్కడే ఉండిపోయాడు. అతడు కాలికండర గాయానికి లోనైనట్టు జమైకా టీమ్ డాక్టర్ వెల్లడించాడు. తమ దేశ ఐకాన్ ఉస్సేన్ చివరి రేస్ తిలకించేందుకు స్టేడియానికి వచ్చిన జమైకా అభిమానులు అతడి గాయంతో డీలాపడ్డారు. అంతలోనే తేరుకొని ఆ గొప్ప అథ్లెట్‌కు కరతాళధ్వనులతో బైబై చెప్పారు.

బ్రిటన్‌కు స్వర్ణం: బ్రిటన్ జట్టు 37.47 సెకన్లతో స్వర్ణం చేజిక్కించుకోగా, అమెరికా 37.52 సెకన్లతో రజతం, జపాన్ 38.04 సెకన్లతో కాంస్య పతకం గెలుపొందాయి. బ్రిటన్ టైమింగ్ వారి జాతీయ రికార్డుకాగా ఈ ఏడాది ప్రపంచ అత్యుత్తమ సమయం కావడం విశేషం.

వణికే చలిలో 40 నిమిషాలు: బోల్ట్ కండరాలు పట్టేయడానికి 4×100 మీటర్ల రిలేను 40 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభించడమే కారణమని అథ్లెట్లంతా విమర్శిస్తున్నారు. వాస్తవంగా ఈ పోటీ భారత కాల మానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున 2.20కి మొదలు కావాల్సి ఉంది. కానీ పురుషుల 5వేల మీటర్ల పరుగు, మహిళల హైజంప్ విజేతలకు పతకాలు ప్రదానం చేసేందుకు ఆ రేస్‌ను నిలిపి వేశారు. ఓ పక్కన గజగజ వణికే చలి, పోటీలో పాల్గొనే అథ్లెట్లంతా అప్పటికే 'సూట్ల'తో సిద్ధమయ్యారు. కానీ ఎంతకీ రేస్ ప్రారంభం కాలేదు. దాంతో రన్నర్లంతా దాదాపు ముప్పావుగంట అంత చలిలో వేచి చూడాల్సి వచ్చింది. ఓ మహోన్నత అథ్లెట్ క్రీడా జీవితం ఇంత బాధాకరంగా ముగియడానికి నిర్వాహకుల నిర్లక్ష్యమే కారణమని జమైకా స్ప్రింట్ జట్టు సభ్యుడు యోహాన్‌బ్లేక్ మండిపడ్డాడు. సుదీర్ఘ సమయం శీతల వాతావరణంలో వేచిచూడడమే బోల్ట్ గాయానికి కారణమని ఆరోపించాడు. 'వారు మమ్మల్ని ఎంతోసేపు చలిలో నిల బెట్టారు. ఇది చాలా దారుణం. స్టేడియం లోపల కూడా చాలా చలిగా ఉంది. శరీరాలను వేడిగా ఉంచేందుకు మేం ఎంతో కష్టపడాల్సి వచ్చింది. బోల్ట్ గాయానికి విపరీతమైన చలి పరిస్థితులే కారణం. మొత్తంగా మామీద చలే పైచేయి అయింది' అని బ్లేక్ వ్యాఖ్యానించాడు.







సహచరుల ఊరడింపు

ఇలా జరిగింది..

రేస్ మొదలైంది. జమైకా తరపున మెక్లాయిడ్ తొలి అంచె, జులియన్ ఫోర్ట్ రెండో దశలో పరుగెత్తారు. ఇక మూడో ల్యాప్‌లో పరుగెత్తిన బ్లేక్ నుంచి బ్యాటన్ అందుకున్న బోల్ట్ తన సహజ శైలిలో చిరుతలా పరుగెత్తాడు. అప్పటికి బ్రిటన్, అమెరికా అథ్లెట్లు ఇద్దరు మాత్రమే బోల్ట్ కంటే ముందున్నారు. కానీ బోల్ట్ రన్ చూస్తే జమైకాకు అగ్రస్థానం, ఆఖరి రేస్‌లో ఉస్సేన్‌కు స్వర్ణం ఖాయమని అనిపించింది. కానీ ఇంతలో ఊహించని సంఘటన చోటుచేసుకుంది. ఫినిషింగ్ లైన్‌కు 50 మీటర్ల దూరంలో బోల్ట్ ఒక్కసారిగా నెమ్మదించాడు. ఆ క్రమంలో కుంటుతూ ట్రాక్‌నుంచి పక్కకు రావడమేకాదు..బాధతో విలవిల్లాడాడు. అది మరీ ఎక్కువకావడంతో గింగిరాలు తిరుగుతూ కిందపడిపోయాడు. అంతే.. స్టేడియం యావత్తు ప్రాన్పడిపోయింది. కొద్దిసేపటి తర్వాత జమైకా వైద్య బృందం స్ట్రెచర్‌తో వచ్చింది. ఆ తర్వాత సహచరులు బోల్ట్ వద్దకు పరుగున వచ్చారు.

ఇనిస్ ప్రపంచ రికార్డు

లండన్ : ఈ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో తొలిసారి వరల్డ్ రికార్డు బద్దలైంది. మహిళల 50 కి.మీ.వాక్ రేస్‌లో పోర్చుగల్ అథ్లెట్ ఇనిస్ హెన్రిక్స్ తన ప్రపంచ రికార్డును తానే తిరగ రాసింది. ఆదివారం జరిగిన ఈ రేస్‌ను 4గంటల 05ని.56 సెకన్లలో ముగించి స్వర్ణం సాధించింది. ఈనేపథ్యంలో ఆమె 4గం.08.26సె తన రికార్డును అధిగమించింది. చైనాకు చెందిన హాంగ్‌యిన్, షుగింగ్ యాంగ్ రజత, కాంస్య పతకాలు నెగ్గారు.

మోకు షాక్: ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో వరుసగా 5, 10 వేల మీటర్లలో ఐదు 'గోల్డెన్ డబుల్' సాధించాలన్న బ్రిటన్ దిగ్గజ అథ్లెట్ మో ఫరా ఆశ నెరవేరలేదు. ఈ చాంపియన్‌షిప్స్‌లో 10వేల మీటర్ల టైటిల్ సాధించిన 34 ఏళ్ల మో..ఆదివారంనాటి 5వేల మీటర్లలో 13ని. 33.22సెకన్లతో రజతంతో సరిపెట్టుకున్నాడు. ఇథియోపియా అథ్లెట్ ఇద్రిస్ (13ని32. 79సె) స్వర్ణం, అమెరికాకు చెందిన పాల్ కిప్కిమోయ్ (13ని33.30సె) కాంస్య పతకం కైవసం చేసుకున్నారు.

అమెరికాకు మహిళల 4×100మీ.రిలే స్వర్ణం
మహిళల 4×100 మీటర్ల రిలేలో అమెరికా (41.82సె) స్వర్ణం, బ్రిటన్ (42.12సె) రజతం, జమైకా (42.19సె) కాంస్య పతకం సాధించాయి.

కుష్బీర్‌కు 40 వస్థానం: జాతీయ రికార్డ్ హోల్డర్ కుష్బీర్ కౌర్ మహిళల 20 కి.మీ.వాక్ రేస్‌లో ఒక గంటా 36ని.41సెకన్లతో 42వ స్థానంలో నిలిచింది.

బోల్ట్ గురించి ప్రముఖుల మాట..

- 'బోల్ట్‌తో పోటీపడే మరో అథ్లెట్ లేడు. అతడు గ్లోబల్ సూపర్ స్టార్' - మైకెల్ జాన్సన్
- 'అతడు ఓ ఐకాన్. అన్ని కాలాలకూ అతడే ఉత్తమ స్ప్రింటర్' - ఐఓసీ మాజీ అధ్యక్షుడు జాక్వెస్ రోగె
- 'భూప్రపంచంపై ఇతడికంటే వేగవంతమైన అథ్లెట్ మరొకరు లేరు' -బరాక్ ఒబామా
- ' మా దేశానికి బ్రాండ్ అంబాసిడర్' - జమైకా ప్రధాని

తన గురించి బోల్ట్..: 'నేను స్వయం ప్రకాశితం. మరొకరికి నేను ఫ్లాష్ కాదు. నేను లెజెండ్‌ను. జీవించి ఉన్న అథ్లెట్లలో నేను గొప్ప. ఎలిజిబెత్ మహారాణి నాకు 'నైట్‌హుడ్' అందజేస్తే..సర్ ఉస్సేన్ బోల్ట్ నవుతా. అలా పిలిపించుకోవడం వీనుల విందుగా ఉంటుంది.

పాండ్యా అదరహో..

- హార్దిక్ మెరుపు సెంచరీ
- భారత్ 487 ఆలౌట్
- బౌలర్ల విజృంభణ
- లంక 135 ఆలౌట్
- ఫాలోఆన్‌లో 19/1

క్యాండీ: శ్రీలంకతో మూడో టెస్ట్‌లోనూ టీమిండియా పట్టు బిగించింది. హార్దిక్ పాండ్యా శతక ప్రదర్శనతో పాటు బౌలర్ల అద్భుత బౌలింగ్ తోడుకావడంతో టీమిండియా మ్యాచ్‌ను శాసించే స్థితిలో నిలిచింది. హార్దిక్ (96 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 108) సెంచరీతో ఓవర్‌నైట్ స్కోరు 329/6తో రెండోరోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ మరో 158 రన్స్ జోడించి 487 వద్ద ఆలౌటైంది. కుల్దీప్ యాదవ్ (73 బంతుల్లో 2 ఫోర్లతో 26) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. లక్షణ్ సందకన్ 5 వికెట్లు సాధించగా.. పుష్పకుమార 3, ఫెర్నాండో 2 వికెట్లు తీశారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన లంక బ్యాటింగ్ వైఫల్యంతో 37.4 ఓవర్లలో 135 పరుగులకే కుప్పకూలి ఫాలోఆన్‌లో పడింది. కెప్టెన్ దినేష్ చాందిమల్ (48) టాప్ స్కోరర్. చైనామన్ బౌలర్ కుల్దీప్ 4 వికెట్లతో చెలరేగాడు. అశ్విన్, షమి చెరి 2 వికెట్లు తీశారు. ఫాలోఆన్ ఆడుతున్న లంక ఆదివారం ఆట చివరకు రెండో ఇన్నింగ్స్‌లో 13 ఓవర్లలో వికెట్ నష్టానికి 19 పరుగులు చేసింది. కరుణరత్నే (12 బ్యాటింగ్), పుష్పకుమార (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. లంక ఇంకా 333 పరుగులు వెనకబడి ఉంది.

పాండ్యా జోరు: పాండ్యా పోరాటంతోనే టీమిండియా భారీ స్కోరు చేయగలిగింది. హార్దిక్ 8వ వికెట్‌కు కుల్దీప్‌తో 62, 9వవికెట్‌కు ఉమేష్‌తో 66 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. వీరిద్దరి సాయంతోనే పాండ్యా కెరీర్‌లో తొలి శతకం నమోదు చేశాడు. ఆరంభంలోనే ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ సాహా (16) అవుటయ్యాక పాండ్యాతో కుల్దీప్ జతకలిశాడు. అర్ధ సెంచరీ పూర్తయ్యాక హార్దిక్ వేగం పెంచాడు. షమి (8) అవుటయ్యాక.. అతను ధనాధన్ బ్యాటింగ్‌తో లంక బౌలర్లకు చుక్కలు చూపించాడు. తొలుత సందకన్ బౌలింగ్‌లో ఓ భారీ సిక్సర్ కొట్టిన పాండ్యా.. స్పిన్నర్ పుష్పకుమార వేసిన 116వ ఓవర్‌లో వరుస బంతుల్లో 4, 4, 6, 6, 6తో 26 రన్స్ పిండుకున్నాడు. తర్వాత మరో 2 సిక్సర్లతో విజృంభించి సెంచరీ సాధించాడు.

సంక్షిప్త స్కోర్లు

భారత్ తొలి ఇన్నింగ్స్: మొత్తం 122.3 ఓవర్లలో 487 ఆలౌట్ (ధవన్ 119, హార్దిక్ పాండ్యా 108, లోకేష్ రాహుల్ 85, కోహ్లీ 42; లక్షణ్ సందకన్ 5/132, పుష్పకుమార 3/82, ఫెర్నాండో 2/87);
శ్రీలంక తొలి ఇన్నింగ్స్: మొత్తం 37.4 ఓవర్లలో 135 ఆలౌట్ (దినేష్ చాందిమల్ 48, డిక్‌వెలా 29, కుశాల్ మెండిస్ 18; కుల్దీప్ యాదవ్ 4/40, మహ్మద్ షమి 2/17, అశ్విన్ 2/22;
శ్రీలంక రెండో ఇన్నింగ్స్ (ఫాలోఆన్): మొత్తం 13 ఓవర్లలో 19/1 (కరుణరత్నే (బ్యాటింగ్) 12, పుష్పకుమార (బ్యాటింగ్) 0; ఉమేష్ 1/3)



హార్దిక్ (96 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 108)

హైదరాబాద్ పోలీస్‌కు కాంస్యాలు



హైదరాబాద్: ప్రపంచ పోలీస్ క్రీడల్లో హైదరాబాద్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్‌కు రెండు పతకాలు లభించాయి. ఈనెల 7 నుంచి 13 వరకు లాస్‌ఏంజిల్స్‌లో జరిగిన ఈ క్రీడల టెన్నిస్ ఈవెంట్‌లోని సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో ఎన్. కిరణ్ బోస్ కాంస్య పతకాలు సాధించాడు. కిరణ్ డబీర్‌పురా స్టేషన్‌లో సీఐగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు.

డ్రాతో గట్టెక్కిన పట్నా పైరెట్స్

- నేడు ప్రొ కబడ్డీ లీగ్‌కు విశ్రాంతి దినం

అహ్మదాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ ఐదో సీజన్‌లో పట్నా పైరెట్స్‌కు తొలి డ్రా ఎదురైంది. యూపీ ముంబాతో ఆదివారం జరిగిన ఉత్కంఠ మ్యాచ్‌లో పట్నా 27-27తో గట్టెక్కింది. పట్నా ఆటగాడు ప్రదీప్ నర్వాల్ ఆరంభంలో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన యూపీ 5-3, 13-10తో నిలిచింది. ఇక సెకండాఫ్‌లో పట్నా 11-13, 12-15తో ప్రత్యర్థిని అందుకునే ప్రయత్నం చేసింది. కానీ, 31వ నిమిషం వరకు యూపీ 22-17తో ఆధిక్యంలో కొనసాగింది. ఆఖర్లో నర్వాల్ మూడు పాయింట్లు తేవడంతో పట్నా 23-26 తో పుంజుకుంది. తుది నిమిషంలో తోమర్ పాయింట్‌తో యూపీ 27-25తో నిలిచింది. ఈ దశలో మరో పది సెకన్లలో ఆట ముగుస్తుందనగా నర్వాల్ 2 పాయింట్లు సాధించడంతో పట్నా 27-27తో మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. కాగా, మరో మ్యాచ్‌లో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ 27-20తో జైపూర్ పింక్ పాంథర్స్‌పై విజయం సాధించింది.

యువరాజ్ అవుట్

- రాహుల్ ఇన్
- ఉమేష్, షమి,అశ్విన్,జడేజాలకు విశ్రాంతి
- మనీష్‌పాండే పునరాగమనం
- లంకతో వన్డేసిరీస్‌కు టీమిండియా



యువరాజ్‌సింగ్

న్యూఢిల్లీ: వెటరన్ బ్యాట్స్‌మన్ యువరాజ్‌సింగ్‌కు సెలెక్టర్లు మొండిచేయి చూపారు. శ్రీలంకతో ఐదు వన్డేల సిరీస్‌కు ఆదివారం ప్రకటించిన జట్టు నుంచి అతడిని తప్పించారు. అలాగే రిషభ్‌పంత్, దినేశ్ కార్తీక్‌కూ చోటు దక్కలేదు. సెలెక్టర్ల ఈ నిర్ణయంతో ఇక యువరాజ్ అంతర్జాతీయ కెరీర్‌కు తెరపడినట్టేనని భావిస్తున్నారు. రెండుసార్లు ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు సభ్యుడైన 35 ఏళ్ల ఈ లెఫ్ట్‌హ్యాండ్ బ్యాట్స్‌మన్‌కు జట్టులో చోటుపై గతకొంతకాలంగా చర్చ నడుస్తున్న సంగతి తెలిసిందే. ఇక ధోనీని ఎంపిక చేయడంతో రాబోయే ప్రపంచకప్‌నకు అతడు రేస్‌లో ఉన్నట్టు అంచనా వేస్తున్నారు. వెస్టిండీస్‌లో పర్యటించిన టీమిండియా నుంచి యువకీపర్ రిషభ్ పంత్‌ను కూడా తప్పించారు. అతడి స్థానంలో కీపింగ్‌కూడా చేయగల కేఎల్ రాహుల్‌ను ఎంపిక చేశారు. అలాగే విండీస్ పర్యటనలో సత్తా చాటిన దినేశ్ కార్తీక్‌ను సైతం తప్పించారు. గాయపడిన ఇండియా ఏ కెప్టెన్ మనీష్‌పాండే స్థానంలో కార్తీక్‌కు గతంలో చోటు కల్పించడంతో..ప్రస్తుతం అతడికోసం దినేశ్‌ను తప్పించారు. సీనియర్ పేసర్లు ఉమేష్ యాదవ్, మహ్మద్ షమి సహా స్పిన్నర్లు అశ్విన్, జడేజాలకు విశ్రాంతి ఇవ్వాలని సెలెక్టర్లు నిర్ణయించారు. బుమ్రాకు తిరిగి స్థానం దక్కగా, ముంబై పేసర్ శార్దూల్ ఠాకూర్‌ను తొలిసారి టీమిండియాకు ఎంపిక చేశారు. లెఫ్టామ్ స్పిన్నర్ అక్షర్‌పటేల్, లెగ్‌స్పిన్నర్ చాహల్, చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్‌లతో స్పిన్ విభాగంలో యువరక్తం తొణికిసలాడుతోంది. 2015 నుంచీ వన్డేలు ఆడని వెటరన్ సురేష్ రైనాను మరోసారి స్టాండ్‌బైగా ఎంపిక చేశారు.


జట్టు : కోహ్లీ (కెప్టెన్), ధవన్, రాహుల్, రోహిత్ శర్మ, ధోనీ (కీపర్), కేదార్ జాదవ్, మనీష్‌పాండే, హార్దిక్ పాండ్యా, అక్షర్‌పటేల్, కుల్దీప్ యాదవ్, యజువేంద్ర చాహల్, భువనేశ్వర్ కుమార్, శార్దూల్ ఠాగూర్, బుమ్రా, రహానె.



'బ్లూ వేల్'కు మరొకరి బలి

- **గేమ్ ఆడి 15ఏళ్ల విద్యార్థి బలవన్మరణం**
- **ముఖానికి కవర్ చుట్టుకుని బాత్రూంలో ఆత్మహత్య**
- **భారత్‌లో మూడో బ్లూవేల్ ఘటన**

కోల్‌కతా, ఆగస్టు 13: సూసైడ్ చాలెంజ్ గేమ్ 'బ్లూ వేల్' మరో ప్రాణాన్ని మింగేసింది. గేమ్‌లో చివరి అంకం.. సూసైడ్ దశను పూర్తి చేయడానికి పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ మిడ్నాపోర్ జిల్లాలో ఓ 15ఏళ్ల టీనేజర్ ముఖానికి కవరు చుట్టుకుని ఊపిరి ఆడకుండా చేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పదవ తరగతి చదువుతున్న అంకన్ దేయ్ అనే విద్యార్థి శనివారం ఉదయం స్నానం చేస్తానని బాత్రూంలోకి వెళ్లి ఎంతకూ రాలేదు. దీంతో అనుమానం వచ్చి కుటుంబసభ్యులు బాత్రూం తలుపు పగులగొట్టి చూడగా అతడు విగత జీవిగా కనిపించాడు. తలకు పాలిథిన్ కవరు చుట్టుకుని, మెడకు టవల్ గట్టిగా బిగించినట్లుగా ఉంది. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లినా.. అప్పటికే అతడు మృతిచెందాడని వైద్యులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించి అంకన్ స్నేహితులను ప్రశ్నించగా అతడు.. ఎప్పుడూ బ్లూవేల్ గేమ్ ఆడుతూ కనిపిస్తుండేవాడని చెప్పారు. తమకు కూడా ఆ గేమ్ గురించి చెబుతానని ఎప్పుడూ అంటుండేవాడని వెల్లడించారు. ఏవైనా అసాంఘిక శక్తులు ఈ ప్రమాదకర గేమ్ ఆడేలా ఉసిగొల్పుతున్నాయా అని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, బ్లూవేల్ గేమ్ ఆడి ఆత్మహత్యకు పాల్పడిన మూడో ఘటన ఇది. ఆత్మహత్యకు ప్రేరేపించే ఈ గేమ్‌ను నిషేధించాలని ఇప్పటికే కేరళ సీఎం పినరయి విజయన్ ప్రధాని మోదీకి లేఖ కూడా రాశారు.



ఆటను తయారు చేసిందెవరు?

50 రోజుల చాలెంజ్ గేమ్.. బ్లూవేల్‌ను రష్యాకు చెందిన ఫిలిప్ బుడేకిన్(22) అనే విద్యార్థి సృష్టించాడు. రష్యాకే చెందిన సామాజిక మాధ్యమం వీ కొంటాక్టే(ఫేస్‌బుక్ లాంటిది)లో మొదటగా ప్రారంభమైంది. ఈ గేమ్ ఆడి చాలా మంది ప్రాణాలు కోల్పోవడంతో ఫిలిప్‌ను అతడు చదువుతున్న యూనివర్సిటీ బహిష్కరించింది. ప్రస్తుతం అతడు జైల్లో మూడేళ్ల శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ ఏడాది ఓ చానెల్ ఇంటర్వ్యూలో ఎందుకు ఆ గేమ్‌ను తయారు చేశావని ఫిలిప్‌ను ప్రశ్నించగా.. సమాజాన్ని శుభ్రం చేయడానికే అని సమాధానమిచ్చాడు.



హిజ్బుల్‌కు చావుదెబ్బ

- **కమాండర్ యాసిన్ ఇట్టూ, మరో ఇద్దరి ఎన్‌కౌంటర్**

శ్రీనగర్, ఆగస్టు 12: హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాద సంస్థను భారత బలగాలు చావుదెబ్బ కొట్టాయి. సంస్థ చీఫ్ ఆపరేషన్స్ కమాండర్ యాసిన్ ఇట్టూ అలియాస్ ఘజ్నవితో సహా ముగ్గురిని ఎన్‌కౌంటర్ చేసింది. జమ్ముకశ్మీర్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్, సైన్యం, సీఆర్పీఎఫ్ బలగాలు దక్షిణ కశ్మీర్‌లోని సోపియా జిల్లాలో శనివారం రాత్రి గాలింపు చేపట్టగా.. అవ్నిర గ్రామం వద్ద వారిపై మిలిటెంట్లు కాల్పులు జరిపారు. బలగాలు జరిపిన ప్రతికాల్పుల్లో యాసిన్ ఇట్టూతో పాటు అతని గార్డు ఉమర్, ఇర్ఫాన్ మరణించారు. కాగా 20 గంటల పాటు జరిగిన ఈ హోరాహోరీ పోరులో జవాన్లు ఇళయరాజా.పి (తమిళనాడు), గవాయ్ సుమేధ్ వామన్(మహారాష్ట్ర) వీరమరణం పొందారు.

హిమాచల్‌లో తెలంగాణవాసుల మృతి

విరిగిన కొండచరియలు.. లోయలో పడ్డ బస్సులు.. 50 మంది మృతి



బస్సులో చిక్కుకున్న మహిళను బయటకు తీస్తున్న సిబ్బంది

27 మృతదేహాలు వెలికితీత

మృతుల్లో నల్లగొండ, యాదాద్రి జిల్లాల వారు

బీబీనగర్/నార్కట్‌పల్లి/సిమ్లా/పిథోరగఢ్/ఖట్మండూ, ఆగస్టు 13: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు హిమాచల్ ప్రదేశ్‌లోని పఠాన్‌కోట్-మండి జాతీయ రహదారిపై శనివారం కొండ చరియలు విరిగిపడి ఇద్దరు తెలంగాణవాసులతో సహా 50 మంది వరకు మృతి చెందారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం అవురవాణి గ్రామానికి చెందిన దుబ్బాక కొండల్‌రెడ్డి(43), యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌కు చెందిన కాంతం రాజిరెడ్డి(42) ఎమ్మెల్సీ కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డికి చెందిన సుశీ హైటెక్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో మేనేజర్లుగా పనిచేస్తున్నారు. ఈ సంస్థ అస్సాం, అరుణాచల్‌లో 150 కి.మీ.ల ఘాట్‌రోడ్డు పనులు చేపడుతోంది. విధి నిర్వహణలో భాగంగా వీరిద్దరూ జీపులో వెళ్తుండగా కొండచరియలు విరిగి పడ్డాయి. దీంతో ఆ ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారి మృతదేహాలను స్వస్థలానికి రప్పించే ఏర్పాట్లు చేస్తున్నారు. కొండల్‌రెడ్డికి భార్య ఉమ, పిల్లలు మౌనిక, అరుణ్ రెడ్డి ఉన్నారు. అదే రోడ్డుపై అర్ధరాత్రి జోగిందర్ నగర్ ప్రాంతంలో రెండు ఆర్టీసీ బస్సులను నిలిపి టీతాగుతుండగా కొండ చరియలు విరిగిపడ్డాయి. దీంతో 2 కి.మీ. లోయలో ఓ బస్సు, 200 మీటర్ల లోయలో మరో బస్సు, రెండు వాహనాలు పడిపోయాయి. మండి జిల్లా అధికారుల పర్యవేక్షణలో సహాయక చర్యలు ప్రారంభించిన సైనిక, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది 27 మృతదేహాలను వెలికితీశారు. ఘటనా స్థలానికి చేరుకున్న హిమాచల్ ప్రదేశ్ సీఎం వీరభద్ర సింగ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించారు. ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. కాగా, ఉత్తరాఖండ్‌లోని మద్రామా గ్రామంలో వర్షాలకు కొండచరియలు విరిగిపడి 16 ఏళ్ల అమ్మాయి మృతి చెందింది. ఆమె తల్లిదండ్రుల జాడ కనిపించడం లేదు. 6 ఆవులు, 12 మేకలు కూడా మృత్యువాత పడ్డాయి.



భారీ లోయలో పడిన బస్సు, కారు

నేపాల్‌లో చిక్కుకున్న భారత పర్యాటకులు

నేపాల్‌లోని పర్యాటక ప్రాంతమైన చిత్వాన్‌లో సంభవించిన వరదల్లో 200 మంది భారతీయులు సహా 600 మంది పర్యాటకులు చిక్కుకున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వరదలు, కొండచరియలు విరిగిపడటంతో మృతుల సంఖ్య 49కు చేరింది. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. మరో 13 మంది గాయపడగా 17 మంది గల్లంతయ్యారు. 21 జిల్లాల్లో వరద ప్రభావం తీవ్రంగా ఉందని హోం మంత్రిత్వ శాఖ తెలిపింది. సహాయక చర్యలు తీవ్రతరం చేయాలని అధికారులను నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ ఆదేశించారు.


ఆగని మరణాలు!

- **గోరఖ్‌పూర్‌లో 72కి చేరిన మృతులు**
- **ఆస్పత్రిని సందర్శించిన సీఎం యోగి, నడ్డా**

గోరఖ్‌పూర్, ఆగస్టు 13: ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ బీఆర్డీ ఆస్పత్రిలో మృత్యుఘంటికలు మోగుతూనే ఉన్నాయి. శని, ఆదివారాల్లో మరో 12 మంది చిన్నారులు చనిపోయారు. దీంతో సోమవారం నుంచి ఆస్పత్రిలో మృతుల సంఖ్య 72కి చేరింది. తాజా మృతులకు మెదడువాపు వ్యాధి కారణమని ఆస్పత్రి వైద్యులు ప్రకటించారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా ఆదివారం ఆస్పత్రిని సందర్శించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో భావోద్వేగంగా మాట్లాడుతూ.. ఆస్పత్రిలో వారం రోజులుగా జరిగిన మరణాలన్నీ ఆక్సిజన్ కొరత వల్ల కాదన్నారు. ఆక్సిజన్ కొరత వల్లే చిన్నారులు చనిపోతే అంతకన్నా దారుణం ఉండదన్నారు. ఘటనపై విచారణకు ఆదేశించామని, తప్పు చేసినట్లు తేలితే ఎవ్వరినీ వదిలిపెట్ట మన్నారు. ప్రధాని మోదీ ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలుసుకుంటున్నారన్నా రు. దీన్ని రాజకీయం చేయొద్దని విపక్షాలను కోరారు. కేంద్ర మంత్రి నడ్డా మాట్లాడుతూ.. గోరఖ్‌పూర్‌లో చిన్న పిల్లల వ్యాధులపై పరిశోధనకు రూ.85 కోట్లతో ప్రాంతీయ వైద్య పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఆస్పత్రిలో 10వ తేదీన 2 గంటలే ఆక్సిజన్ అందలేదని ప్రభుత్వం చెప్తుండగా, మూడు రోజులుగా అందడం లేదని బాధితులు వాపోయారు. కాగా, బీఆర్డీ ఆస్పత్రి ఘటనపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. బీఆర్డీ ఆస్పత్రిలో పరిస్థితి ఘోరంగా ఉందని కాగ్ నివేదిక ఈ ఏడాది జూన్‌లోనే రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది.



గోరఖ్‌పూర్‌లోని బాబా రాఘవ్‌దాస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు



యోగా గురు బాబారాందేవ్ గెడ్డం పట్టుకుని ఆటపట్టిస్తున్న టిబెటన్ ఆధ్యాత్మిక గురువు దలైలామా. ముంబైలో ఆదివారం జరిగిన ప్రపంచ శాంతి సమావేశాల్లో ఈ సరదా సన్నివేశం చోటుచేసుకుంది. 'చైనాకు తగిన సమాధానం చెప్పడానికి భారత్ సిద్ధంగా ఉండాలని, శాంతిని వారు అర్థం చేసుకోలేకపోతే మనం యుద్ధంతో వారికి బదులివ్వాలని ఈ సందర్భంగా రాందేవ్ పేర్కొన్నారు. చైనా శాంతియుతంగా మారితే, ఇక దలైలామా భారత్‌లో ఉండాల్సిన అవసరం లేదన్నారు.

సంస్కరణలకు మోదీ టాటా!

- **ప్రజాకర్షణ దిశగా అడుగులు**

ముంబై, ఆగస్టు 13: కాలం చెల్లిన చట్టాలకు పాతర! పెద్దనోట్ల రద్దు! అతి పెద్ద పన్ను సంస్కరణ.. జీఎస్టీ ప్రారంభం! అన్నింటికీ ఆధార్, నగదు బదిలీ! రైల్వేబడ్జెట్‌కు చెల్లు! అతి త్వరలో ఆర్థిక సంవత్సరాన్ని కూడా జనవరి నుంచి డిసెంబర్‌కు మార్చే ఆలోచన! వెరసి.. ప్రధాని మోదీ అంటే సాహసోపేత సంస్కరణలకు మారు పేరుగా మారింది. అయితే రాబోయే కాలంలో సంస్కరణలన్నీ పక్కనపెట్టి, సంప్రదాయ రాజకీయ నాయకుడిలాగా ప్రజాకర్షక పథకాల వైపు మొగ్గు చూపే అవకాశాలున్నట్లు విశ్లేషణలు వెలువడుతున్నాయి. సార్వత్రిక ఎన్నికలకు ఏడాదిన్నర మాత్రమే ఉండటంతో భారీ సంస్కరణల జోలికి వెళ్లకుండా పన్నుల తగ్గింపు వంటి వరా లు ప్రకటిస్తారని 'బార్‌క్లేస్ ఇండియా' ప్రధాన ఆర్థికవేత్త సిద్ధార్థ సన్యాల్ పేర్కొన్నారు. "2019 ఎన్నికల్లో మళ్లీ విజయం పై బీజేపీ దృష్టి సారించింది. ఇక సంస్కరణలపై దూకుడుగా వెళ్లే అవకాశం లేదు. ఇప్పటిదాకా అమలు చేసిన సం స్కరణల ఫలాలు, అభివృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంపైనే మోదీ దృష్టి సారిస్తారని భావిస్తున్నాం" అని సిద్ధార్థ సన్యాల్ తెలిపారు. మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో మోదీ తెచ్చిన సంస్కరణల ఫలాలు ఇప్పుడిప్పుడే లభిస్తున్నాయన్నారు. మోదీ ఇకపై ప్రతి అడుగు ఆచితూచి వేస్తారని... ప్రధానిగా తాను సాధించిన విజయాలను, గడించిన ఖ్యాతి మొత్తాన్ని అత్యంత వ్యూహాత్మకంగా ప్రయోగిస్తారని తెలిపారు. 'సంస్కరణవాది'గా తనకున్న వ్యక్తిగత పేరుకంటే... బీజేపీ 'జాతీయవాద' ముద్రనే ఉపయోగిస్తారని పేర్కొన్నారు.

నదుల్లో కనీసం 20% నీళ్లు: ఎన్జీటీ

న్యూఢిల్లీ, ఆగస్టు 13: నదుల్లో కనీసం 15-20% నీళ్లు (ఎన్విరాన్ ఫ్లో) ఉండేలా చూడాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. ఎన్విరాన్-ఫ్లో అంటే... ఆయా కాలాల్లో మానవ మనుగడతోపాటు ఇతర జీవరాశులకు, పర్యావరణానికి అవసరమైన నాణ్యత కలిగిన నీటి పరిమాణం. ఇందు కోసం ఆ నదుల నీటి ప్రవాహం ఆధారంగా 15-20% ఎన్విరాన్-ఫ్లో ఉండేలా చూడాలని చైర్‌పర్సన్ జస్టిస్ స్వతంత్రకుమార్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. ఈ విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే సంబంధిత రాష్ట్రాలు కేంద్ర పర్యావరణ, అటవీశాఖను సంప్రదించవచ్చని పేర్కొంది.

చైనాలో భారతీయులకు అవమానం

- **షాంఘై విమానాశ్రయంలో ఘటన**

బీజింగ్, ఆగస్టు 13: చైనాలోని షాంఘై పుడోంగ్ విమానాశ్రయంలో ఈ నెల 6న భారత ప్రయాణికులకు అవమానం ఎదురైంది. వీల్‌చైర్‌లో వెళ్లాల్సిన ప్రయాణికుల పట్ల చైనా విమానయాన సంస్థకు చెందిన గ్రౌండ్ స్టాఫ్, అధికారులు దురుసుగా వ్యవహరించారు. ఉత్తర అమెరికా పంజాబీ సంఘం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్నమ్ సింగ్ చాహల్ తమకు ఎదురైన అనుభవాన్ని విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్‌కు లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. కాగా, ప్రయాణికుల వస్తువులను మాత్రమే తనిఖీ చేశామని, ఎవరినీ అవమానించలేదని చైనీస్ ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్ సంస్థ పేర్కొంది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: **K. Srinivas**, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .**Managing Director : Vemuri Radha Krishna**, Founder: K.L.N.Prasad.